


www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 9-11-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 221 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: పంచమి రా.1.55 తదుపరి షష్ఠి; నక్షత్రం: ఆర్ద్ర రా.8.04 తదుపరి పునర్వసు; వర్జ్యం: శేషం ఉ.7.12; దుర్ముహూర్తం: సా.4.06-4.51; అమృతఘడియలు: ఉ.10.53-12.21; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.20; సూర్యాస్తమయం: 5.36 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



వారానికి మూడుసార్లు జంక్‌ఫుడ్

19-25 ఏళ్ల వయసున్న విద్యార్థుల్లో 46% మంది తీరు ఇదే..

- జంక్‌ఫుడ్ తినేవారిలో అమ్మాయిలే ఎక్కువ
- ఆరోగ్యానికి హానికరమని తెలిసినా తింటున్నారు
- ఫాస్ట్‌ఫుడ్‌పై వారానికి రూ.300లకు పైగా ఖర్చు
- హైదరాబాద్ విద్యార్థులపై అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్ల పక్కన పానీపూరీ బండ్ల దగ్గర.. చాట్‌బండార్ల దగ్గర.. ఖరీదైన బహుళజాతి కంపెనీ ఫాస్ట్‌ఫుడ్ చెయిన్లలో.. ఎక్కడ చూసినా ఎక్కువగా కనిపించేది యువతీయువకులే! పానీపూరీ, దహీపూరీ, సమోసా చాట్, వడాపావ్, పావ్‌భాజీ, బర్గర్, పిజ్జా వంటివి తింటూ.. శీతలపానీయాలు తాగుతూ కాలక్షేపం చేస్తుంటారు!! ఇలా జంక్‌ఫుడ్ తినడానికి హైదరాబాద్‌లోని కాలేజీ విద్యార్థులు బాగా అలవాటుపడిపోయారని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం చేసిన అధ్యయనంలో తేలింది. ఈ స్టడీలో పాల్గొన్న వారిలో 46 శాతం మంది.. వారంలో కనీసం మూడుసార్లయినా ఈ తరహా తిండి తింటున్నట్టు తెలిపారు. జంక్‌ఫుడ్ తింటున్న వారిలో అమ్మాయిలే ఎక్కువగా ఉన్నట్లు ఈ అధ్యయనంలో వెల్లడైంది. ఈ స్టడీలో భాగంగా హైదరాబాద్‌లోని 409 మంది విద్యార్థులను ప్రశ్నించారు. వారంతా 18-25 ఏళ్ల వయసువారే. వారిలో 67% మంది అమ్మాయిలు కాగా.. 33% మంది అబ్బాయిలున్నారు. వారంతా.. ఇంజనీరింగ్, వైద్యవిద్య, దాని అనుబంధ విద్యలు చదువుతున్నవారే. స్టడీలో భాగంగా వారికి ఒక ప్రశ్నావళి

మిగతా 9వ పేజీలో...



జూబ్లీ తీర్పుతో రాష్ట్రంలో

కొత్త తుపాను!

- 4 లక్షల మంది ఓట్లతో 4 కోట్ల మందికి మేలు
- మీరు వేసే ఓట్లతో కాంగ్రెస్ దిమ్మ తిరగాలి
- ఎగురుతున్న వాళ్లందరి తోకలు కత్తిరిస్తాం
- ఆకు రౌడీలను రేవంత్ కూడా కాపాడలేడు
- ఎర్రగడ్డ రోడ్‌షోలో కేటీఆర్ వ్యాఖ్యలు


జూబ్లీహిల్స్‌లో రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్ సిటీ/ఎర్రగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలతో తెలంగాణలో కొత్త తుపాను రాబోతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. "ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలి. మీరు వేసే ఓట్లతో కాంగ్రెస్ నేతల దిమ్మ తిరగాలి" అని జూబ్లీహిల్స్ ఓటర్లకు పిలుపునిచ్చారు. నాలుగు లక్షల మంది జూబ్లీహిల్స్ ప్రజల తీర్పుతో నాలుగు కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు మేలు జరగబోతోందని వ్యాఖ్యానించారు. మరో 500 రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని, ఇప్పుడు ఎవరెవరు ఎగురుతున్నారో వారందరి తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి ఎర్రగడ్డలో నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్ మాట్లాడారు. "దార్లో యూసుఫ్‌గూడ జంక్షన్‌లో కారు ఆగితే పక్కన

మిగతా 2వ పేజీలో...

కిషన్‌రెడ్డి, రేవంత్‌ది ఫెవికాల్ బంధం

13 ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం ఉత్త మాటే: హరీశ్



గుంభనంగా..

ఉత్కంఠ రేపుతున్న జూబ్లీహిల్స్ ఓటరు తీరు

- మనసులో మాట బయటపెట్టేందుకు ససేమిరా
- ఏ పార్టీకి ఓటు వేస్తారో చెప్పేందుకు నిరాకరణ
- పార్టీలకు గుబులు పుట్టిస్తున్న సైలెంట్ ఓటర్లు
- 16 శాతం ఈ క్యాటగిరీలోనే అంటున్న సర్వేలు
- పైసలిచ్చిన పార్టీకే ఓటు అంటున్న కొందరు
- బస్తీ పెద్దమనిషి చెప్పిన పార్టీకేనన్న మరికొందరు
- స్పష్టంగా అభిప్రాయం చెబుతున్న పార్టీల అభిమానులు

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఎక్కడ చూసినా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపైనే చర్చ. ఎవరిని కదిలించినా.. జూబ్లీహిల్స్‌లో ఎవరు గెలుస్తారు? ఏ వర్గం వారి ఓట్లు ఎవరికి పడతాయి? అనే అంశంపైనే మాట్లాడుతున్నారు. ప్రధాన పార్టీలన్నీ ఈ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో రాష్ట్రం మొత్తం జూబ్లీహిల్స్ వైపే చూస్తోంది. అక్కడి ఓటర్లు ఇచ్చే తీర్పుకోసం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. కానీ, జూబ్లీహిల్స్ ఓటరు మాత్రం నోరువిప్పడం లేదు. తన మనసులో ఏముందో ఎవరికీ చెప్పడంలేదు. మీ ఓటు ఎవరికి? అని ప్రశ్నిస్తే, 'ఆ ఒక్కటి అడగొద్దు' అంటూ సైలెంట్ అవుతున్నాడు. క్షేత్రస్థాయిలో పరిశీలించినా, సర్వేల్లో చూసినా ఈ సైలెంట్ ఓటింగ్ ఈసారి భారీగానే ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఎన్నికల సర్వేల్లో తటస్థ ఓటర్లు 5-6 శాతం వరకు ఉంటుంటారు. కానీ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పలు సంస్థలు చేస్తున్న సర్వేల్లో ఈ తటస్థ ఓటర్లు 16 శాతానికి పైనే ఉంటోంది. కొన్ని సర్వేల్లో ఒక పార్టీ మూడు శాతం ఆధిక్యంలో ఉందంటే.. మరికొన్ని సర్వేల్లో ఇంకో పార్టీ మూడు శాతం ఆధిక్యంలో ఉందని వస్తోంది. అయితే ఈ రెండు రకాల సర్వేల్లోనూ సైలెంట్ ఓటింగ్

మిగతా 13వ పేజీలో...

పెద్దల మధ్యే 'జూబ్లీ' పోటీ!

- 3 పార్టీల ముఖ్య నేతలకు ప్రతిష్ఠాత్మకంగా ఎన్నిక
- తామే అభ్యర్థులమన్నట్లుగా ప్రచారం
- పరస్పర తీవ్ర వ్యాఖ్యలతో ప్రసంగాల్లో మంటలు
- విధులకూ సీఎం, కేంద్రమంత్రి విరామం 13
- రేవంత్, కిషన్, కేటీఆర్, హరీశ్‌లదే ప్రధాన పాత్ర
- రాష్ట్ర నేతలందర్నీ మోహరించిన మూడు పార్టీలు
- అపార్ట్‌మెంట్లు ఎక్కి దిగలేక నేతల ఆపసోపాలు
- బకాయిల పేరుతో డబ్బులడుగుతున్న ఓటర్లు

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

- డిప్యూటీ సీఎం భట్టి
- గత పాలకుల తప్పుల్ని సరిదిద్దుతున్నాం: దుద్దిళ్ల
- గత ప్రభుత్వ హయాంలో కమ్మ సామాజిక వర్గాన్ని వేధించిన ఘటనలు మరిచిపోలేదు 13
- టీడీపీ అభిమానులు ఆత్మగౌరవంతో ఓటేయాలి
- ప్రచారంలో మంత్రి తుమ్మల

రేవంత్, కేసీఆరే

బ్యాడ్ బ్రదర్స్

- వారిద్దరూ తెలంగాణ పాలిట శాపం
- వారికి మూడో బ్యాడ్ బ్రదర్‌గా అసదుద్దీన్ తోడయ్యారు
- అసమర్థత కప్పిపుచ్చేందుకే బీజేపీపై నెపం
- బీజేపీ, బీఆర్ఎస్ ఏ అంశంలో ఒక్కటయ్యాయ్
- సీఎం రేవంత్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లే బ్యాడ్ బ్రదర్స్ అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ ఇద్దరూ తెలంగాణ పాలిట శాపంగా మారారని, వీరికి మూడో బ్యాడ్ బ్రదర్‌గా అసదుద్దీన్ ఒవైసీ తోడయ్యారని ఆరోపించారు. కేటీఆర్, కిషన్‌రెడ్డి బ్యాడ్ బ్రదర్స్ అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. కేసీఆర్, అసదుద్దీన్, సోనియా కుటుంబమే తెలంగాణ పాలిట బ్యాడ్ బ్రదర్స్ అని అన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ

మిగతా 13వ పేజీలో...

కేటీఆర్.. నంబర్ వన్ దొంగ

- ఆయనకు వేల కోట్లు ఎలా వచ్చాయి? 3
- హిందూ వర్సెస్ ముస్లిం అన్నట్లుగా ఎన్నిక
- హైడ్రా పేరుతో కూల్చిన ఇళ్లన్నీ హిందువులవే
- జూబ్లీహిల్స్ ప్రచారంలో బండి సంజయ్

డిసెంబరు 1నుంచి పార్లమెంటు సమావేశాలు

- మూడు వారాల పాటు శీతాకాల సెషన్ నిర్వహణ
- 19న ముగింపు
- పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు వెల్లడి 12
- సమావేశాల వ్యవధిని కుదించడంపై విపక్షాల ఫైర్

పాక్ ఆర్మీ చీఫ్‌కు త్రివిధ దళాలపై పెత్తనం! 12

- కొత్తగా సీడీఎఫ్ పదవి..
- పాక్ సెనేట్‌లో బిల్లు
- దేశంలో సైన్యం ఆధిపత్యం ఇంకా పెరుగుతుందంటూ విశ్లేషకుల ఆందోళన



297 కిలోమీటర్లు..

20 వేల కోట్లు!

- ఫ్యూచర్‌సిటీ-బందరుపోర్టు గ్రీన్‌ఫీల్డ్ హైవే ఖర్చు అంచనా
- రాష్ట్రంలో 88,799 కోట్లతో కొత్త రహదారుల నిర్మాణం
- 8 లేన్లుగా హైదరాబాద్-విజయవాడ హైవే: కోమటిరెడ్డి



హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్‌సిటీ నుంచి అమరావతి మీదుగా బందరుపోర్టు వరకు ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణానికి రూ.20వేల కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా తేలింది. మొత్తం 297 కిలో మీటర్ల మేర నిర్మించనున్న రోడ్డు అలైన్‌మెంట్, భూసేకరణ, పరిహారం, నిర్మాణ ఖర్చు తదితర అంశాలపై ప్రభుత్వం ఒక నివేదికను రూపొందించింది. తాజాగా గ్రీన్‌ఫీల్డ్ హైవేతోపాటు రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రోడ్ల వివరాలను తెలియజేస్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేతో రాష్ట్ర ముఖచిత్రమే మారిపోనుందని తెలిపారు. రూ.8వేల కోట్లతో మన్ననూరు

మిగతా 3వ పేజీలో...

నా కుమారుడి మృతిపై

దర్యాప్తు చేయండి

రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో మాగంటి గోపీనాథ్ తల్లి ఫిర్యాదు 2




బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్‌కే అద్వానీ 98వ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రధాని మోదీ

పిల్లలకు వారు తుపాకులిస్తే.. మేం

ల్యాప్‌టాప్ ఇస్తున్నాం

- వారి పిల్లలకు పదవులు ఆశిస్తూ మీ పిల్లల భవితను కాలరాస్తున్నారు
- ఆర్జేడీ సహా విపక్షాలపై ప్రధాని ఫైర్
- విపక్షాలకు '65 వోల్టుల' షాకిచ్చారు
- బిహార్‌లో తొలిదశ పోలింగ్‌పై మోదీ
- రోడ్డు పక్కన వీవీప్యాట్ స్లిప్పులు
- సహాయ రిటర్నింగ్ అధికారిపై వేటు

పట్నా, నవంబరు 8: బిహార్ ఎన్నికల రెండో దశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాల్లో ఎన్డీయే అభ్యర్థుల తరఫున ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ప్రధాన ప్రతిపక్షం ఆర్జేడీ, కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలపై నిప్పులు చెరిగారు. సీతామర్హి, బెట్టియా జిల్లాల్లో నిర్వహించిన ప్రచార

మిగతా 12వ పేజీలో...

న్యూస్ పేపర్‌లో మధ్యాహ్న భోజనం!



- మధ్యప్రదేశ్‌లోని ఓ బడిలో ఘటన.. వీడియో వైరల్
- నా హృదయం ముక్కలైంది.. రాహుల్ ఆవేదన 12
- 20 ఏళ్లుగా రాష్ట్రాన్ని ఏలుతున్నారు.. పిల్లల ప్లేట్లను దొంగిలిస్తారా?
- వారి భవిష్యత్తును చిదిమేస్తున్నందుకు మోదీ సిగ్గుపడాలి అన్న నేత

ఊరంతా నాటుకోడి కూరే

- 2వేల నాటు కోళ్లను తెచ్చి రోడ్డుపై వదిలేసిన గుర్తుతెలియని వ్యక్తి
- ఎగబడి పట్టుకుపోయిన జనం
- హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఘటన 3
- కోళ్లకు ఆరోగ్య సమస్యలు లేవని నిర్ధారించిన వైద్యులు
- ఘటనపై స్థానికుల్లో చర్చ


నాటుకోళ్లు దొరికిన ఆనందంలో..

మహారాష్ట్ర మంత్రుల మెడకు

భూ కొనుగోళ్ల ఉచ్చు

- అక్రమాలు జరిగాయన్న విపక్షాలు
- అజిత్‌పవార్ కుమారుడు పార్థపవార్ 40 ఎకరాల కొనుగోలు రద్దు
- అయినా క్యాన్సిలేషన్ చార్జీల కింద సర్కారుకు 41 కోట్లు చెల్లించాల్సిందే
- రవాణా మంత్రి ప్రతాప్ సర్నాయక్ పైనా అక్రమ భూ కొనుగోళ్ల ఆరోపణలు
- ముంబైలో 4 ఎకరాలు కేవలం రూ.3 కోట్లకేనా?.. కాంగ్రెస్ నిలదీత

ముంబై, నవంబరు 8: మహారాష్ట్రలో మంత్రులకు సంబంధం ఉన్న భూమి కొనుగోలు వ్యవహారాలు వెలుగులోకి రావడంతో రాజకీయాలు వేడెక్కాయి. ఇవి కేవలం కొనుగోళ్లు కావని, కుంభకోణాలంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్, రవాణా మంత్రి ప్రతాప్ సర్నాయక్‌లపై ఆరోపణలు వస్తున్నాయి. తొలుత పుణెలో అజిత్ పవార్ కుమారుడు పార్థ

మిగతా 12వ పేజీలో...

సీఎం రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ సహా

ప్రముఖుల జన్మదిన శుభాకాంక్షలు

- రాష్ట్ర వ్యాప్తంగా సీఎం జన్మదిన వేడుకలు జరిపిన కాంగ్రెస్ శ్రేణులు



సీఎం రేవంత్ రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

న్యూఢిల్లీ/ చెన్నై/ వికారాబాద్/ హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం 57వ వసంతంలో అడుగు పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రేవంత్ జన్మదిన వేడుకలు జరిపారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్రమోదీ పలువురు ప్రముఖులు శనివారం పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. రేవంత్ రెడ్డి సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేసి రేవంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, కె.రామ్మోహన్ నాయుడు, బండి సంజయ్ కుమార్ ఎక్స్ వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు (ఏపీ), స్టాలిన్ (తమిళనాడు), సిద్దరామయ్య (కర్ణాటక) తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

స్పీకర్ ప్రభృతుల శుభాకాంక్షలు

సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన రేవంత్ కుటుంబ వివాహ వేడుకలకు హాజరై ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి , కొండాసురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు సీఎం నివాసానికెళ్లి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ప్రముఖ టాలీవుడ్ నటులు చిరంజీవి, బాలకృష్ణ, మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, రాంచరణ్, బాలీవుడ్ ప్రముఖులు అజయ్ దేవ్‌గన్, రితేశ్ దేశ్‌ముఖ్, డైరెక్టర్ వంగా సందీప్ రెడ్డి తదితరులు ఎక్స్ వేదికగా రేవంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. రేవంత్‌కు ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని, ఆయురారోగ్యాలను భగవంతుడు అందించాలని సినీ ప్రముఖులు ఆకాంక్షించారు. యాదగిరిగుట్ట ఆలయ అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనం అందించారు. హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ తీరాన సైకత శిల్పి వరప్రసాద్.. రేవంత్ రెడ్డి చిత్రం వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

జూబ్లీ తీర్పుతో

రాష్ట్రంలో కొత్త తుపాను!

(మొదటిపేజీ తరువాయి)



జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎర్రగడ్డలో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్

నిలబడిన ఆటో డ్రైవర్ మహమూద్‌తో మాట్లాడా. మహమూద్ భాయ్ ఎట్లుంది కాంగ్రెస్ పాలన? అంటే.. రెండేళ్ల నుంచి మొత్తం నాశనమైందని చెప్పాడు. కేసీఆర్ ఉన్నప్పుడు రోజుకు రెండు వేలు సంపాదించేవాడు. అందులో వెయ్యి మిగిలేవి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రోజుకు వెయ్యి వస్తే ఆటో కిరాయి, ఇంటికి, పిల్లల ఫీజులకు కూడా సరిపోవడం లేదని చెప్పాడు" అన్నారు. ఒక్కసారి తప్పు చేస్తే ఐదేళ్లు అనుభవించాల్సిదేనని చెప్పానని, ఇప్పుడేమైనా చేయొచ్చా? అని అడిగాడని, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడించి ఆ పార్టీ నాయకులకు బుద్ధి చెప్పడమే సరైన పరిష్కారమని సూచించానని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో బీఆర్ఎస్ లీడర్ షరీఫ్‌ను బలవంతంగా తీసుకెళ్లి కాంగ్రెస్ కండువా కప్పారని, టాస్క్ ఫోర్స్ పోలీసులను అడ్డం పెట్టుకుని నేతలపై దౌర్జన్యం చేస్తూ తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ నేతలకు సిగ్గుండాలని మండిపడ్డారు. హిట్లర్ వంటి నియంతే పతనమయ్యాడు, రేవంత్ ఎంత? అని ధ్వజమెత్తారు. పదేళ్లలో కేసీఆర్ ప్రజలను ఎలా చూసుకున్నారో, ఎలాంటి మంచి పనులు చేశారో అందరికీ తెలుసన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల సంఖ్యలో ఐటీ ఉద్యోగాలు పెరిగాయని, ప్రముఖ ఐటీ సంస్థలు హైదరాబాద్‌కు వచ్చాయని చెప్పారు. హోటళ్లు, చిరు వ్యాపారాలు బాగా నడిచాయని, రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నీ నాశనయ్యాయని అన్నారు. కాంగ్రెస్ 420 అబద్ధపు హామీలు ఇచ్చిందని, ఒక్కటి కూడా అమలు కాలేదని చెప్పారు. రేవంత్ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిండు? ఒక్కరినైనా చేశాడా? అని ప్రశ్నించారు. పేదలు కష్టపడి కొనుక్కున్న ప్లాట్ల ధరలు కూడా పడిపోయాయని వ్యాఖ్యానించారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో వేల ఇండ్లను నేలమట్టం చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి అన్న తిరుపతి రెడ్డి దుర్గం చెరువులో ఇల్లు కడితే హైడ్రా ఆయన జోలికి వెళ్లదని, మంత్రులు పొంగులేటి, వివేక్, పట్నం మహేందర్‌రెడ్డి ఇళ్లు చెరువులో కడితే వారిని ఏమనరని, పేదల ఇళ్లను మాత్రం కూలగొడతారని మండిపడ్డారు. 800 మంది రైతులు, 109 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కేసీఆర్ పథకాలను రేవంత్ ఆపేశాడని, పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలివరకు అందరినీ మోసం చేశాడని మండిపడ్డారు. కాంగ్రెస్ అరాచకాలకు భయపడుతున్న ప్రజలు కేసీఆర్ రావాలి అని అడుగుతున్నారని కేటీఆర్ చెప్పారు. కారుకు, బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నిక అని వ్యాఖ్యానించారు. కత్తి కాంగ్రెస్‌కు ఇచ్చి బీఆర్ఎస్‌ను యుద్ధం చేయమంటే కష్టమని, కత్తి మాకు ఇస్తే కాంగ్రెస్‌తో పోరాడుతామని, మీ ఇళ్లపైకి బుల్డోజర్ వస్తే అడ్డంగా పడుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ నేతలు ఓటుకు రూ.5 వేలు, రూ.6 వేలు ఇస్తున్నారని, యూసుఫ్‌గూడలో ఏకంగా రూ.8 వేలు కూడా ఇస్తున్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ నేతలు డబ్బులు ఇస్తే తీసుకుని బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు. ఇప్పుడు నకరాలు చేసే ఆకు రౌడీలను ఒక్కొక్కరి సంగతి తేలుస్తామని, ఎవడు తోక జాడించినా కత్తిరిస్తామని చెప్పారు. ఇప్పుడు ఎవరెవరు ఎగిరిపడుతున్నారో వారిని రేవంత్‌రెడ్డి కూడా రక్షించలేరని హెచ్చరించారు. సర్వేలన్నీ కాంగ్రెస్ ఓడిపోతోందని చెప్పగానే అజారుద్దీన్‌ను మంత్రిని చేశారని, జూబ్లీహిల్స్‌లో ఓడిస్తే అధికారాన్ని కాపాడుకొనేందుకు రేవంత్‌రెడ్డి హామీలన్నీ అమలు చేస్తాడని అన్నారు.

గోపీనాథ్ మృతిపై దర్యాప్తు చేయండి

రాయదుర్గం పీఎస్‌లో ఆయన తల్లి ఫిర్యాదు



రాయదుర్గం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడి మృతిపై దర్యాప్తు చేయాలని.. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తల్లి మహానంద కుమారి (92) శనివారం రాత్రి రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోపీనాథ్ మృతికి కారణాలపైన, ఆయన పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన వాళ్ల నిర్లక్ష్యంపైన విచారణ జరపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తన కొడుకు మృతి వెనక.. నిర్లక్ష్యం, సరిగ్గా చూసుకోకపోవడంతోపాటు మరింకేదో ఉన్నట్లు అనుమానంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గోపీనాథ్ అనారోగ్యంతో హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్స్‌లో ఈ ఏడాది జూన్ 5న చేరారని.. జూన్ 6న తాను ఆస్పత్రికి వెళ్తే తన కుమారుణ్ని చూడ్డానికి సెక్యూరిటీ సిబ్బంది తనను అనుమతించలేదని, గోపీనాథ్ కుమార్తె దిశిర రాతపూర్వకంగా వారికి ఇచ్చిన ఆదేశాలే ఇందుకు కారణమని ఆమె వాపోయారు. జూన్ 8న గోపీనాథ్ చనిపోయినట్లు ఆస్పత్రి ప్రకటించిందని.. అంతకు ముందే గోపీనాథ్ చనిపోయినప్పటికీ, ఆస్పత్రివర్గాలు ఆలస్యంగా ప్రకటించినట్లు తెలుస్తోందని ఫిర్యాదులో ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర పండుగగా కోటి దీపోత్సవం

- జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్రానికి లేఖ రాస్తా
- సతీ సమేతంగా కోటి దీపోత్సవానికి హాజరైన సీఎం

కవాడిగూడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో జరిగే కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర పండుగగా, అధికారిక ఉత్సవంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఎన్టీఆర్ స్టేడియంలో భక్తి టీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవానికి సతీ సమేతంగా హాజరైన ఆయన కోటి దీపోత్సవాన్ని జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తే జాతీయ గుర్తింపు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఇదే వేదికపై కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్ శుక్రవారం చెప్పడంతో రేవంత్ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. తన పుట్టిన రోజును నాలుగు కోట్ల ప్రజలకు వేదికగా నిలిచే కోటి దీపోత్సవ కార్యక్రమంలో జరుపుకోవడం ఆనందంగా ఉందని రేవంత్ చెప్పారు. ఈ సందర్భంగా సీఎం దంపతులను అల్దీపురం మఠం పీఠాధిపతి శ్రీవామనాశ్రమ స్వామి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎన్టీవీ అధినేత నరేంద్ర చౌదరి దంపతులు, స్వామీజీలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో అద్వానీ శిఖర సమానుడు

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్య



న్యూఢిల్లీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ భారతదేశ రాజకీయాల్లో శిఖర సమానుడని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. వ్యక్తిగతంగా అద్వానీ తనకు పితృసమానులన్నారు. అద్వానీ దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం, దృఢసంకల్పం యువతకు ఆదర్శనీయమైనవన్నారు. అద్వానీ పుట్టినరోజు సందర్భంగా ఆయన ఇంటికి వెళ్లి వెంకయ్య శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తన నివాసంలో మీడియా ప్రతినిధులతో ముచ్చటించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా విస్తృత సవరణ నేపథ్యంలో ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో రాజకీయ పార్టీలు తమ బాధ్యతగా ఓటర్ల తొలగింపు లేదా చేరికకు సంబంధించి ఓటర్ల జాబితాను సరిచూసుకోవాలని వెంకయ్య హితవు పలికారు.

ఎల్ఐసీని రక్షించుకునేందుకు

ఏజెంట్లు సైనికుల్లా పనిచేయాలి

- ఆలిండియా ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం పిలుపు
- ఖమ్మంలో సంఘం సౌత్ సెంట్రల్ జోనల్ 6వ మహా సభలు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)ను పరిరక్షించుకునేందుకు ఏజెంట్లు సైనికుల్లా పనిచేయాలని ఆలిండియా ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం(ఏవోఐ) అధ్యక్ష, కార్యదర్శులు సురజిత్‌కుమార్ బోస్, పీజీ దిలీప్ పిలుపునిచ్చారు. 99.5% క్లెయిమ్‌ల చెల్లింపులతో ఎల్ఐసీ ప్రపంచంలోనే నెంబర్ 1 బీమా సంస్థగా ఉందన్నారు. ఎల్ఐసీ ప్రజల ఆస్తి అని వారు పేర్కొన్నారు. ఎల్ఐసీ ఆలిండియా ఏజెంట్ల సంఘం సౌత్ సెంట్రల్ జోనల్ 6వ మహా సభలు శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సురజిత్, దిలీప్ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బ్యాంకులు, రైల్వేలు, బొగ్గు, రక్షణ, విద్యుత్ ఇలా అనేక రంగాలతో పాటు ఎల్ఐసీని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ దోపిడీకి గురైన ఇతర రంగాల కార్మికులను కలుపుకొని ఎల్ఐసీ ఏజెంట్లు ఉద్యమాలు చేసి సంస్థను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వం ప్రైవేట్ బీమా కంపెనీలను ఎంత ప్రోత్సహించినా ఎల్ఐసీ 30కోట్ల పాలసీదారులతో రూ.57లక్షల కోట్ల ఆస్తులను కలిగి ఉందని చెప్పారు.

మెరిడియన్‌స్కూల్లో అంతర్జాతీయ బాలల చిత్రోత్సవం

- ఈ నెల 14 నుంచి ప్రారంభం

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెరిడియన్ స్కూల్ మాదాపూర్, బంజారాహిల్స్ క్యాంపస్‌లు సంయుక్తంగా నిర్వహించనున్న అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవం ఈ నెల 14 నుంచి 30 వరకు విద్యార్థులను అలరించనుంది. స్కూల్ సినిమా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ భాగస్వామ్యంతో జరగనున్న ఈ వేదికపై 20కు పైగా దేశాలకు చెందిన 100కు పైగా బాలల చలన చిత్రాలను ప్రదర్శించనున్నారు. ఈ చిత్రాలు విభిన్న సంస్కృతులు, విలువలు తెలుసుకునే అవకాశం కల్పిస్తాయని మెరిడియన్ స్కూల్ సీఈవో తేజస్వి బుట్ట తెలిపారు.

సోమశిల టూ శ్రీశైలం లాంచీ సర్వీసు షురూ

- 6 గంటలు ఆహ్లాదకర ప్రయాణం

కొల్లాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగర్ కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకూ రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో కృష్ణానదిలో 'ఏసీ లాంచీ' సేవలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లా పర్యాటకశాఖ అధికారి కల్వరాల నరసింహ, కొల్లాపూర్ సీఐ మహేశ్, ఎస్ఐ హృషికేశ్ జెండా ఊపి లాంచీ సర్వీసులను ప్రారంభించారు. తొలుత కృష్ణా నదీమాతల్లికి ప్రత్యేక పూజలు చేశారు తర్వాత వివిధ ప్రాంతాలకు చెందిన 65 మంది పర్యాటకులు కుటుంబ సమేతంగా ఆహ్లాదకర వాతావరణంలో ఉదయం 10.15 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు శ్రీశైలంలోని పాతాళ గంగ వరకూ చేరుకున్నారు. ఈ లాంచీ ప్రయాణం శ్రీశైలం బ్యాక్ వాటర్ అందుబాటులో ఉన్న 4 నెలలే అందుబాటులో ఉంటుంది.

గురుకులంలో చేరిన విద్యార్థిని శివాని

పర్వతగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా చదువుకు దూరమైన ఐదో తరగతి విద్యార్థిని శివాని తిరిగి గురుకులానికి చేరుకుంది. పర్వతగిరి గురుకులం వైస్ ప్రిన్సిపాల్‌ను కలిసి మాట్లాడి శివానిని ఆమె తల్లిదండ్రులు హాస్టల్‌లో చేర్పించారు. పర్వతగిరి మండలం వడ్లకొండకు చెందిన వల్లందాసు స్వప్న-నాగరాజు దంపతుల కుమార్తె శివానిని గురుకులం నుంచి బహిష్కరించడంతో నాలుగు నెలలుగా చదువుకు దూరమైన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.. తన కార్యాలయానికి పిలిపించి గురుకులం ప్రిన్సిపాల్ అపర్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే గురుకులం వైస్ ప్రిన్సిపాల్ స్వాతిని కలిసి మాట్లాడిన శివాని తల్లిదండ్రులు.. ఆమెను హాస్టల్‌లో చేర్పించారు.

ఘనాలో పెట్టుబడులు పెట్టండి

- సింగరేణికి ఆ దేశ ప్రతినిధుల ఆహ్వానం

హైదరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఘనా దేశంలో పెట్టుబడులు పెట్టాలని ఆ దేశ ప్రతినిధులు సింగరేణి కాలరీస్‌ను ఆహ్వానించారు. ప్రపంచంలోనే వజ్రాలు, బంగారం, బాక్సైట్, మాంగనీస్, లిథియం తదితర ఉత్పత్తులకు కేంద్రంగా రిపబ్లిక్ ఆఫ్ ఘనా ఉంది. శనివారం సింగరేణి భవన్‌లో ఆ దేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సింగరేణి సీఎండీ బలరామ్‌తో సమావేశమై చర్చించింది. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం మాట్లాడుతూ.. ఖనిజ రంగంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. దీనిపై బలరామ్ స్పందిస్తూ మైనింగ్ అవకాశాలను పరిశీలిస్తామన్నారు. కాగా, సింగరేణిలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు రూ.50 లక్షల ప్రమాద బీమాను వర్తింపచేయాలని బ్యాంకులను సింగరేణి యాజమాన్యం కోరింది. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఏడు బ్యాంకుల ఉన్నతాధికారులతో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఒప్పంద కార్మికులకు ప్రమాద బీమాతో పాటు, సింగరేణి ఉద్యోగుల సహజ మరణాలకూ బీమాను పెంచే విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీనిపై బ్యాంకర్లు సానుకూలంగా స్పందించారు.

ఊరంతా నాటుకోడి కూరే

2వేల నాటు కోళ్లు వ్యానులో తెచ్చి రోడ్డుపై వదిలేసిన ఓ పెంపకందారుడు

- ఎగబడి దొరికినన్ని పట్టుకుపోయిన జనం
- హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఘటన
- పెంపకందారుడు ఎందుకు వదిలేసినట్లు?

ఎల్కతుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాటు కోడి! ఫారమ్‌కోడి కన్నా రుచి.. పోషకాలూ మెండు! ధరా ఎక్కువే!! ఇలాంటి నాటుకోళ్లు పదో, ఇరవయ్యో కాదు.. ఏకంగా ఓ రెండువేల కోళ్లను రాత్రిపూట వ్యానులో తెచ్చి గుట్టుచప్పుడు కాకుండా రోడ్డు మీద వదిలేసి వెళ్లిపోయాడో గుర్తు తెలియని పెంపకందారుడు! హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని ముల్కనూర్ వెళ్లే రహదారిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిందీ ఘటన. శనివారం ఉదయం చేలు, చెలకల్లో కోళ్లు కనిపించడంతో ఎల్కతుర్తి, ఇందిరానగర్ గ్రామస్థులు, ఆ దారి వెంట వచ్చిపోయే జనం వాటిని పట్టుకునేందుకు పోటీపడ్డారు. చేలు, పొదల్లోకి పరుగులు తీస్తూ దొరికినన్ని కోళ్లను చంకల్లో పెట్టుకొని.. చేతుల్లో, సంచీల్లో పట్టుకొని వెళ్లిపోయారు. ఫలితంగా శనివారం ఆ చుట్టుపక్కల ఊళ్లలో కోడి కూర వాసన గుప్పుమంది. ఆ నాటుకోళ్ల సైజు కాస్త చిన్నగా ఉన్నా కండపుష్టితో నిగనిగలాడుతూ పైకి ఆరోగ్యంగానే కనిపించాయి. మరి.. ఎందుకలా వదిలేసినట్లు? అనే అనుమానాలూ జనాలకు వచ్చాయి. పక్కాగా ఆ కుక్కుటాలకు ఏదైనా వైరస్ సోకి ఉండే ఉంటుంద నే వదంతులూ వ్యాపించాయి. ఎల్కతుర్తి ఎస్సై అకినేపల్లి ప్రవీణ్‌కుమార్ కొన్ని కోళ్లను ల్యాబ్‌కు పంపించారు. పరీక్షల్లో ఆ కోళ్లకు ఎలాంటి వైరస్ సోకలేదని వైద్యులు నిర్ధారించారు. కోళ్లలో ఎదుగుదల లేకపోవడం, వాటికి దాణా వేసే స్థోమత లేక వదిలేసి ఉంటారని పలువురు చర్చించుకుంటున్నారు. కోడిని రూ.50 చొప్పున అమ్మినా మస్తు పైసలొచ్చేవికదా? ఎందుకిలా చేసి ఉంటాడు ఆ పెంపకందారుడు? అని జనాలు చర్చించుకుంటున్నారు. అన్నట్టు.. శనివారం సాయంత్రం వరకు కూడా ముల్కనూరు సమీపంలోని చేలల్లో కొన్ని కోళ్లు కనిపించాయి.



కోళ్లను తీసుకెళ్తున్న గ్రామస్థులు

మాలిలో ఐదుగురు భారతీయుల కిడ్నాప్

బమాకో, నవంబరు 8: పశ్చిమ ఆఫ్రికా దేశం మాలి అలర్లతో అట్టుడుకుతోంది. అక్కడ పెరుగుతున్న జిహాదీ హింస నేపథ్యంలో ఐదుగురు భారతీయులు తాజాగా కిడ్నాప్‌నకు గురయ్యారు. ఈ విషయాన్ని వారి కంపెనీ, భద్రతా వర్గాలు ధ్రువీకరించాయి. కోబ్రిలోని ఓ కంపెనీలో విద్యుదీకరణ ప్రాజెక్టుల కోసం భారతీయ ఉద్యోగులు పనిచేస్తున్నారు. గురువారం కొందరు సాయుధ దుండగులు వారిపై దాడికి పాల్పడి.. ఐదుగురు భారతీయులను అపహరించి తీసుకెళ్లిపోయారు. దీంతో అప్రమత్తమైన ఆ కంపెనీ యంత్రాంగం.. మిగతా భారతీయులను రాజధాని బమాకోకు తరలించింది. ఇటు ఏ గ్రూప్ కూడా ఇప్పటివరకు కిడ్నాప్‌నకు పాల్పడినట్లు ప్రకటించుకోలేదు.

297 కిలోమీటర్లు.. 20 వేల కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

నుంచి శ్రీశైలం దాకా 52 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదనలు తుది దశకు చేరాయని తెలిపారు. మొత్తంగా రాష్ట్రంలో రూ.88,799 కోట్లతో రహదారుల నిర్మాణం చేపడుతుండగా, వీటిలో ఇప్పటికే రూ.60,799కోట్లతో పలు రోడ్ల పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మరో రూ.28వేల కోట్లతో చేపట్టనున్న రోడ్ల పనులు ప్రతిపాదనల దశలో ఉన్నాయన్నారు. రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనతో బహుళజాతి సంస్థలకు తెలంగాణ కేంద్రంగా మారుతోందని, లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని వెల్లడించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని కొంతమేర 8 లేన్లుగా, కొంత మేర 6 లేన్లుగా విస్తరించనున్నామని తెలిపారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర, దక్షిణ భాగాల నిర్మాణాల కోసం రూ.36వేల కోట్లు అవసరమని పేర్కొన్నారు. జాతీయ రహదారుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయడం వల్లే ఈ పురోగతి సాధ్యమైందని వివరించారు.

నంద్యాలలో యూరాలజీ వైద్యుల సదస్సు

- తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన 300 మంది

నంద్యాల హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల జెనిటోయూరినరీ సర్జన్స్ సొసైటీ రాష్ట్ర స్థాయి సదస్సును ఉస్మానియా ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ విక్రమసింహారెడ్డి శనివారం ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల యూరాలజీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ జగదీశ్వర్ అధ్యక్షతన కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్, నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ సీతారామయ్య, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ భార్గవవర్ధన్‌రెడ్డి నిర్వహణలో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విక్రమసింహా రెడ్డి మాట్లాడుతూ.. యూరాలజీ విభాగంలో దశాబ్దకాలంలో అధునాతన వైద్య విధానాలు, పరికరాలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజలకు మెరుగైన సేవలందించే అవకాశం వచ్చిందని తెలిపారు. దక్షిణ భారత యూరాలజీ సంఘం కార్యదర్శి డాక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ యూరాలజీలో కూడా ఏఐ వినియోగంతో అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచి 300 మంది వైద్యులు హాజరయ్యారు.

తిరుమల మొదటి ఘాట్‌లో కొండచిలువ



తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్ రోడ్డులోని ఏడో మైలు వద్ద సుమారు 15 అడుగుల పొడవైన కొండ చిలువ కనిపించడంతో వ్యాపారులు, దుకాణదారులు హడలిపోయారు. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని కొండ చిలువను పట్టుకున్నారు. అలాగే తిరుమల బాలాజీ నగర్‌లో 10 అడుగుల పొడవైన కొండచిలువ పట్టుబడింది. వీటిని అడవిలో వదిలిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

15 మంది పాలస్తీనీయుల మృతదేహాలు అప్పగించిన ఇజ్రాయెల్

ఖాన్‌యూనిస్(గాజా స్ట్రిప్), నవంబరు 8: తమ అధీనంలో ఉన్న 15 మంది పాలస్తీనీయుల మృతదేహాలను ఇజ్రాయెల్ శనివారం పాలస్తీనాకు అప్పగించింది. ఇందుకు సంబంధించి గాజాస్ట్రిప్‌లో ఉన్న ఓ ఆస్పత్రి అధికారులు ఓ ప్రకటన చేశారు. తమ వద్ద బందీగా ఉండి మరణించిన ఇజ్రాయెల్ వ్యక్తి మృతదేహాన్ని పాలస్తీనా మిలిటెంట్లు శుక్రవారం అప్పగించారు. దీంతో పాలస్తీనాతో చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందం మేరకు ఇజ్రాయెల్ చర్యలు చేపట్టింది. పాలస్తీనా మిలిటెంట్లు శుక్రవారం అప్పగించిన మృతదేహం తమ వ్యక్తిదే అని నిర్ధారించుకున్న వెంటనే 15 మంది పాలస్తీనీయుల మృతదేహాలను గాజా స్ట్రిప్‌లోని ఆస్పత్రికి చేర్చింది.



రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

జాతీయ రహదారిపై పత్తి రైతుల ధర్నా

- కొనుగోళ్ల పరిమితి పెంచాలంటూ నేరడిగొండలో ఆందోళన

నేరడిగొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని జాతీయ రహదారిపై పత్తి రైతులు రాస్తారోకో నిర్వహించారు. పత్తిని విక్రయించే సమయంలో తేమ శాతాన్ని 12 నుంచి 20కి పెంచాలని, ఎకరాకు కొనుగోళ్ల పరిమితిని 7 క్వింటాళ్ల నుంచి 12కు పెంచాలని డిమాండ్ చేశారు. ఇరువైపులా కిలోమీటరు మేర వాహనాలు నిలవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీసీఐ అధికారులతో మాట్లాడి పరిష్కారం అయ్యేలా కృషిచేస్తామని తహసీల్దార్ నాగోరావు హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ ఆడే వసంత్‌రావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, ప్రఫుల్ చందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి తదితరులు రాస్తారోకోలో పాల్గొన్నారు.

కేటీఆర్.. నంబర్ వన్ దొంగ

ఆయనకు వేల కోట్లు ఎలా వచ్చాయి?.. హైడ్రా పేరిట కూల్చిన ఇళ్లన్నీ హిందువులవే

- మేం వచ్చాక ఫాతిమా కాలేజీని కూల్చేస్తాం
- గోపీనాథ్ మరణం.. ముమ్మాటికీ మిస్టరీనే
- ఇదిగో ఫిర్యాదు.. విచారణ చేపట్టాలి
- ఉప ఎన్నిక ప్రచారంలో బండి సంజయ్



రహ్మత్ నగర్ కూడలిలో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తున్న బండి సంజయ్

హైదరాబాద్ సిటీ/బోరబండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ నంబర్ వన్ దొంగ, ఒకప్పుడు మడతల చొక్కా, రబ్బర్ చెప్పులేసుకుని తిరిగిన వ్యక్తికి వేల కోట్లు ఎలా వచ్చాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని పేదలు.. పేదలుగానే మిగిలిపోయారని, కేసీఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ పదవులు వచ్చాయని దుయ్యబట్టారు. పథకాలు, ప్రాజెక్టుల పేరుతో వేల కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట శివాజీ విగ్రహం, రహ్మత్ నగర్ కూడలిలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో బండి సంజయ్ మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయి.. కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే హైడ్రా పేరుతో పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు పంపుతోందన్నారు. హైడ్రా పేరుతో కూల్చిన ఇళ్లన్నీ హిందువులవేనని తెలిపారు. చెరువును కబ్జా చేసి కట్టిన ఫాతిమా కాలేజీకి జోలికి మాత్రం పోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఫాతిమా కాలేజీ భవనాన్ని కూల్చేస్తామని, అక్కడ పేదలకు ఇళ్లు కట్టిస్తామని స్పష్టం చేశారు. ఆ కాలేజీ విద్యార్థులకు అన్యాయం జరగకుండా మరో మంచి కాలేజీలో చేర్పిస్తామన్నారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉందని, హిందూ వర్సెస్ ముస్లిం అన్నట్టుగా ఈ పోరు జరగనుందని అన్నారు. సర్వేలన్నీ తారుమారయ్యాయని, వార్ వన్ సైడ్ లాగా ఈ ఎన్నికలో హిందువులే గెలవాలని ఆకాంక్షించారు. లక్ష ఓట్ల కోసం కాంగ్రెసోళ్లు మసీదులు, దర్గాల చుట్టూ బిచ్చగాళ్లలా తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. 80 శాతం మంది హిందువులంతా ఏకమై.... గడపగడపకూ తిరిగి బీజేపీకి ఓట్లేయించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ గెలిస్తే ఇళ్ల మధ్య ఖబరస్థాన్లు వెలుస్తాయని, పార్కులన్నీ ఈద్గాలు, దర్గాలుగా మారుతాయని చెప్పారు. బంజారాహిల్స్ పెద్దమ్మ గుడిని కూల్చిన నీచులు కాంగ్రెసోళ్లని, బీజేపీని గెలిపిస్తే అయోధ్య నుంచి పూజారులను పిలిపించి పెద్దమ్మ గుడిని కట్టిస్తాన్నారు. అమిత్ షాను పిలిపించి పూజలు చేయిస్తానని హామీ ఇచ్చారు. మాగంటి గోపీనాథ్ మరణం ముమ్మాటికీ మిస్టరీనే అని, ఈ విషయమై నెల క్రితమే మాదాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు నమోదైందని తెలిపారు. ఫిర్యాదు కాపీని సీఎం రేవంత్‌రెడ్డికి పంపిస్తున్నానని, దమ్ముంటే విచారణ చేపట్టాలని సవాల్ విసిరారు. గోపీనాథ్ ఆస్తుల కోసం దొంగ నాటకాలు ఆడుతున్న సునీతకు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చిందని దుయ్యబట్టారు. వరదలకు ఇళ్లు కొట్టుకుపోయినా, రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు మరణించినా కేసీఆర్ బయటకు రావడం లేదని, అటువంటి వారికి ఓటు వేస్తారా? అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ హిందువుల్లో రోషముంటే బీజేపీకి ఓటుబ్యాంకుగా మారాలని కోరారు. ఇక్కడ కాంగ్రెస్ గెలిస్తే ఎంఐఎం గెలిచినట్లేనని, హిందువుల బతుకులు బర్బాద్ అవుతాయని వ్యాఖ్యానించారు. తాను ప్రజలను రెచ్చగొట్టడం లేదని, వాస్తవాలు మాట్లాడుతున్నానని చెప్పారు. చార్మినార్ పై కాషాయ జెండా ఎగరేయడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

చట్టాలు స్థానిక భాషల్లో ఉండాలి

- అందరికీ అర్థమయ్యేలా సరళతరం చేయాలి
- ప్రధాని మోదీ సూచన

న్యూఢిల్లీ, నవంబరు 8: చట్టాలను సరళతరం చేసి, అందరికీ అర్థమయ్యేలా స్థానిక భాషల్లో అనువదించాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సామాజిక, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ సరళతర న్యాయం అందుబాటులోకి రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. న్యాయ సహాయ సేవలను పటిష్ఠం చేయడంపై శనివారం జరిగిన జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. జాతీయ న్యాయ సేవా సంస్థ (నల్సా)ను నెలకొల్పి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సదస్సును నిర్వహించారు. కోర్టు తీర్పులను ప్రాంతీయ భాషల్లో తర్జుమా చేయాల్సి ఉందని చెప్పిన ప్రధాని మోదీ ఈ దిశగా సుప్రీం కోర్టు చేస్తున్న కృషిని అభినందించారు.


విచారణ లేని నిర్బంధాలు ఒక ప్రత్యామ్నాయ శిక్షా విధానం. దీని నష్టం విస్తృతమైనది. నిందితుల న్యాయబద్ధ జీవనాధారాన్ని ఇది దెబ్బతీస్తుంది; వారి సామాజిక విశ్వసనీయతను నాశనం చేస్తుంది; నిరాశ్రయులను చేస్తుంది; తిరిగి నేరం చేసి, జైలుకు వెళ్లే పరిస్థితులను సృష్టిస్తుంది. ఈ పద్ధతి నేరాల నుంచి సమాజాన్ని రక్షించేది కాదు.

న్యాయ సహాయం రాజ్యాంగ బాధ్యత

సెల్‌ఫోన్ దొంగతనం చేశాడని అతణ్ణి అరెస్ట్ చేశారు. దాంతో కుటుంబంతో సంబంధం పూర్తిగా తెగిపోయింది. పోలీసులు ఏర్పాటు చేసిన న్యాయవాది కోర్టు నుంచి బెయిల్ తీసుకున్నాడు. అయినా నిందితుడు ఆరు నెలలుగా జైల్లోనే ఉన్నాడు. ఇక్కడ అతడి పేరు అవసరం లేదు, అతనొక సర్వనామం.

2023లో, బెయిల్ ఉన్నా 24,000 మంది ఖైదీలుగా ఉన్నారని సుప్రీంకోర్టు వెల్లడించింది. సగం రాష్ట్రాలు సమాచారం ఇవ్వలేదు కాబట్టి ఇది కనీస అంచనా. కారణాలు అనేకం. మేజిస్ట్రేట్ కోర్టులు బెయిల్ సమాచారాన్ని జైళ్లకు నేరుగా పంపడం లేదు. బెయిల్ షరతుల కంటే అడ్వకేట్ షరతులు భారమైతే నిందితునికి కష్టమే. సగటు నిందితుడికి పోలీసుల పట్ల ఉండే భయమే ఆయన పట్లా ఉంటుంది. ఈ పరిస్థితిలో ఇంకొక న్యాయవాది కానీ, న్యాయమూర్తి కానీ జోక్యం చేసుకోరు. మీకు, న్యాయవాదికి మధ్య బంధం 'పవిత్రమైనది'. అది జవాబుదారీతనానికి అతీతం.

గత కొన్నేళ్లుగా, ఏడాదికి 17 నుంచి 18 లక్షల మంది జైళ్లలో నిర్బంధితులవుతున్నారు. అధికారిక గణాంకాలు 'విచారణలో ఉన్న ఖైదీలు 73 శాతం' అంటాయి. కానీ వాస్తవ సంఖ్య 91 శాతం. వీరంతా న్యాయబద్ధంగా, చట్టరీత్యా నిర్బంధంలో ఉన్నారని ప్రాసిక్యూటర్స్ కూడా చెప్పలేరు. జరుగుతున్నదేమిటో పోలీసులకు, కోర్టులకు బాగా తెలుసు. 'నేరం రుజువు కానంత వరకు ప్రతి నిందితుడూ అమాయకుడే' అనే సూత్రం శతాబ్దాల పోరాట ఫలితం. రాజ్యాంగంలోని 22వ అధికరణ 'కస్టడీలో ఉన్న ఏ వ్యక్తికీ న్యాయవాదిని సంప్రదించే హక్కు, రక్షించుకునే హక్కును నిరాకరించరాదు'



అంటుంది. పోలీసులకు, న్యాయవాదులకు, న్యాయమూర్తులకు వర్తించే ఆదేశం ఇది. రాజ్యాంగ నిర్మాతలు వలస రాజ్యంలో చవిచూసిన అనుభవం ఈ అధికరణకు పునాది. వ్యక్తి స్వేచ్ఛ సహజమైన విషయంగా, దాన్ని ఉల్లంఘించడం అధికార స్వభావంగా ఈ అధికరణ తెలుపుతున్నది. చట్టబద్ధమైన, న్యాయబద్ధమైన కారణం లేకుండా, వ్యక్తి స్వేచ్ఛను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం. ముఖ్యంగా, న్యాయ సహాయం ద్వారా రక్షణ పొందే హక్కును ఎవరూ అడ్డుకోడానికి వీలులేదు. న్యాయ సమ్మతమైన కారణం లేకుండా వ్యక్తి స్వేచ్ఛను నిరాకరించే ప్రయత్నాన్ని ఎవరు చేసినా అడ్డుకునే బాధ్యత న్యాయవ్యవస్థ మీద ఉంది. కానీ ఈ నిబద్ధత–కార్యనిర్వాహక వర్గం పట్ల, న్యాయ వ్యవస్థ వైఖరి మీదా ఆధారపడుతుంది. ఫలితం స్పష్టం: విచారణ లేని నిర్బంధాలు లక్షల్లో!

నిందితుడికి, ప్రభుత్వానికి మధ్య ఉన్న అసమ సంబంధంలో ఎవరు ఓడిపోతారో తెలుసు. మరి రాజ్యాంగం హామీ ఇచ్చిన న్యాయానికి పట్టే గతేమిటి? ఈ ప్రశ్న ఫలితంగా చాలా దేశాల్లో న్యాయ సహాయం హక్కు నిందితుడికి వచ్చింది. అధికరణ 39A భారత రాజ్యాంగంలో చేరింది. 9 నవంబర్ 1995 నుంచి అమలుకు వచ్చిన న్యాయ సహాయ చట్టానికి నేటికి సరిగ్గా ముప్పై ఏళ్లు. అయినా 2023లో 11 శాతం మంది ఖైదీలకు మాత్రమే న్యాయ సహాయం అందింది.

బలహీనులు న్యాయం పొందడానికి న్యాయ సహాయం, లీగల్ డిఫెన్స్ ఒక ముఖ్య ఆయుధం కావాలి. రాజ్యాంగ న్యాయమంటే దయా భిక్ష కాదు, కాబట్టి న్యాయ సహాయం కూడా ధర్మం కావడానికి వీల్లేదు. న్యాయం అర్థించే వారిలో 90 శాతం మంది దళితులు, ఆదివాసీలు, నిరక్షరాస్యులు, నిరుద్యోగులు ఉంటే, ప్రతి న్యాయవ్యవస్థా ఈ హక్కును ఆచరణలోనూ ఆమోదించాలి. కానీ అది ధర్మంగా కూడా కాలేదు. 2023లో వ్యవస్థ చేసిన మొత్తం ఖర్చులో సింహ భాగం పోలీసుల మీద పెట్టి, న్యాయ సహాయం అందించడానికి ఒక శాతం కంటే తక్కువ తెలంగాణ ఖర్చు చేసింది. 'నిందితులకు ఆచరణలో హక్కులు ఉండవు' అనే పాలనా నీతి ఇది. రాజ్యాంగ రక్షణకు వ్యవస్థ లోపల నుంచి పట్టించిన తుప్పు ఇది. ఈ స్థితికి కారణాలు అనేకం.

దీర్ఘకాలం జైళ్లలో ఉన్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతూ ఉంది. మెజారిటీ మేజిస్ట్రేట్ కోర్టులు కారణాలు నమోదు చేయకుండా బెయిళ్లు నిరాకరిస్తున్నాయి. కొత్త నేరస్మృతిలో శిక్షలు పెంచారు, బెయిల్ హక్కు ఉన్న నేరాలను బెయిల్ హక్కు లేని నేరాలుగా మార్చారు. ఇది రాజ్యాంగ రక్షణల వ్యతిరేక వైఖరి.

నిందితులందరికీ న్యాయ సహాయం అందించాలనే లక్ష్యంతో జాతీయ న్యాయ సేవా సంస్థ 2023లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాదులను కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించింది. వ్యక్తి స్వేచ్ఛను రక్షించాలంటే, ప్రాసిక్యూషన్ అనుసరించే రివాజు పద్ధతులను వీరు ఎదుర్కోవాలి. నేరాల వల్ల బాధితులైన వ్యక్తుల పేరు మీద, వ్యవస్థ బాధితులను సృష్టించే వైఖరిని వ్యతిరేకించాలి. సహేతుకమైన కారణాలు లేని ఖైదును నిరసించాలి. జైలు నిర్బంధాన్ని చివరి చర్యగా కాకుండా, యథాలాపంగా ప్రయోగించడం రాజ్యాంగ విరుద్ధం అని వాదించాలి. ప్రతీకార ప్రజాభిప్రాయానికి వెరసి జైళ్లను నింపుతున్న న్యాయస్థానాలను జవాబుదారీ చేయాలి.

విచిత్రంగా మేజిస్ట్రేట్ కోర్టులకు బెయిల్ వ్యవహారం ప్రధాన కర్తవ్యం కాదు. నెలకు 18 కేసులలో విచారణ పూర్తి చేయాలని వాటికి హైకోర్టుల నుంచి నిర్దేశం ఉన్నది. ఫలితంగా బెయిల్ కేసులను పరిష్కరించడం వాటికి అప్రధానమైపోయింది. ప్రతి బెయిల్ ఆర్డర్‌ను 24 నాలుగు గంటలలో జైళ్లకు ఈ–మెయిల్ ద్వారా పంపాలన్న సుప్రీంకోర్టు ఆదేశానికి నాలుగేళ్లయినా దిక్కులేదు. ఈ కోర్టులకు, ఖైదీలకు మధ్య కమ్యూనికేషన్ ఉద్దేశపూర్వకంగానే వెనుకబడిపోయింది. ఇది లక్షల మంది జీవన్మరణ సమస్య.

దీర్ఘకాలం జైల్లో ఉన్నవారి కేసులను 'పరిష్కరించడానికి' జైలు అదాలత్‌లు ప్రారంభించారు. ఆ ఖైదీలు అక్కడ నుంచి బయటపడేందుకు 'నేరం చేశామని' ఒప్పుకోలు ఇచ్చేలా ఇది పరోక్షంగా ఒత్తిడి చేస్తుంది. ఈ అంగీకారాన్ని స్వచ్ఛందమని అనలేం. ఈ ఒప్పుకోలు అన్యాయంగా శిక్షకు దారి తీస్తుంది. శిక్ష పడినవారిగా పోలీసులకు అనుమానం వచ్చిన ప్రతిసారీ వీరు అరెస్టుకు గురౌతారు. ఇలాంటి ఒప్పుకోలు నుంచి రక్షించుకునే హక్కును రాజ్యాంగంలోని 20(3) అధికరణ ఇచ్చింది. ఈ విషయంలో ఖైదీలను రక్షించే బాధ్యత, న్యాయ సహాయ సంస్థకు ఉంది. కిక్కిరిసిన జైళ్ల సమస్యకు దీనిని ఒక పరిష్కారంగా చూడడమే ఒక విషాదం.

విచారణ లేకుండా శిక్షించడం భౌతిక నిర్బంధం మాత్రమే కాదు, ఒక ప్రత్యామ్నాయ శిక్షా విధానం. దీని నష్టం విస్తృతమైనది. నిందితుల జీవనాధారాన్ని దెబ్బతీస్తుంది; వారి సామాజిక విశ్వసనీయతను నాశనం చేస్తుంది; నిరాశ్రయులను చేస్తుంది; తిరిగి నేరం చేసి, జైలుకెళ్లే పరిస్థితులను సృష్టిస్తుంది. విచారణా క్రమాన్నే శిక్షగా మలిస్తే వ్యవస్థ పేదలను శిక్షించే పనిముట్టుగా తయారవుతుంది. అది వారి స్వేచ్ఛను మినహాయింపుగా, శిక్షను సాధారణ విషయంగా మార్చేస్తుంది. నేర న్యాయ వ్యవస్థే అప్పుడు బోనులో నిలబడుతుంది. అది కాకూడదు అంటే న్యాయ సహాయ హక్కును భిక్షగా కాకుండా, ఒక రాజ్యాంగ బాధ్యతగా వ్యవస్థ పరిగణించాలి.

• ప్రొఫెసర్ మురళి కర్ణం
నల్సార్ విశ్వవిద్యాలయం
(న్యాయ సహాయ చట్టానికి నేటికి ముప్పయ్యేళ్లు)

అమెరికాలో జవహర్‌లాల్!

జోహ్రాన్ మమ్దానీ అనే ఒక ముస్లిం అడ్వకేట్ న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికయ్యాడు. ఆయన విజయంలో అనేక ప్రత్యేకతలున్నాయి. జోహ్రాన్ భారత సంతతికి చెందినవాడు. తల్లి మీరా నాయర్ హిందువు, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన దర్శక నిర్మాత. తండ్రి మహమూద్ మమ్దానీ కూడా భారతీయ ముస్లిం. కొలంబియా విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్ర ప్రొఫెసర్. బహుగ్రంథాల రచయిత. ఇదే న్యూయార్క్ నగరంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు చెందిన రెండు టవర్లను 2001 సెప్టెంబరు 11న (9/11) అల్‌ఖైదా ఉగ్రవాదులు కూల్చివేసిన విషయం మనందరికీ తెలుసు. ఆ తరువాత ఇస్లాం సంస్కృతి సంప్రదాయాల్లోనే ఉగ్రవాదం వుందంటూ అమెరికా ప్రపంచవ్యాప్తంగా ప్రచారం మొదలెట్టింది. దీనినే ఇస్లామోఫోబియా అంటున్నాం. ఈ ప్రచారంలోని బూటకాన్ని బయటపెడుతూ మహమూద్ మమ్దానీ 'మంచి ముస్లిం, చెడ్డ ముస్లిం' అనే గ్రంథాన్ని రాసి ప్రచురించాడు. 1979లో సోవియట్ రష్యా ఆఫ్ఘనిస్థాన్‌ను ఆక్రమించినపుడు, ఆఫ్ఘన్ గెరిల్లాలకు ఆయుధాలు, డబ్బు సరఫరాచేసి, పాకిస్థాన్ సహకారంతో వారికి అమెరికా ఉగ్రవాద శిక్షణ ఇచ్చిందనీ, రోనాల్డ్ రీగన్ అధ్యక్షునిగా వుండగా ఆఫ్ఘన్ గెరిల్లాలను వైట్ హౌస్‌కు ఆహ్వానించి వాళ్లను స్వాతంత్ర్య సమరయోధులుగా పొగిడారనీ మమ్దానీ తగిన ఆధారాలతో ఈ పుస్తకంలో వివరించాడు.

మహమూద్ మమ్దానీ, మీరా నాయర్ ఉగాండాలో పనిచేస్తున్న కాలంలో వాళ్లకు జోహ్రాన్ మమ్దానీ జన్మించాడు. జోహ్రాన్ ఏడేళ్ల వయస్సులో వున్నప్పుడు మమ్దానీ కుటుంబం అమెరికాకు మారింది. జోహ్రాన్ ఈ ఏడాదే డిజిటల్ క్రియేటర్ రమా దువాజీని జోహ్రాన్ దుబాయ్‌లో నిఖా చేసుకున్నాడు. అలా వారిది ఒక రకంగా వసుధైక కుటుంబం. న్యూయార్క్‌లో జోహ్రాన్ అడ్వకేట్‌గా స్థిరపడి మానవ హక్కుల కార్యకర్తగా పనిచేస్తున్నాడు. అమెరికా ఎన్నికలు జోహ్రాన్‌కు కొత్తకాదు. న్యూయార్క్ శాసనసభకు అస్టోరియ (క్వీన్స్) నియోజకవర్గం నుంచి 2020లో పోటీ చేసి ఐదు వరుస విజయాలున్న ఘనాపాఠిని ఓడించాడు. 2022, 2024 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుండి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ప్రస్తుతం అతను శాసనసభ్యుడు.

ప్రపంచ రాజధానిగా భావించే న్యూయార్క్ నగరాన్ని సహజంగానే ప్రపంచ ధనవంతులు ఏలుతుంటారు. వాళ్లలో అత్యధికులు యూదులు. వాళ్లే రాజకీయ రంగాన్నీ శాసిస్తుంటారు. మీడియా కూడ వాళ్ల చెప్పుచేతల్లోనే వుంటుంది. వీళ్లను ఒలిగార్కీ అంటారు. ఒలిగార్కీ అండదండలు లేకుండా ఎవరూ అక్కడ ఏ రంగంలోనూ నిలదొక్కుకోలేదు. మేయర్ బరిలో దిగినప్పుడు జోహ్రాన్‌ను ఎవరూ పట్టించుకోలేదు. ఒక చేత్తో ప్లకార్డ్, మరో చేతిలో మైక్ పట్టుకుని ప్రసంగిస్తూ వీధుల్లో నడుస్తుంటే ఒక్కరూ తలతిప్పి చూసేవారు కాదు.

'న్యూయార్క్ వలసదారులు నిర్మించిన నగరం. వలసదారులు శక్తివంతంగా తీర్చిదిద్దిన నగరం. ఈ రాత్రి నుండి అయితే వలసదారులు నడుపుతున్న నగరం. ఇది వలసదారుల నగరంగానే కొనసాగుతుంది. అయ్యా డొనాల్డ్ ట్రంప్ గారూ, నా మాటలు గట్టిగా ఆలకించండి. ఇక్కడ మీరు ఎవరిని తాకాలన్నా మమ్మల్ని అందరినీ దాటుకుని వెళ్ళాలి' అంటూ జోహ్రాన్ తన విజయోత్సవ సభలో అన్న మాటలు అమెరికా రాజకీయాల్లో రాబోయే మార్పులకు సంకేతం కావచ్చు.

పోటీలో పదిమంది వుంటే మీడియా అతనికి పదో ర్యాంకు ఇచ్చింది. జోహ్రాన్ వయస్సు ఇప్పుడు 34 సంవత్సరాలు. జీ జెనరేషన్ సంప్రదాయం తెలిసినవాడు. న్యూయార్క్‌లో ధనవంతుల్ని అతను అస్సలు పట్టించుకోలేదు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేదల్ని లక్ష్యంగా పెట్టుకుని తన ప్రచారాన్ని సాగించాడు. 'గోదాంలో పెట్టెలు మోసి నీలి మచ్చలు పడ్డ వేళ్లు, డెలివరీ సైకిల్ హ్యాండిల్స్ వల్ల గట్టిగా మారిన అరచేతులు, కిచెన్‌లో కాలిన గాయాలు ఉన్న మునివేళ్లు. ఇలాంటి చేతులకు అధికారాన్ని పట్టుకునే అవకాశం ఎవరూ ఇక్కడ ఇవ్వరు'. 'ప్రతి అడ్డంకినీ దాటి, ఒక మహా రాజకీయ వంశాన్ని కూల్చివేసి, మన భవిష్యత్తును మన చేతులతో పట్టుకుందాం' వంటి మాటలు అణగారినవారికి గొప్ప ఉత్తేజాన్నిచ్చాయి.

ఎదురీదడం జోహ్రాన్ నైజం. అతను ముస్లిం అనీ, అవకాశం ఇస్తే 9/11 టెర్రరిస్టు సంఘటనలు పునరావృతం అవుతాయని ప్రచారం మొదలెట్టారు ప్రత్యర్థులు. 'శరణార్థి, చొరబాటుదారుడు' అన్నవాళ్లూ వున్నారు. దానికి అతను భుజాలు తడుముకోలేదు. 'అవును నేను ముస్లింను. ముస్లిం ఆచార వ్యవహారాలను పాటిస్తాను' అంటూ తాను ఇష్టంగా బిర్యాని తింటున్న వీడియోను సోషల్ మీడియాలో పెట్టిన గడుసరి.

ప్రపంచంలో యూదులు అత్యధికంగా నివసిస్తున్న నగరం న్యూయార్క్. అలాంటి నగరంలో ఏ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నా ముందు యూదు పెద్దల ఇంటికి వెళ్లి ఆశీర్వాదం తీసుకోవడం సంప్రదాయం. తాము గెలిస్తే ముందు ఇజ్రాయెల్ వెళతామని ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు వాగ్దానం చేస్తుంటారు. జోహ్రాన్ మహామొండి. తాను మేయర్‌గా గెలిస్తే, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును న్యూయార్క్‌లో కాలుపెట్టనీయనని ప్రకటించాడు. 'ఒకవేళ అతను వస్తే, అరెస్టు చేస్తాను' అని కరాఖండీగా చెప్పాడు. యుద్ధనేరాలకు పాల్పడినందుకు నెతన్యాహు మీద ఏడాది క్రితం ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ఒక అరెస్టు వారెంటు జారీచేసిన విషయం తెలిసిందే.

న్యూయార్క్ మహానగరంలో జోహ్రాన్ ఒక సామాజికార్థిక సరిహద్దు గీత గీశాడు. ఉన్నోళ్లు తన ప్రత్యర్థులు, లేనోళ్లే తన మద్దతుదారులు. పేదల ఇంటింటికి వెళ్లి వాళ్ల కష్టాలు తెలుసుకున్నాడు. వాటి పరిష్కారాల కోసం పథకాలు ప్రకటించాడు. హెల్త్ కేర్, ఇంటి రెంటు, సొంతిల్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి అంశాల మీద జోహ్రాన్ ప్రకటించిన సంక్షేమ పథకాలు జనాకర్షణగా మారాయి. ఒక అడ్వకేట్‌గా మానవ హక్కుల పరిరక్షణ కోసం అతను చేస్తున్న కృషికి కూడా పెద్ద సంఖ్యలో అభిమానులు ఏర్పడ్డారు. సోషల్ మీడియాలో అతని భార్య సాగించిన ప్రచారం కూడా బాగా పనిచేసింది. క్రమంగా అతని మద్దతుదారులు పెరిగారు. మమ్దానీ రేసులో దూసుకుపోతున్నాడనే సంకేతాలు రాగానే ఒలిగార్కీ తన దగ్గరున్న పావులన్నీ కదిపింది. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ మమ్దానీని హేళన చేశాడు. అతణ్ణి మేయర్‌గా ఎన్నుకుంటే న్యూయార్క్ నగరానికి ఫెడరల్ నిధుల్లో కోత విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించాడు. డెమోక్రాటిక్ పార్టీకే చెందిన అమెరికా మాజీ అధ్యక్షుడు బారక్ ఒబామా సైతం మమ్దానీ కోసం ప్రచారం చేయడానికి నిరాకరించాడు.

సాహిత్యంతో పరిచయం ఉన్నవాళ్లకు మమ్దానీ ఉపన్యాస శైలి జాక్ లండన్ నవల 'ఉక్కుపాదం' (ఐరన్ హీల్)లోని కథానాయకుడు ఎర్నెస్ట్ ఎవ్వర్ హర్డ్‌ను గుర్తుకు తెచ్చింది.



న్యూయార్క్ మహానగరంలో జోహ్రాన్ ఒక సామాజికార్థిక సరిహద్దు గీత గీశాడు. ఉన్నోళ్లు తన ప్రత్యర్థులు, లేనోళ్లే తన మద్దతుదారులు. పేదల ఇంటింటికి వెళ్లి వాళ్ల కష్టాలు తెలుసుకున్నాడు. వాటి పరిష్కారాల కోసం పథకాలు ప్రకటించాడు.


సామాజిక ఉద్యమాలతో పరిచయం వున్నవాళ్లకు ముస్లిం మస్జీద్ నిర్మాత, ఆఫ్రో అమెరికన్ ఉద్యమకారుడు మాల్కమ్–ఎక్స్‌ను గుర్తుకు తెచ్చింది. ప్రత్యర్థులు మమ్దానీని కమ్యూనిస్టు, మార్క్సిస్టు, రాడికల్ అన్నారు. ఈ మాటలతో న్యూయార్కీయులు భయపడతారని అనుకున్నారు. కానీ అందుకు విరుద్ధంగా జరిగింది. ఇస్లామోఫోబియా రాజ్యం చేస్తున్న చోట ఒక ముస్లింను ఎన్నుకున్నారు. వలసదారుల భరతం పడతానంటూ దేశాధ్యక్షుడు రంకెలు వేస్తున్న చోట ఒక వలసదారుడిని గెలిపించారు. ఇదేమీ విప్లవం కాదు; అక్కడేమీ సోషలిస్టు రాజ్యం ఏర్పడడంలేదు. కాకపోతే, ప్రధానంగా ఇది అమెరికాలో అణగారిన సమూహాలకు ఆత్మగౌరవ విజయం!

ఆర్థిక విధానాల్లో రిపబ్లికన్స్, డెమొక్రాట్స్ మధ్య పెద్ద తేడా లేదు. డెమోక్రాట్స్‌లో జోహ్రాన్ నిస్సందేహంగా వామపక్షం. మనకు కూడా కాంగ్రెస్‌లో ఒకప్పుడు కుడిపక్షం, వామపక్షం ఉండేవి. గోపాలకృష్ణ గోఖలే, సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ కుడిపక్షం; జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వామపక్షంగా వుండేవారు. జోహ్రాన్ మమ్దానీ కమ్యూనిస్టు కాదు; నక్సలైటూ కాదు. కేవలం సోషల్ డెమోక్రాట్. అతనిప్పుడు అమెరికాలో జవహర్‌లాల్ నెహ్రూ. గెలిచినప్పుడు కూడ అతను నెహ్రూని తలుచుకోవడం యాదృచ్ఛికం కాదు.

'న్యూయార్క్– వలసదారులు నిర్మించిన నగరం. వలసదారులు శక్తిమంతంగా తీర్చిదిద్దిన నగరం. ఈ రాత్రి నుంచి అయితే వలసదారులు నడుపుతున్న నగరం. ఇది వలసదారుల నగరంగానే కొనసాగుతుంది. అయ్యా డొనాల్డ్ ట్రంప్ గారూ! నా మాటలు గట్టిగా ఆలకించండి. ఇక్కడ మీరు ఎవరిని తాకాలన్నా మమ్మల్ని అందరినీ దాటుకుని వెళ్లాలి' అంటూ జోహ్రాన్ తన విజయోత్సవ సభలో అన్న మాటలు అమెరికా రాజకీయాల్లో రాబోయే మార్పులకు సంకేతం కావచ్చు.

■ డానీ
సమాజ విశ్లేషకులు

ఒకే ఒక్కడు!



దేశంలో ఎప్పుడు, ఎక్కడ ఎన్నికలు జరిగినా ఠక్కున గుర్తుకొచ్చే పేరు టీఎన్ శేషన్. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నది ఆరేళ్ళయినా, దశాబ్దాలపాటు చెరగని ముద్రవేశారాయన. అహంకారి, నియంత, జగమొండి అని ఎన్ని విమర్శలు వచ్చినా, నాయకులు అభిశంసన హెచ్చరికలు చేసినా, ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళించేవరకూ ఈయన విశ్రమించలేదు. కేరళలో పుట్టిన తిరునెల్లయ్ నారాయణ అయ్యర్ శేషన్ చంద్రశేఖర్ ప్రభుత్వం హయాంలో ఎన్నికల సంఘం ప్రధానాధికారి అయ్యారు. వచ్చీ రావడంతోనే కార్యాలయంలో దేవుళ్ళ, నాయకుల ఫోటోలు ఉండనివ్వకుండా, రాజ్యాంగ విహితంగా పనిచేసి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే మన విధి అని స్పష్టం చేశారు. అప్పటికి ఉత్తరాది రాష్ట్రాల్లో చేతిలో తుపాకీ ఉన్నవాడిదే అధికారం. డబ్బు, మద్యం, విచ్చలవిడి హింస, కిడ్నాప్‌లతో ఎన్నికల్లో నెగ్గుకువచ్చే భయానకమైన పరిస్థితులను మార్చి, ఓటరు ధైర్యంగా పోలింగ్ కేంద్రానికి వెళ్ళే వాతావరణాన్ని ఆయన కల్పించాడు. ప్రవర్తనానియమావళి అంటే పట్టని పార్టీలూ, అభ్యర్థులూ దానిని తూచ తప్పకుండా అనుసరించేట్టు చేశాడు. మారుమూల ప్రాంతాల్లో అభ్యర్థులు సైతం శేషన్ ఏ క్షణాన వస్తాడోనన్న భయంతో వొణికిపోయేవారు. ఏ చిన్న తప్పుజరిగినా ఎన్నిక రద్దవుతుందన్న ఆందోళనలో పార్టీలు ఉండేవి. తాను కోరిన అధికారిని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కేటాయించనందుకు ఎన్నికలు జరిపేది లేదని హెచ్చరించి దారికి తెచ్చుకున్న ఘనుడు శేషన్. మధ్యప్రదేశ్ గవర్నర్ తన కుమారుడి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు ఆ నియోజకవర్గం ఎన్నికను నిలిపివేశారు శేషన్. యూపీలో ప్రచార సమయం ముగిసినా కూడా ప్రసంగిస్తున్నందుకు ఒక మంత్రిని వేదికమీద నుంచి అమాంతం దించేసిన సాహసి. కొన్ని గంటల్లో పోలింగ్ ప్రారంభం కావాల్సిన పంజాబ్‌లో ఏకంగా ఎన్నికలే రద్దుచేశారాయన. మద్యం, డబ్బు, కుల, మత ప్రచారాలకు ఆయన సమర్థవంతంగా అడ్డుకట్టవేశారు. రామన్ మెగసెసే పురస్కారం అందుకున్న ఈ చండశాసనుడు 2019 నవంబరు 10న కన్నుమూశారు.

○ టి.సేవకుమార్



'ఇంతకాలమూ జరిపిన ఉద్యమంలో తప్పులు జరిగాయి. ఇప్పటి పరిస్థితుల్లో సాయుధ పోరాట మార్గం సరైనది కాదు. పార్టీతో మాకు విభేదాలున్నాయి'– అని లొంగిపోయిన వాళ్ళు అనడం అప్పుడూ వుంది, ఇప్పుడూ వుంది. 'ఆ తప్పులు దిద్దుకుని, వేరే పోరాట మార్గం ఎంచుకోవచ్చునుగా, ప్రభుత్వానికి లొంగిపోవడం ఎందుకు?'

'విప్లవ' నాయకుల లొంగుబాట్లు: అప్పుడూ, ఇప్పుడూ!

ఇటీవల మావోయిస్టు పార్టీలోని కొందరు 'అగ్రనాయకులు' ప్రభుత్వానికి లొంగిపోయినప్పటి దృశ్యాలూ, వార్తలూ కొన్ని చూశాను. వాటిని చూశాక, మార్క్సిజంతో ఏకీభావం వున్న వ్యక్తిగా, నాకు తోచింది చెప్పాలనిపించింది.

మావోయిస్టు పార్టీ నాయకులు, 2000లోనూ, 2004లోనూ, బూర్జువా ప్రభుత్వాలతో చర్చలు జరపాలనుకున్నప్పుడు, నేను పత్రికల్లో 5 వ్యాసాలు రాశాను. 'చర్చలు జరగవలసింది ప్రభుత్వంతో కాదు, తోటి విప్లవ గ్రూపులతో' అన్నది ఆ వ్యాసాల సారాంశం. అలాగే, అబద్ధపు ఎన్‌కౌంటర్లు జరిగినప్పుడు గతంలోనూ, ఇటీవల కాలంలోనూ కూడా నేను ప్రభుత్వాలను ఖండిస్తూనూ; మావోయిస్టుల అవగాహనలోనూ, ఆచరణలోనూ కనపడే లోపాలను విమర్శిస్తూనూ కూడా 5, 6 వ్యాసాలు రాశాను. పెద్ద ఎత్తున లొంగుబాట్లు జరుగుతున్న ఈ సందర్భంలో, చర్చించవలిసిన విషయాలు ఎన్నో వున్నా, విప్లవ నాయకుల లొంగుబాట్లలో కనపడే తేడాల గురించి మాత్రమే చెప్పదల్చుకున్నాను.

(1) గతంలో, అగ్ర నాయకులు లొంగిపోయేటప్పుడు కొంచెం సిగ్గు మొహాలతో కనిపించేవారు. ఇప్పుడు ఏ మాత్రమూ సిగ్గూ, బిడియమూ లేకుండా, ముఖ్యమంత్రులనూ, పోలీసు ఉన్నతాధికారులనూ ఆనుకుని, ఫొటోలూ, చిరునవ్వులూ, కరస్పర్శలూ, లాల్ సలామూలూనూ! అంతేనా? ఏ రాజ్యాంగాన్నయితే, 'దోపిడీ వర్గ రాజ్యాంగం' అన్నారో, ఆ పుస్తకాన్నే, 'దోపిడీ వర్గ ప్రతినిధులైన' ముఖ్యమంత్రుల చేతుల్నించీ, వినయంగా స్వీకరించడం! (2) గతంలో, లొంగిపోయేటప్పుడు, అనారోగ్య సమస్యలతో లొంగిపోతున్నట్టు చెప్పేవాళ్ళు, పత్రికల వారి ముందు. 'అనారోగ్యమే సమస్య అయితే, పార్టీకీ, ప్రజలకీ చెప్పి, వేరే విధంగా సమస్యను పరిష్కరించుకోవచ్చుగదా? ప్రభుత్వం దగ్గరికి వచ్చి లొంగిపోవడం ఎందుకు?'– అనే ప్రశ్న వస్తుందనే ఆలోచనే లేదు అప్పుడూ, ఇప్పుడూ కూడా! ఇప్పుడైతే, గడుసుగా, ఎటువంటి జంకూ గొంకూ లేకుండా, 'ఇది లొంగుబాటు కాదు. జనజీవన స్రవంతిలోకి వచ్చాము. మేము మావోయిస్టు సిద్ధాంతాన్ని వదిలిపెట్టలేదు. కాకపోతే ఇప్పుడు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజలకోసం పోరాడుతాం' అని దబాయిస్తున్నారు. 'జనాల మధ్యకొచ్చి పనిచేస్తాము–అంటున్నారు కదా? ఇప్పటిదాకా పనిచేసింది ఆదివాసీల మధ్యనే కదా? మరి, ఆదివాసీలు జనాలు కాదా?' అని ఏ పత్రికా విలేకరీ అడగటం లేదు. (3) గతంలో, లొంగిపోయిన వారికి, వారి తలలకి లక్షల్లో వెలలు కట్టి, ఆ డబ్బుల్ని, లొంగిపోయిన కొన్నాళ్ళకుగానీ ఇచ్చేవి కావు ప్రభుత్వాలు. ఇప్పుడు, చెక్కులు అయితే డబ్బులుగా మార్చుకోవడానికి ఆలస్యం అవుతుందని, ఏకంగా డిమాండ్ డ్రాఫ్టులనే ఇచ్చేస్తున్నారు. హవ్వ! డబ్బుకోసం లొంగుబాట్లా? అంటే... ఇప్పటిదాకా, బూర్జువా పార్టీ నాయకులే డబ్బుకి అమ్ముడుపోతారని జనాలు అనుకునేవారు. ఇప్పుడు, అమ్మకానికి 'విప్లవ' నాయకులు కూడా కొందరు సిద్ధమేనేమో–అని జనాలు సందేహించాల్సివస్తోంది! (4) గతంలో, అడివిలోనే ఉండిపోయే పార్టీవారికి తమ ఆయుధాలు అప్పగించి, ఉత్తచేతులతో లొంగిపోయేవాళ్ళు. ఇప్పుడు ఆయుధాల్ని శుభ్రం చేసి, గెరిల్లా యూనిఫారాలు తొడుక్కుని మరీ, చిరునవ్వులు చిందిస్తూ, తలలు వంచి ఆయుధాలను ముఖ్యమంత్రులకు అందిస్తున్నారు.

(5) 'ఇంతకాలమూ జరిపిన ఉద్యమంలో తప్పులు జరిగాయి. ఇప్పటి పరిస్థితుల్లో సాయుధ పోరాట మార్గం సరైనది కాదు. పార్టీతో మాకు విభేదాలున్నాయి'– అని లొంగిపోయిన వాళ్ళు అనడం అప్పుడూ వుంది, ఇప్పుడూ వుంది. 'ఆ తప్పులు దిద్దుకుని, వేరే పోరాట మార్గం ఎంచుకోవచ్చునుగా, ప్రభుత్వానికి లొంగిపోవడం ఎందుకు?' అనే ప్రశ్నలు పత్రికా విలేకరులు వెయ్యరనే ధీమా! (6) విప్లవ నాయకుల్ని అభిమానిస్తూ, మైదాన ప్రాంతాలలో వుంటూ, వారికి సహకరించే పనులు చేతనైనంత చేస్తూ, ప్రభుత్వ వేధింపులకు గురిఅయ్యేవారు ఎవరన్నా ఇలా అడిగారనుకోండి: 'అదేమిటి కామ్రేడ్? వీర విప్లవ నినాదాలు చేసి, ఇప్పుడు ఇలా లొంగిపోవడం ఎందుకు?' అని అడిగారనుకోండి! ఇలా అడిగినప్పుడు, గతంలో లొంగిపోయిన నాయకులు, దబాయింపులు లేకుండా మిన్నకుండేవారు. ఇప్పటి లొంగిపోయిన నాయకులైతే ఆగ్రహిస్తూ, 'హైదరాబాదులో కూచుని, ఇక్కడి సమస్యలు తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడడమేమిటి?' అంటున్నారు. విప్లవాభిమానులు ఎవ్వరూ కూడా, వీరిని ఉద్యమాల్లోకి వెళ్ళమని బలవంతపెట్టలేదే? అక్కడ సమస్యలు వుండితీరతాయని వీరికి తెలియదా? 'విప్లవమంటే విందు భోజనం కాదని' 1927 లోనే మావో అన్నాడని తరచూ ఉటంకించిన పార్టీలో ఎంతోకాలంగా పనిచేసిన వారే కదా వీరు? మరి ప్రశ్నించే విప్లవాభిమానుల మీద ఆగ్రహం ఎందుకు? లొంగిపోయిన నాయకులు ఒక్కొక్కరూ, ముప్పయ్యేసీ, నలభయ్యేసీ ఏళ్ళపాటు, అనేక కష్ట నష్టాలు ఓర్చి నిలబడినందుకు, విప్లవాభిమానులకు వీరంటే ఇప్పటిదాకా గౌరవమే! కానీ, అన్నేళ్ళ త్యాగాల్నీ, దోపిడీవర్గ పాలకుల పాదాక్రాంతం చేసినందుకే దిగ్భ్రాంతి! (7) ఇప్పుడు లొంగిపోయిన నాయకులు, 'కగార్' పేరుతో సాగుతున్న నిర్బంధాన్ని తట్టుకోవడం కష్టం. కార్యకర్తల్ని రక్షించుకోవడం కోసమే ప్రభుత్వం పిలుపు మేరకు మేము సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నాం. మావోయిజాన్ని వదిలేది లేదు' అని ప్రగల్భాలు పలుకుతున్నారు. ఈ ప్రగల్భాల మీద, ఎన్ని ప్రశ్నలైనా వెయ్యవచ్చును. గత ప్రభుత్వం 'గ్రీన్ హంట్' పేరుతో నిర్బంధాన్ని అమలు చెయ్యలేదా? 1969 నించీ ఎన్ని వేలమంది ఉద్యమకారుల్ని అబద్ధపు ఎదురు కాల్పులలో ప్రాణాలు తియ్యలేదూ, ఈ ప్రభుత్వాలు? అయినా, నిర్బంధాల నించీ తప్పించుకోవడానికి లొంగుబాటు తప్ప ఇంకో మార్గం వుండదా? దేశభక్తి మత్తులో తేలియాడే పాటే అయినప్పటికీ, 'షకీల్ బదాయునీ' అనే కవి రాసిన, చాలా ప్రసిద్ధి చెందిన ఒక పాటలో, ఒక చరణం ఇలా వుంటుంది: 'మా తలలను నరకగలరేమో గానీ, మా తలలను వంచలేరు!' అని. ('సర్ కటా సక్ తే హై, లేకిన్ సర్ ఝుకా నహీ సక్ తే!'). అంతేనా? ఈ కాలపు నియంతలకన్నా, పెద్ద నియంత ఇటలీ ముస్సోలినీ, లిబియా స్వాతంత్ర్య యోధుల మీద అమలు పరిచిన నిర్బంధాన్ని వ్యతిరేకించిన లిబియా తిరుగుబాటు నాయకుడు 'ఉమర్ ముఖ్తార్' ఏమి చేశాడు లొంగిపొమ్మన్నప్పుడు? 'లొంగిపోయే సమస్యే లేద'న్నాడు. ఆ మాటమీదే నిలబడి 73 ఏళ్ళ వయసులో, ఉరికంబం ఎక్కాడు? అతను ఎన్నడూ, "ఊగరా, ఊగరా! ఉరికొయ్య అందుకుని ఊగరా!" అని, పాడిన మావోయిస్టు కాడు. అతడు, వ్యక్తిగా సాధారణ మత గురువు. ఇటలీ సామ్రాజ్యవాద పాలననించీ నామమాత్రపు రాజకీయ స్వాతంత్ర్యం కోసం పోరాటం నడిపిన ఉద్యమకారుడు. అయినా, ఇప్పుడు వీరిని ఉరికంబాలు ఎక్కమనీ ఎవ్వరూ అడగడం లేదు. కానీ, లొంగుబాటు తప్ప, వేరే దిద్దుబాట మార్గం వుండదా? పైగా, చాలా ఏళ్ళుగా, పోరాట మార్గం విషయమై ఆలోచిస్తున్నట్టు వీరే చెప్పుకుంటున్నారు!

చివరిగా, మావోయిస్టు పార్టీ వారిని ఉద్దేశించి, ఎప్పుడో, పాతికేళ్ళ నాడు (2000లో), నేను రాసిన మాటల్నే ఈనాడు తిరిగి చెప్పదలిచాను.



"మహా విప్లవకారులుగా ఎంతో కాలం చలామణీ అయిన మీ వెనకటి నాయకులు, పోలీసులకు తమని తాము అప్పజెప్పుకుని, డబ్బు దండుకుని, బిజినెస్‌లు చేసుకుంటూనో, వడ్డీ వ్యాపారాలు చేసుకుంటూనో, 'మార్క్సిజం' అనే మాట కూడా పిల్లల చెవిన పడనివ్వకుండా, పుట్టినరోజు ఫంక్షన్లతో వారిని ఆనంద పెడుతూ కాలం గడిపేస్తున్నారు. ఇంత పతనానికి మూలాలు ఎక్కడ వున్నాయో మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి. మీ కార్యకర్తల్లోనే అపారంగా జరిగిన త్యాగాలూ, సాహసాలూ, మరణాలూ వృథా ఎందుకు అయిపోతున్నాయో, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఎందుకు పడివుంటున్నదో గ్రహించుకోండి! రష్యా చైనాలు ఎందుకు కుప్పకూలాయో, ప్రతీ విప్లవ గ్రూపూ ఎందుకు చీలికలూ పీలికలూ అవుతోందో, కారణాలు కనిపెట్టండి! అడుగడుగునా ఫోజులూ, డంబాచారాలూ, ఆత్మ స్తుతులూ, ప్రగల్భాలూ, వ్యక్తి పూజలూ, ఇవేవీ ఒక్క అడుగు కూడా ముందుకు తీసుకుపోలేవని గ్రహించండి! చేసిన తప్పులకు సిగ్గుపడడం, దిద్దుకోవడం, సిద్ధాంత జ్ఞానం, ఇతర విప్లవ గ్రూపులతో ఐక్యతా– ఇవి మాత్రమే విప్లవ మార్గాన్ని బలహీనతల నించి రక్షిస్తాయి.

విప్లవ గ్రూపుల్లో ఎక్కడ ఎన్ని తప్పులు జరిగినా, ఎవరితో ఎవరెంత విభేదించినా, ఎంత అస్పష్టంగానైనా అందరికీ ఒకే లక్ష్యమూ, ఒకే గమ్యమూ వున్నాయి. ఆ లక్ష్యానికి అంకితమైన జనాభా వుంది. జరగవలసిందంతా ఆ జనాభా మధ్య ఐక్యత! దాని కోసం ఎన్ని చర్చలైనా చెయ్యండి! ఎన్నిసార్లు విఫలమైనా మళ్ళీ మళ్ళీ ప్రయత్నించండి! ఆశలన్నీ విప్లవకారుల ఐక్యత మీదే పెట్టుకోండి! అది ఒక్కటే సరైన మార్గం! ఏకైక మార్గం! ముందడుగులు వెయ్యలేకపోతే, అది నేరం కాదు. వెనకడుగులు వెయ్యడం మాత్రం నేరమే!"

• రంగనాయకమ్మ



సమ్మయ్యనగర్‌లోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

సీఎం మాట తీరు మారాలి...

- అది ప్రకృతి విపత్తు కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ విపత్తే..
- వరంగల్‌లో ఇళ్లు కూలిపోయిన వారికి ఇంతవరకు నయాపైస ఇవ్వలే..
- ఇళ్లు కూలిపోయిన బాధితులకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి
- తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- నగరంలో జాగృతి జనంబాట కార్యక్రమం

వడ్డెపల్లి/హనుమకొండ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడే విధానం మార్చుకోవాలని, వీధిరౌడీలు సిగ్గుపడేలా మాట్లాడడం సరి కాదని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా శనివారం హనుమకొండ 57వ డివిజన్ సమ్మయ్యనగర్‌లోని తుఫాన్‌తో ముంపునకు గురైన ఇంజనీర్స్ కాలనీలో బాధితులను పరామర్శించారు. ఈ కాలనీలో మొగసాని వెంకటేశ్వర్లు-రజిత దంపతులు తమ కుమారుడి వివాహం కోసం సమకూర్చుకున్న డబ్బులు, వస్తువులన్నీ వరదలో కొట్టుకుపోయాయి. వీరికి జాగృతి పక్షాన రూ.50వేల ఆర్థిక సాయం కవిత బృందం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడుతూ.. తుఫాన్ ప్రకృతి విపత్తు కాదని, ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ విపత్తేనని దుయ్యబట్టారు. సమ్మయ్యనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో (మిగతా 6వ పేజీలో)



ఎంజీఎం ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న కల్వకుంట్ల కవిత

ఎంజీఎం, సీకేఎం సేవలపై దృష్టి ఏదీ..?

- ఇద్దరు మహిళా మంత్రులు ఏం చేస్తున్నారు..?
- ప్రజా సమస్యలపై యాక్షన్‌ప్లాన్ రూపొందిస్తాం..
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

7



తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఎన్నాళ్లీ చాకిరి!?

పదహారేళ్లుగా ఎదుగూ బొదుగూ లేని సమగ్ర శిక్ష ఉద్యోగుల జీ(వి)తాలు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2వేల మంది విధులు
- బోధనేతర పని భారమంతా వీరిపైనే..
- వేతనం తక్కువ.. పని భారం ఎక్కువ..
- రెగ్యులరైజేషన్ కోసం నాలుగేళ్లుగా పోరాటం
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

హనుమకొండ, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. పనిభారంతో కుంగిపోతున్నారు. వేతనం చారెడు.. పని బారెడు.. చందంగా ఉంది వీరి పరిస్థితి. పద్నాలుగేళ్లుగా వెట్టిచాకిరి చేస్తున్నారు. అయినా ఇప్పటివరకు వీరు రెగ్యులర్ కాలేదు. తమ ను పర్మినెంట్ చేయాలని నాలుగేళ్లుగా పోరాటం చేస్తూనే ఉన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల ను రెగ్యులర్ చేస్తున్న ప్రభుత్వం.. విద్యాశాఖలోని తొమ్మిది విభాగాల్లో బోధనేతర విధులను నిర్వ హిస్తున్న వీరి సర్వీసును మాత్రం రెగ్యులర్ చేయ డం లేదు. గతంలో వివిధ సందర్భాల్లో సీఎం కేసీ ఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని ఇప్పటి వరకు నెరవేర్చలేదు. దీంతో ఈ ఉద్యోగులంతా ఆందోళన బాట పట్టారు.

16 ఏళ్ల కిందట..

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది కొరత వల్ల ఉపాధ్యాయులు బోధనతోపాటు బోధనేత ర పనులను కూడా చేయాల్సి వచ్చేది. విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయులను బోధనావిధులకు మాత్రమే వినియోగించుకోవాలన్నది అమలులోకి వచ్చింది. దీంతో 2008లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు అమలులోకి వచ్చింది. 60శాతం నిధులను కేంద్రం, 40శాతం నిధుల ను రాష్ట్రం భరించే ఈ ప్రాజెక్టు కింద రాష్ట్ర వ్యాప్తంగా 22వేల మంది ఉద్యోగులను తీసుకు న్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2వేల మందిని నియమించారు. వీరం తా జిల్లాస్థాయి (డీఈవో)లో ఏపీవోలు, సిస్టమ్ అనలిస్టులు, టెక్నికల్ పర్సన్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్స్, డీఎల్‌ఎంటీ, అటెండర్లు, మండల స్థాయిలో (ఎంఈవో) భవిత కేంద్రాల్లో ఇం క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్సు పర్సన్స్ (ఐఆర్ సీలు), మండల రిసోర్స్ పర్సన్స్, సీసీవోలు, ఎంఐఎస్ కోర్డినేటర్లు, మెసెంజర్స్, స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్‌పీలు), పాఠశాలల్లో పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లలో స్పెషల్ ఆఫీసర్స్, పీజీసీఆర్‌టి, సీఆర్‌టీ, పీఈటీ, ఎఎన్‌ఎం, అకౌం టెంట్, క్రాఫ్ట్, కంప్యూటర్ టీచర్స్, వాచ్‌మెన్, స్కావెంజర్, కుక్స్‌గా వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

బోధనేతర పనులన్నీ..

ఒక్కో సీఆర్‌పీ తన కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచా రాన్ని ఎప్పటికప్పుడు అందించడం ద్వారా కాం ప్లెక్స్ హెడ్‌మాస్టర్, ఎంఈ వో-ఎంఈవోల మధ్య అనుసంధానకర్తగా (మిగతా 6వ పేజీలో)

జీతం చారెడు.. పని బారెడు..

సమగ్ర శిక్ష ఉద్యోగులకిచ్చే వేతనం కూడా చాలా తక్కువ. నెలకు రూ. 19,500 చెల్లిస్తోంది. పొరుగున ఉన్న ఏపీలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెండేళ్ల కిందట వేతనాన్ని రూ.30,500 పెంచగా ఇక్కడ మాత్రం ఈ దిశగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు కనీస వేతన స్కేల్‌ను అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతీ ఉద్యోగికి రూ.10లక్షల జీవిత బీమా, రూ.5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, కనీస వేతనాన్ని అమలు చేయాలని, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలని వీరు కోరుతున్నారు.

'స్మార్ట్' దోపిడీ



- సబ్సిడీ సన్న బియ్యాన్ని తేలిగ్గా నొక్కేస్తున్నారు...
- బస్తాకు 6 కిలోలు తక్కువతో రేషన్ షాపులకు సరఫరా
- మిల్లర్లు, అధికారుల కుమ్మక్కు దందా
- డీలర్ల ఫిర్యాదులపై స్పందించని ఉన్నతాధికారులు



హనుమకొండ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని అక్రమార్కులు నొక్కేస్తున్నారు. బియ్యం దందాలో ఈ మార్గాన్ని కూడా వదలకుండా సొమ్ము చేసుకుం టున్నారు. మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై దోపిడీని సాగిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారు లకు ఫిర్యాదు చేసినా పట్టింపు కరువైంది. మిల్లర్ల నుంచి ఎఫ్‌సీఐ ఆ తదుపరి స్టాక్ పాయింట్లు అక్కడి నుంచి రేషన్ షాపులకు చేరుతున్న సన్నబియ్యం బస్తాల తూకం తేడాగా ఉంటోంది. వంద క్వింటాళ్ల బస్తాకు 6కిలోల వరకు తక్కువగా రేషన్ షాపులకు సరఫరా అవుతున్నాయి. ఇలా తూకం తక్కువగా ఉండడంతో డీలర్లు లబోదిబోమంటున్నారు. మరో వైపు మిల్లర్లు ఒక్కో బస్తా నుంచి అక్రమంగా సేకరించిన బియ్యాన్ని సొమ్ము చేసి అధికారులకు వాటాలు పంచుతున్నారు. హనుమకొండ జిల్లాలో మొత్తం రేషన్ షాపులు 424 ఉన్నాయి. ప్రతి నెల 4500 మె ట్రిక్‌టన్నుల సన్న బియ్యం సరఫరా అవుతున్నాయి.

పేరుకే తూకం...

సన్న బియ్యం క్వింటా బస్తా తూకం పేరుకే పరిమితమైంది. రైస్ మిల్లుల నుంచి ఎఫ్‌సీఐ, స్టాక్ పాయింట్ల వద్ద బస్తాలను తూకం వేయాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. తూకం వేసినట్లుగా చిత్రీకరిస్తూ ఈ మేరకు రశీదులు పొందుపరుస్తున్నారు. రేషన్ షాపులకు చేరిన బస్తాలను డీలర్లు ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌పై తూకం వేయగా బస్తాకు ఆరు కిలోలకు పైగానే బియ్యం తక్కువగా ఉంటున్నాయి.

ఎవరి వాటాలు వారివి..

బియ్యం బస్తాల తూకం తేడాలో పౌ రసర ఫరాల శాఖ అధికారుల ఉంచి కింది స్థాయి ఉద్యోగులు, మరో వైపు మిలర్లు ఒక్కటై దోపిడీ చేస్తున్నారు. బస్తాల నుంచి సేకరించిన బియ్యాన్ని వక్రమార్గంలో అమ్ముతున్నారు. గతంలో ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేసిన సమ యంలో కూడా ఈ తరహా దోపిడీ సాగింది. అయితే దొడ్డు బియ్యాన్ని మిల్లర్లు సేకరించి మర ఆడించి సన్న బియ్యం చేసేవారు. ఈ బియ్యాన్ని విక్రయించి సొమ్ము చేసుకునేవారు. అయితే ఈ విధానం కొంత క్లిష్టంగా ఉండేది. దొడ్డు బియ్యం సేకరణ, మర ఆడించడం, విద్యుత్ వినియోగం పెరగడం వంటివి మిల్లరకు సమస్యగా ఉండేది. కానీ ఇప్పుడు ప్రభుత్వమే సన్న బియ్యం ప్రవేశపెట్టడంతో బస్తాలో కోత పెట్టి అప్పటికప్పుడే బియ్యం సేకరరించడం మిలర్లకు ఈజీగా మారింది. దీంతో స్మార్ట్‌గా బియ్యం నొక్కేస్తు దండుకుంటున్నారు.

తూకం పట్టింపేలేని అధికారులు

మిల్లర్ల నుంచి వచ్చిన బియ్యం బస్తాల తూ కాన్ని పౌర సరఫరాల అధికారులు పట్టించు కోవడమే లేదు. గోదాములో తూకం వేసి బి య్యం క్వింటా బస్తా సరిగా ఉందా లేదా నిర్ధారించి ఈ మేరకు ధృవీకరించాల్సి ఉంది. కానీ అధికారులు దీనిని పక్కన పెట్టి తూకం వేసినట్లుగా సర్టిపై చేస్తున్నారు. దర్జాగా బస్తాల ను రేషన్ షాపులకు పంపిణీ చేస్తున్నారు. ఇక కొందరు అధికారులు మిలర్ల నుంచే బియ్యం తక్కువగా వస్తున్నాయంటే వారు కూడా బస్తాల నుంచి బియ్యాన్ని దొంగలించి సేకరించిన బియ్యాన్ని పెద్ద ఎత్తున మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఇలా మిలర్లు, అధికారులు కుమ్మక్కు దోపిడీతో పాటు ఎవరికి వారు కూడా నిరుపేద లకు చెందాల్సిన బియ్యాన్ని స్వాహా చేస్తున్నారు. బియ్యం బస్తా క్వింటాల్ లేదని డీలర్లు ప్రశ్నిస్తే అధికారులు అనేక కొర్రిలతో వారిని వేధిస్తున్నారు. ఎందుకొచ్చిన తలనొప్పిగా డీలర్లు కిమ్మన డం లేదు. మరో వైపు ప్రజలకు బియ్యం స్టాక్ లేదంటూ సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని డీలర్లు వాపోతున్నారు.

మార్కెట్లో సులువుగా విక్రయం

సన్న బియ్యాన్ని వక్రమార్గంలో నొక్కేస్తున్న మిల్లర్లు, అధికారులు మార్కెట్లో సులువుగా విక్రయిస్తున్నారు. గతంలో దొడ్డు బియ్యాన్ని మర ఆడించి సన్న బియ్యంగా ఇతర దేశాలకు పంపిణీ చేసే వారు. కానీ ఇప్పుడు ఏకంగా సన్న బియ్యమే పంపిణీ కావడంతో ఇటు స్థాని కంగా మరో వైపు ఇతర దేశాలకు కూడా వక్ర మార్గంలో పంపిణీ చేస్తూ దోపిడీకి పాల్పడుతు న్నారు. సన్న బియ్యానికి మార్కెట్లో రూ. 4 వేల వరకు ధర పలుకుతుండడంతో అక్రమార్కులకు కాసుల పంటగా మారింది.

అటవీ గ్రామాలకు ట్రెయినీ ఐఏఎస్‌లు

- మూడు రోజుల పాటు భూపాలపల్లి జిల్లాలో పర్యటన
- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై పరిశీలన

మహదేవపూర్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా సర్వీసెస్ ట్రైనీ అధికారుల బృందం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలిమెల, మహ ముత్తారం మండలాల్లోని అటవీ గ్రామాల్లో పర్యటించనున్నారు. ఉత్తరాఖండ్‌లోని ముస్సోరి లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(భారత ప్రభుత్వం)కి చెందిన 12మంది ట్రైనీ అధికారులు ఆదివారం ఆయా గ్రామాలకు చేరుకోనున్నారు. ఫీల్డ్ స్టడీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రాం(ఎఫ్‌ఎస్‌ఆర్‌పీ) క్రింద దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ట్రైనీ అధికారుల బృందాలు పర్యటించనుండగా రెండు బృందాలు తెలంగాణలో భూపాలపల్లి జిల్లాకు రానున్నారు. పలిమెల మండలం లోని లెంకలగడ్డ, మహముత్తారం మండలంలోని ములుగుపల్లి గ్రామంలో ట్రైనీ అధికారుల బృందం పర్యటించనుంది. లెంకలగడ్డలో ఆదిత్య సింగ్, మయాంక్ ఖండేల్‌వాల్, ఎన్.మణిమాల, విశాల్ సింగ్, పవార్ అక్షయ్ విలాస్, రితిక రాత్‌లు, ములుగుపల్లిలో అనురాగ్ రంజన్ వతాస్, రాజ్ క్రిష్ణ జా, విపాషయాన తన్వాస్, క్రిష్ణ.సి, విషేష్ సింగ్, తుషార్ సింగ్‌ల బృందం మూడు రోజుల పాటు పర్యటించనున్నారు.

ఏరోజు ఏం చేస్తారంటే...

మొదటి రోజు గ్రామంలో స్థానికులతో ముచ్చటిస్తా రు. అక్కడి స్థితిగతులపై ఆరా తీస్తారు. గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ, పీహెచ్‌సీ, పంచాయతీ కార్యా లయం, ఇతర ప్రభుత్వ సంస్థల కార్యాలయాలను సంద ర్శించిఅక్కడ అందుతున్న సేవలపైఆరాతీస్తారు. స్వచ్ఛ్ భారత్ క్రింద శ్రమదానం వంటి కార్యక్రమాలు నిర్వహి స్తారు. రెండో రోజు స్థానిక లీడర్లు, ఎస్‌హెచ్‌జీ, ఎఫ్‌పీ వో, కార్మికులు, పట్వారులు, ఆశ, అంగన్‌వాడీ టీచర్, తదితరులో సమావేశం నిర్వహిస్తారు. మూడో రోజు గడిచిన రెండు రోజుల్లో ట్రైనీ అధికారుల పరిశీలించిన, గుర్తించిన సమస్యలతో గ్రామంలోని మీటింగ్ పాయింట్ వద్ద చర్చిస్తారు.

సీఎంకు బర్త్ డే విషెస్..



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు నేతలు శనివారం హైదరాబాద్‌లో స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సీతక్క, మేయర్ సుధారాణి, మాజీ మేయర్, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు సీఎం కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు హాజరై శాలువా కప్పి సత్కరించారు.

- ఆంధ్రజ్యోతి, వరంగల్ కార్పొరేషన్

న్యాయాధికారి కంచ ప్రసాద్‌కు పదోన్నతి

● మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు జడ్జిగా ప్రమోషన్



శంభునిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ రంగశాయిపేటకు చెందిన న్యాయాధికారి కంచ ప్రసాద్ పదోన్నతి పొందారు. ప్రస్తుతం సికింద్రాబాద్ పదో అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌గావిధులు నిర్వహిస్తున్న ఆయనను హైదరాబాద్ ప్రిన్సిపల్, ఫ్యామిలీ కోర్టుతో పాటు 13వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా నియమించారు.కాకతీయ యూనివర్సిటీలో డిగ్రీ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ప్రసాద్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 2010లో హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులై హుజూరాబాద్, బెల్లంపల్లిలో విధులు నిర్వహించారు. 2019లో సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది ఆదిలాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీగా, కరీంనగర్, జగిత్యాల జిల్లా కోర్టు జడ్జిగా, సికింద్రాబాద్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్‌గా పని చేశారు. ఓవైపు జడ్జిగా పనిచేస్తూనే మరోవైపు కాకతీయ యూనివర్సిటీలో న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ చేశారు. ప్రసాద్‌కు పదోన్నతి లభించడం పట్ల రంగశాయిపేటకు చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.

విద్యాశాఖలో మోడల్ స్కూల్స్‌ను విలీనం చేయాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఆర్.కిరణ్‌కుమార్

వడ్డెపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్స్‌ను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయాలని తెలంగాణ గవర్నమెంట్ టీచర్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ మోడల్ స్కూల్స్ (టీజీ టీఈఏఎంఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కిరణ్‌కుమార్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయనతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కట్కూరి మహేందర్, ఉపాధ్యక్షుడు గోపగాని విక్రమ్ మాట్లాడారు. 010 పద్దు ద్వారా మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టుల్లో పీజీటీలకు ప్రిన్సిపాల్స్‌గా, టీజీటీలకు పీజీటీలుగా వెంటనే ప్రమోషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్‌కు గెజిటెడ్ హోదా కల్పించి తదుపరి పదోన్నతి అవకాశం అందేవిధంగా చూడాలని కోరారు. ఆరోగ్య భద్రత కార్డులు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో టీజీ టీఈఏఎంఎస్ రాష్ట్ర కోశాధికారి ఎడ్ల రమేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అన్వర్‌పాషా, శశికుమార్, శ్రీధర్‌రెడ్డి, రామగిరి రాజు, కంతాత్మకూర్ రమేష్, బాషబోయిన గంగరాజు, బొందిలి కల్యాణ్‌సింగ్ పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు

» వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద



ఏనుగల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పర్వతగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. శనివారం మండలంలోని ఏనుగల్లు, చౌటపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను పరిశీలించారు. మాల్యా తండాలో పంట నష్టపోయిన రైతుల పొలాలు పరిశీలించారు. ఏనుగల్లు, కొంకపాకలో రూర్బన్ ప్రాజెక్టు కింద నిర్మించబడిన గోదాములను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కేంద్రాల్లో రైతులతో మాట్లాడి వసతులను తెలుసుకున్నారు. రైతుల ధాన్యం తక్షణమే కాంటాలుజరిగేలా చూడాలని, చెల్లింపులు సైతం సమయానికి కావాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ సదుపాయం, బరువులు కొలిచే యంత్రాలు వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూడాలన్నారు. భారీ వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను ఆదివారం లోగా నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు పంట నష్టపోయిన రైతులను వదలకుండా పేర్లు నమోదు చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీఆర్డీఏ రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, మార్కెటింగ్ అధికారి భాగ్యలక్ష్మి, ఏపీఎం రాజవీరు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

● అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు



మార్కింగ్‌ను చూపిస్తున్న అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నాయకులు

రాంనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాలాను ఆక్రమించుకుంటే బిల్డర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టి అనుమతులు ఇచ్చిన అప్పటి అధికారులపై చర్యలు తీసుకోవాలి కానీ.. అపార్ట్‌మెంట్‌వాసులపై మునిసిపాలిటీ అధికారులు కక్షసాధింపు చర్యలకు దిగడమేంటని అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ప్రశ్నించారు. హనుమకొండ 52వ డివిజన్ రాంనగర్‌లోని రాంనగర్ టవర్స్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రహరి కూలిపోయి అపార్ట్‌మెంట్‌లోకి వరద నీరు వచ్చి దాదాపు 75 కుటుంబాలు ఇబ్బందులకు గురికాగా శనివారం అపార్ట్‌మెంట్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు సందర్శించారు.

ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. ఇలాంటి సందర్భంలో బాధిత కుటుంబాలను పరామర్శించాల్సింది పోయి టవర్ వాళ్లు నాలా ఆక్రమించారని హడావిడి చేస్తూ మార్కింగ్ పెట్టడంతో అపార్ట్‌మెంట్ వాసులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. మునిసిపల్ కమిషనర్ స్వయంగా పరిశీలించి నాలా మొదటి నుంచి చివరి వరకు ఉన్న ఆక్రమణను గుర్తించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాంనగర్ టవర్స్‌ను సందర్శించిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు రెంటాల కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్, ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి అంజనీదేవి, అపార్ట్‌మెంట్ ప్రజలు పాల్గొన్నారు.

కేయూ సౌత్ జోన్ మహిళల జూడో జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో వెంకయ్య

కేయూ క్యాంపస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నవంబరు 10 నుంచి నవంబరు 11 వరకు భోపాల్‌లోని సాగే యూనివర్సిటీలో నిర్వహించే 2025-26 సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ కాకతీయ యూనివర్సిటీమహిళాజూడో పోటీలకు జట్టు ఎంపికైంది. ఈమేరకు ఆదివారం కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య ఎంపిక క్రీడాకారుల వివరాలను వెల్లడించారు. ఎంపికయిన వారిలో కె.అనూష, (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, వరంగల్ పశ్చిమ), ఎస్.సిరి చందన(కిట్స్, వరంగల్), సీహెచ్.శైలజ,(టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ, వరంగల్ వెస్ట్), ఎన్. సాయిశ్రీ, (తాళ్ళపద్మావతి ఫార్మసీ కళాశాల, వరంగల్), డి.నక్షత్ర, (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, వరంగల్ పశ్చిమ)లు ఎంపికైనట్లు వెంకయ్య వెల్లడించారు. జట్టుకు కోచ్, మేనేజర్‌గా టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ వరంగల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ బి.మౌనిక వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

ప్రొఫెసర్ నర్సింహారెడ్డికి ఐపీజీఏ ఫెల్లోషిప్



ఐపీజీఏ ఫెల్లోషిప్ అవార్డు అందుకుంటున్న నర్సింహారెడ్డి

కేయూ క్యాంపస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేయూ ఫార్మసీ విభాగం ప్రొఫెసర్ వై.నర్సింహారెడ్డికి ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఫార్మసీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్-2025(ఐపీజీఏ) లభించింది. ఈ మేరకు ఆదివారం లక్నోలోని బాబాసాహెబ్ భీంరావు అంబేద్కర్ వర్సిటీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఐపీజీఏ బాధ్యులు నర్సింహారెడ్డికి జ్ఞాపిక, సర్టిఫికెట్, శాలువా అందచేసి సత్కరించారు. ఫార్మసీ రంగంలో విశిష్ట సేవలు, నిర్దిష్ట ప్రమాణాలతో ప్రతిభ కనపరిచిన వారికి ఫెల్లోషిప్‌అందజేస్తారని నర్సింహారెడ్డి తెలిపారు. అవార్డు పొందిన ఆయనను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

గోపాల్‌పూర్ చెరువు కట్టకు రిటైనింగ్ వాల్ నిర్మించాలి



కేయూ వంద ఫీట్ల రోడ్డులో ధర్నా చేస్తున్న ప్రజలు

వడ్డెపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ మండలంలోని గోపాల్‌పూర్ ఊరచెరువు కట్టకు రిటైనింగ్ వాల్ నిర్మించాలని ప్రముఖ సామాజికవేత్త తుపాకుల దశరథం, వివేక్‌నగర్ కాలనీ అధ్యక్షుడు మర్రి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మీసాల రమేష్ డిమాండ్ చేశారు. గోపాల్‌పూర్ ఊరచెరువు కట్టకు రిటైనింగ్ వాల్ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాం డ్‌చేస్తూ కేయూ వంద ఫీట్ల రోడ్డు తులసి బార్ వద్ద వివేక్‌నగర్‌కాలనీ, ప్రగతినగర్, టీవీటవర్ కాలనీ, అమరావతినగర్, సమ్మయ్యనగర్, ఎన్జీవోస్ కాలనీలకు చెందిన ప్రజలు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాతో గంట వరకు బస్సులు, వివిధ వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన తుఫాన్ ప్రభావంతో గోపాల్‌పూర్ ఊర చెరువు నిండి కట్టమీది నుంచి నీరు వెళ్లడంతో అది తెగిపోయిందని అన్నారు. అధికారుల బాధ్యతారాహిత్యం వల్లనే చెరువు కట్ట తెగిపోయి కాలనీలు జలమయమై భారీగా ఆస్తినష్టం సంభవించిందని అన్నారు. గోపాల్‌పూర్ ఊర చెరువు వద్ద గల డక్ట్‌కు అమర్చిన సొరంగం గేట్లు ఎత్తివేయక పోవడం వల్లనే జల విలయం సంభవించిందని పేర్కొన్నారు. ఈధర్నాకు 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్ సంఘీభావాన్ని తెలిపారు. ధర్నా లో ప్రగతినగర్ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, టీఎన్జీవోస్ కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, శ్యామల దుర్గాదాస్ కాలనీ అధ్యక్షుడు నల్లాని శ్రీనివాస్, వివిధ కాలనీల ప్రతినిధులు లింగంపల్లి వేణుగోపాల్‌రావు, బూర నారాయణ, పింగిళి అశోక్ రెడ్డి, దేవ్‌సింగ్‌తో పాటు ప్రజలు పాల్గొన్నారు.

సీఎం మాట తీరు మారాలి..

(5వ పేజీ తరువాయి)

వరద తాకిడికి ఎంతో మంది ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులయ్యారన్నారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో సుమారు 250కిపైగా ఇళ్లు కొట్టుకుపోతే వరద ముంపు ప్రాంతాలను 15 రోజుల కిందట సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి బాధితులకు నయాపైస ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. ముంపు ప్రాంతంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు వెంటనే పక్కాఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదన్నారు. వరద ముంపు ప్రాంతాలను కలెక్టర్లు పరిశీలించి బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం చేయాలని డిమాండ్ చేశారు.

కళాశాలల యాజమాన్యాల తాట తీస్తామని సీఎం మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ విద్యార్థుల కోసం నిలబడిన కళాశాల యాజమాన్యాల తరపున తెలంగాణ జాగృతి పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లకావత్ రూప్‌సింగ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మారెపల్లి మాధవి, ఆదివాసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నలమాల శ్రీకాంత్‌గౌడ్, జిల్లా నాయకులు బానోత్ వెంకన్న, పర్లపెల్లి శ్రీశైలం, మేకల రాణి, మంజుల, వంశీకృష్ణ, సోల్తి కిశోర్, జన్ను సంతోష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాలి..

రాష్ట్రంలోని ప్రైవేటు కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. హనుమకొండకు వచ్చిన కవితను ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కలిసి వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రైవేటు కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జాగృతి జనం బాట కార్యక్రమం శనివారం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ప్రారంభమైంది. ఇందులో పాల్గొన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఫాతిమానగర్ వద్ద జాగృతి నాయకులు, కార్యకర్తలు బోనాలు, బతుకమ్మలతో, డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు.

గ్రంథాలయం సందర్శన

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. లైబ్రరీలోని సౌకర్యాలను, పాఠకులను అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడంలో లైబ్రరీల పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. నిరుద్యోగులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యమవుతున్నాయని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపిస్తోందని నిరుద్యోగులు కవితకు వివరించారు.

రుద్రమదేవి విగ్రహానికి పూలమాల

పోచమ్మమైదాన్(ఆంధ్రజ్యోతి): జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం వరంగల్ పోచమ్మమైదాన్ చౌరాస్తాలోని రాణి రుద్రమదేవి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నేతలు, తదితరులు పాల్గొన్నారు.త

ఎన్నాళ్లీ చాకిరి!?

(5వ పేజీ తరువాయి)

వ్యవహరిస్తున్నాడు. మధ్యాహ్న భోజనం అమలును పర్యవేక్షించడం, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో టీచర్ రానప్పుడు ఆ పాఠశాలలను నడపడం, డీఈవో కార్యాలయం నుంచి అడిగిన ప్రతీ సమాచారాన్ని తక్షణమే సేకరించి మండల విద్యావనరుల కేంద్రం(ఎంఆర్‌సీ) పంపడం, విద్యార్థుల హాజరు, ఎన్‌రోల్‌మెంట్ చూడడం, ముఖ్యంగా డ్రాపౌట్స్ విద్యార్థులను బడిలో చేర్పించడం తదితర విధులన్నిటినీ సీఆర్‌పీలు నిర్వర్తిస్తున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల్లో భాగమైన, కీలక విధులను నిర్వహిస్తున్న మండల మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) కోఆర్డినేటర్లు డీఈవోకు, ఎంఈవోకు, పాఠశాలలకు సంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని అన్ని పాఠశాలల వివరాలను ఎప్పటికప్పుడు డీఈవో కార్యాలయానికి పంపించడం, యూడైస్‌ను నవీకరించడం, పాఠశాలలకు వచ్చిన గ్రాంట్లను పీఎఫ్ఎంఎస్‌లో జనరేట్ చేసి గ్రాంట్లను పాఠశాల హెడ్‌మాస్టర్ల సక్రమంగా వినియోగించేట్టు చూడడం, ఆడిట్ కూడా చేయించడం ముఖ్యమైన విధులు. పాఠ్యపుస్తకాలు, యూనిఫారమ్‌లను ఆన్‌లైన్ చేసి ప్రతీ పాఠశాలకు అందేలా చూడడం వంటి విధులను కూడా నిర్వహిస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన డాటాను ఆన్‌లైన్ చేయడం, దానికి అనుగుణంగా బిల్లులను తయారు చేసి పాఠశాల మధ్యాహ్నం భోజన పథకం కార్మికులకు అందించడం డాటాఎంట్రీ ఆపరేటర్లు చేస్తున్నారు. ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్సు పర్సన్లు, దివ్యాంగులకు శిక్షణ ఇవ్వడం, ప్రతీవారం వారింటికి వెళ్లి ఫిజియోథెరపీ చేయడం వంటి విధులను నిర్వహిస్తున్నారు. దివ్యాంగులకు అవసరమైన ట్రైసైకిల్స్, కాలిపర్స్, ఇయర్ ఎయిడ్స్, స్పీచ్‌థెరపీకి సంబంధించిన పరికరాలను ప్రభుత్వం ద్వారా సమకూర్చడం వీరి ముఖ్యమైన విధి. ఇన్ని విధులను నిర్వహిస్తున్నప్పటికీ సమగ్ర శిక్ష ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంపట్ల పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్‌సీ) ద్వారా వీరు రిజర్వేషన్, రోస్టర్ విధానాన్ని అనుసరిస్తూ నియమితులయ్యారు. రెగ్యులర్ అయ్యే అన్ని అర్హతలు వీరికి ఉన్నాయి. కేంద్రం, కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు పరిధిలోనివారన్న ఒకే ఒక్క సాకుతో రాష్ట్రప్రభుత్వం వీరినిపట్టించుకోవడం లేదు. రెగ్యులర్ కాకుండానే అనేక మంది ఉద్యోగులు మరణించారు. తీవ్ర పని ఒత్తిడి వల్ల శారీరకంగా, మానసికంగా అనారోగ్యానికి గురై మృతి చెందిన ఉద్యోగులు కూడా అనేక మంది ఉన్నారు. వీరికి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదు. వీరి కుటుంబాలు రోడ్డున పడి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

సమగ్ర చరిత్ర రచనకు పునాది స్థానిక చరిత్రలే..

'సలాం జనగాం' పుస్తకావిష్కరణలో జయధీర్ తిరుమల్‌రావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జయధీర్ తిరుమల్‌రావు

జనగామ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమగ్ర చరిత్ర రచనకు పునాది స్థానిక చరిత్రలే అని చరిత్ర పరిశోధకుడు, ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్‌రావు అన్నారు. ప్రముఖ కవి, రచయిత సాంబరాజు యాదగిరి రచించిన సలాం జనగాం(జిల్లా చారిత్రక పరిమళం) పుస్తకావిష్కరణ జనగామలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగింది. తెలంగాణ సాహితీ, జనగామ రచయితల సంఘం సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశానికి తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి కె.ఆనందాచారి అధ్యక్షత వహించగా తిరుమల్‌రావు విశిష్ఠ అతిథిగా హాజరై మాట్లాడారు.

రాను రాను స్థానిక చరిత్రల ఆవశ్యకత పెరిగిపోతున్నదన్నారు. దేశ, విదేశాల ప్రాంత రాజవంశాల చరిత్ర రచనకు స్థానిక చరిత్రలు, పరిశోధనలు ఉపయోగపడతాయన్నారు. కొత్త జిల్లాను పాత జిల్లాల వైభవ స్థాయికి సమానమే అని చెప్పడం రచయిత ఉద్దేశమన్నారు. జనగామ జనుల గ్రామమని, ప్రజలు తీర్చిదిద్దుకున్న జీవన విధానాలు, కళలు, సంస్కృతి వంటి రంగాలలో ఏ జిల్లాకు తీసిపోదన్నారు. జిల్లా ప్రత్యేకతను, అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని, ప్రజల జీవన శైలిని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవాల్సిన ఆవశ్యకత జిల్లా ప్రజలందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ దాసరి ప్రసాదరావు, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్, సామాజిక విశ్లేషకుడు జి.రాములు, చరిత్ర విశ్లేషకుడు ఎండి.అబ్బాస్, గోపాల్‌రెడ్డి, డాక్టర్ మాచర్ల భిక్షపతి, సీహెచ్.రాజారెడ్డి, మోకు కనకారెడ్డి, నల్ల అరుణ, పానుగంటి రామమూర్తి, కోడం కుమారస్వామి, రెడ్డి రత్నాకర్‌రెడ్డి, అయిలా సోమనర్సింహాచారి, జి.కృష్ణ, నక్క సురేష్, పెట్లోజు సోమేశ్వరాచారి, పిట్టల కుమాంర్, బక్క కృష్ణ పాల్గొన్నారు.

ప్రాచీన కళారూపాల డాక్యుమెంటేషన్

జనగామ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రాచీన కళారూపాల ఆడియో, వీడియో డాక్యుమెంటేషన్ నిర్వహించారు. శనివారం ఆద్యకళ మ్యూజియం, దక్కన్ టీవీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో చెక్క బొమ్మలాట, యక్షగాన కళారూపాలను డాక్యుమెంటరీగా చిత్రీకరించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మెట్టు వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన కళాకారుల సదస్సులో చరిత్ర పరిశోధకులు ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రాచీన కళారూపాల డాక్యుమెంటేషన్ ఆవశ్యకతను వివరించారు. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గూడూరు మనోజ, పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటరు సవరణకు ఎస్ఐఆర్

» 2002, 2025 ఓటరు జాబితాలతో మ్యాచింగ్ ప్రక్రియ పూర్తి
» మ్యాచింగ్ కాని ఓట్ల తొలగింపునకు కసరత్తు
» త్వరలోనే ఇంటింటీ సర్వే
» సరైన పత్రాలు చూపకుంటే ఓటు తొలగింపే..



వర్ధన్నపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే తెలంగాణలో ఈ కార్యక్రమం చేపట్టగా మొదటి దశ మ్యాచింగ్ కార్యక్రమం పూర్తయింది. త్వరలోనే ఇంటింటి సర్వే చేసి ఓట్ల సవరణ చేయనున్నారు. జిల్లాలో బీఎల్‌వోలు త్వరలోనే మ్యాచింగ్ కాని ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఓట్లు ఎలా పొందారో దానికి కావాల్సిన పత్రాలను ఓటర్ల నుంచి స్వీకరించనున్నారు. సరైనా పత్రాలు సమర్పించని ఓటర్లను జాబితా నుంచి తొలగించనున్నారు. బిహార్ రాష్ట్రంలో మాదిరిగానే తెలంగాణలోనూ ఎస్ఐఆర్ కార్యక్రమం పేరిట ఓటర్ల జాబితా సవరణ చేస్తున్నారు.

2002,2025 జాబితాల్లో ఓట్లు ఉంటే ఓకే..

2002, 2025 ఓటరు జాబితాల్లో ఓటు హక్కు కలిగి ఉంటేనే వారు స్థానికులుగా దేశ పౌరులుగా గుర్తించనున్నారు. 2025 ఓటరు జాబితాలో మాత్రమే ఓటు హక్కు ఉంటే ఆ ఓటరు జాబితాలో మాత్రమే ఓటు హక్కు ఉంటే ఆ ఓటరు ఎలా ఓటు హక్కు పొందారో నిరూపించుకునేందుకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. 2002లో ఓటు హక్కు ఉండి ఇపుడు లేని వారి వివరాలను సేకరించి వారు ఎక్కడికి వెళ్లారు. ఎక్కడ ఉన్నారు అనే వివరాలు కూడా ఆరా తీయనున్నారు. జాబితాలో ఎవరైనా చనిపోయినా, ఇతర దేశాలకు వలస వెళ్లినా వారి ఓట్లు ఉంటే గుర్తించి తొలగించనున్నారు.

18 నుంచి 38 ఏళ్ల వయస్సు మధ్య గుర్తింపు

2002 ఓటరు జాబితాలో 18ఏళ్ల నుంచి 38 ఏళ్ళ వయస్సు గల ఓట్లను గుర్తించారు. 2002లో 18ఏళ్లు ఉన్నట్లయితే 2025 నాటికి వారికి 43ఏళ్ల వయస్సు ఉంటుంది. అప్పుడు 38 ఏళ్లు ఉన్నట్లయితే ఆ ఓటరు ఇప్పుడు 61 ఏళ్ల వయస్సు ఉంటుంది. అలాంటి వారిలో ఎవరైనా చనిపోతే వారి ఓట్లను తొలగిస్తున్నారు. ఓట్లు ఉన్న వారు ఇపుడు ఓటరుగా ఉన్నారా? లేదా? పరిశీలిస్తున్నారు. 2002 తరువాత నమోదైన ఓటర్లను స్థానికేతరులుగా గుర్తించి వారి పుట్టిన ప్రాంతం, నివాస ప్రాంతంపై ఆరా తీయనున్నారు. పుట్టిన ప్రాంతం, నివాస స్థలం, తల్లిదండ్రులు, తాత ముత్తాతల స్థానికతపై ధ్రువీకరణ పత్రాల ద్వారా నిర్ధారణ చేయనున్నట్లు సమాచారం.

మొదటి దశ ప్రక్రియ ఇలా..

మొదటి దశలో 2002, 2025 ఓటరు జాబితాను దగ్గర ఉంచుకొని అందులో ఓటరు మ్యాచింగ్ చేపట్టారు. ఆ మ్యాచింగ్ ప్రక్రియ ఇటీవల ముగియడంతో ఆ నివేదికను అధికారులు ఎన్నికల కమిషన్‌కు సమర్పించారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 30 నుంచి 40 శాతం ఓట్లు మాత్రమే మ్యాచింగ్ అయినట్లు సమాచారం. మిగిలిన ఓటర్లు స్థానికులా... కాదా. అని గుర్తించేందుకు బీఎల్‌వోలు సర్వే చేయనున్నారు. ఈ సర్వేలో ఓటర్లు తమ ఓటు హక్కు ఎలా పొందారో సంబంధిత స్థానిక ధ్రువీకరణ పత్రాలు అందజేసి నిరూపించుకోవాల్సి ఉంటుంది. త్వరలోనే అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటి సర్వే చేపట్టి ఓట్ల సవరణ చేయనున్నారు. అలా జరిగితే ప్రతి నియోజకవర్గం లోనూ 20 నుంచి 30 శాతం ఓటర్లను జాబితా నుంచి తొలగించే అవకాశం కనిపిస్తుంది. సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించని వారిని ఓటరు జాబితా నుంచి తొలగించి వారికి దేశ పౌరసత్వం లేనివారిగా ప్రకటించే అవకాశం ఉంది.



ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటిస్తాం..
అనిఫ్, డిప్యూటీ తహసీల్దార్, వర్ధన్నపేట

ఓటరు జాబితా ప్రక్షాళన విషయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటిస్తాం. ప్రస్తుతం 2002, 2025 ఓటరు జాబితాలను స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేశాం. రెండు జాబితాల్లో ఉన్న ఓటర్ల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదించాం. తదుపరి ఎన్నికల కమిషన్ ఆదేశాలను అమలు చేస్తాం.

ఎంజీఎం, సీకేఎం సేవలపై దృష్టి ఏదీ ?

» ఇద్దరు మహిళా మంత్రులు ఏం చేస్తున్నారు ?
» ప్రజా సమస్యలపై యాక్షన్ ప్లాన్ రూపొందిస్తాం..
» తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత


తనకు స్వాగతం పలుకుతున్న వారితో కోలాటం ఆడుతున్న కల్వకుంట్ల కవిత

వరంగల్ మెడికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ, వరంగల్ జిల్లాలే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఎంజీఎం ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. తెలంగాణ జాగృతి జనం బాటలో భాగంగా శనివారం మధ్యాహ్నం కవిత ఎంజీఎం ఆస్పత్రిల్లోని అత్యవసర విభాగం ఎమర్జెన్సీ ల్యాబ్, సిటీస్కాన్ విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంజీ ఎం ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి...? ఇంకా ఎలాంటి కొరత ఉన్నాయనే విషయాలను పరిపాలనాధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఎంజీఎం ఆస్పత్రి ఏమాత్రం మెరుగుపడలేదన్నారు. పెరిగిన రోగుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కలెక్టర్ వెంటనే ఆస్పత్రుల్లో సౌకర్యాల లేమిపై దృష్టి సారించాలని కోరారు. ఉమ్మడి జిల్లా నుంచి మహిళా మంత్రులైన సీతక్క, కొండా సురేఖలకు పేద ప్రజల ఆరోగ్యం శ్రద్ధ లేదని కవిత ఆరోపించారు. ప్రసూతి ఆస్పత్రి నిర్వహణ మరింత దిగజారిపోయిందన్నారు. ఎంజీఎం ఆస్పత్రి సమస్యలపై కలెక్టర్‌తో మాట్లాడతామని, అయినా మార్పు రాకపోతే యాక్షన్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంజీఎం ఆర్ఎంవో శశికుమార్, జాగృతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వీధి రౌడీలా మాట్లాడడం సరి కాదు

కాజీపేట (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల కోసం నిలబడి, కాలేజీ యాజమాన్యాల తరఫున పోరాడుతామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి జనంబాటలో భాగంగా కాజీపేట ఫాతిమానగర్‌లో శనివారం కవితకు జాగృతి నేతలు బతుకమ్మలు, కోలాటంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. కళాశాల యాజమాన్యాలతో సీఎం రేవంత్ రెడ్డి వీధిరౌడీలా మాట్లాడడం సరియైంది కాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం తాను కౌన్సిల్ లో మాట్లాడితే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారన్నారు. కాలేజీ యాజమాన్యాలు లోన్ తీసుకుని, డబ్బులు కూడబెట్టి కాలేజీలు నిర్మించారన్నారు. కాలేజీ యాజమాన్యాలకు ఇబ్బందులు వస్తే తాను వారి తరఫున పోరాడుతామన్నారు. కాలేజీ యాజమాన్యాలు కూడా విద్యార్థుల చదువుకు భంగం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.


కేయూ క్రాస్ రోడ్డు వద్ద నిరుద్యోగులతో మాట్లాడుతున్న కవిత

సర్జికల్ కేర్‌పై సరైన శిక్షణ అవసరం
కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీ పి.వి. నందకుమార్‌రెడ్డి

వరంగల్ మెడికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలో సర్జికల్ కేర్‌పై బోధనా సిబ్బందితో పాటు విద్యార్థులకు సరైన శిక్షణ ఇవ్వడం అవసరమని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ వీసీ పి.వి.నందకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని కాళోజీ కళా క్షేత్రంలో తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా 11వ వార్షిక సదస్సు రెండో రోజు జరిగింది. ఇందులో భాగంగా ముఖ్య అతిథిగా వీసీ నందకుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం నూతన ప్రణాళికల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య అనిల్, నర్సంపేట జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, డాక్టర్ ఉమాకాంత్‌గౌడ్, డాక్టర్ నరేష్ కుమార్, డాక్టర్ అప్పాల సుధాకర్, డాక్టర్ సిద్ధార్థ్, డాక్టర్ రాజ్యలక్ష్మీగోదాదేవి, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ నాగార్జునరెడ్డి, డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ ఎస్‌వీవీరెడ్డి, డాక్టర్ కూరపాటి రమేష్, డాక్టర్ నాగేందర్, డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ నందకుమార్‌రెడ్డి తదితరులు

నిరుద్యోగులు సమస్యలపై పోరాడాలి
కేయూ విద్యార్థులతో కవిత 'చాయ్‌పే చర్చ'

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత తమ సమస్యలపై పోరాడాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. శనివారం రాత్రి కేయూ క్రాస్‌రోడ్డులో జనంబాటలో భాగంగా కల్వకుంట్ల కవిత 'చాయ్ పే చర్చ' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కేయూ నిరుద్యోగ యువతతో కవిత మాట్లాడి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇస్తామని భావించినప్పటికీ ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించిన ఉద్యోగాలిచ్చి తామే ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగుల తమ సమస్యలతో పాటు జోనల్ వ్యవస్థ అంశాలపై పోరాడాలని ఆమె కోరారు. రాష్ట్రంలో అధికారం మారితేనే నిరుద్యోగ యువత జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తానని కవిత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లింగుదారి రాజేశ్వర్‌రావు, మంద భాస్కర్, వర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

బానిస బతుకులు

» గ్రానైట్ కటింగ్ పరిశ్రమల్లో పని చేస్తున్న వందలాది మంది ఇతర రాష్ట్రాల కార్మికులు
» వసతులు కల్పించడంలో కంపెనీల నిర్లక్ష్యం
» వెట్టి చాకిరి చేయించుకుంటున్న నిర్వాహకులు
» పర్యవేక్షణ లేని కార్మిక శాఖ అధికారులు

ఎల్కతుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బతుకు దెరువు కోసం వచ్చిన వలస కార్మికులు గ్రానైట్ కటింగ్ కంపెనీల్లో బానిస బతుకులు బతుకుతున్నారు. శ్రమకు తగిన వేతనం చెల్లించకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు కంపెనీలు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తి పడి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. గాయాలైనా, అనారోగ్యానికి గురైన కార్మికుని ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. వైద్య ఖర్చులు భరించ లేక, తిరిగి స్వస్థలానికి వెళ్లలేక వలస కూలీలు దుర్భర జీవితాలు గడుపుతున్నారు.

వందలాది మంది..

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల పరిధిలో ఉన్న 40 గ్రానైట్ కటింగ్ కంపెనీల్లో సుమారు ఎనిమిది వందల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో బీహార్, జార్ఖండ్, కర్ణాటక, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, అస్సాం, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్, హర్యానా, అరుణాచల్‌ప్రదేశ్, నేపాల్, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు కంపెనీల్లో పనిచేస్తున్నారు. అమావాస్య రోజు మినహా ప్రతి రోజు 24 గంటల పాటు గ్రానైట్ కటింగ్ నిరంతరాయంగా నడుస్తూనే ఉంటాయి. కార్మిక చట్టాల మేరకు షిఫ్టుల వారీగా పని చేయించుకోవాల్సిన పరిశ్రమల నిర్వాహకులు కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారు. ఒకే వ్యక్తిచే రాత్రి పగలు విరామం లేకుండా పనులు చేయించుకుంటున్నట్లు పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీ గ్రామంలో వలస కార్మికులే..

వ్యవసాయానికి నాట్లు వేయడంతో పాటు రైసు మిల్లుల్లో, గ్రానైట్ కటింగ్ కంపెనీల్లో, ఇటుక బట్టీల్లో, భవన నిర్మాణాల్లో ఎక్కడ చూసినా ప్రతి గ్రామంలో వలస కూలీలు అధిక మొత్తంలో ఉన్నారు. వారికి ఉపాధి కావలసినంత దొరుకుతుంది. ఈ ప్రాంత ప్రజలకు సైతం పనుల్లో ఊరట కలుగుతోంది.. కానీ ఎప్పుడు వస్తారో తెలియదు, ఎప్పుడు చెప్పపెట్టకుండా వెళ్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల కొందరు కార్మికులకు ముందుగా యజమాని నుంచి డబ్బులు ఎక్కువగా ముట్టగానే మరుసటి రోజు అతడి ఆచూకీ లభించడం లేదు. చెప్ప పెట్టకుండా రాత్రికి రాత్రే ఉడాయిస్తున్నారు.


ఎల్కతుర్తిలో ఆరు బయట నిద్రిస్తున్న వలస కార్మికులు

వసతులు కరువు

పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు కనీస వసతులు కల్పించాల్సిన నిర్వాహకులు కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేస్తున్నారు. దేశంలోని కార్మిక చట్టాల ఆధారంగా వేతనాలు చెల్లించడం లేదు. 8 గంటలకు మించకుండా పనులు చేయించుకోవాల్సిన పరిశ్రమల నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. పని చేసే సమయంలో ఎలాంటి అనారోగ్యానికి గురైనా భద్రత చర్యలు పాటించకుండా వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. వార్షిక సెలవులు ఇవ్వకుండా సంవత్సరం పాటు బలవంతపు పనులు చేయించుకుంటున్నారు. కార్మికుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కార్మికులకు అందించాల్సిన ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, బోనస్ డబ్బులు చెల్లించకుండా కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు. పని చేసే చోట ఉండటానికి సరైన నివాస వసతులు కల్పించడం లేదు. ఇరుకు గదిలో నివసిస్తూ దుర్భర జీవితాలు గడుపుతున్నారు. ఎలాంటి కార్మిక సంఘాలతో సంబంధం లేకపోవడంతో పరిశ్రమల నిర్వాహకులు చెప్పిన పనులే కార్మికులకు శాసనంగా మారాయి.

మొద్దు నిద్రలో కార్మిక శాఖ

కార్మిక చట్టాలను ఉల్లంగిస్తున్న పరిశ్రమలపై ఉక్కు పాదం మోపాల్సిన కార్మిక శాఖ అధికారులు నిర్వాహకులు ఇచ్చే మామూళ్లతో మొద్దు నిద్రలో ఉంటున్నారు. కార్మికులకు చట్ట ప్రకారం వేతనాలు చెల్లించకుంటే జరిమానాలు విధించాల్సిన అధికారులు మచ్చుకైన జరిమానాలు విధించిన దాఖలాలు లేకుండా పోయాయనే ఆరోపణలున్నాయి. కార్మికులకు ప్రమాదకరంగా హాని కలిగే పరిస్థితులున్నా చర్యలు తీసుకోవడం లేదు. వెట్టి చాకిరి చేయిస్తున్న పరిశ్రమలకు చెందిన బిజినెస్ లైసెన్స్‌ను రద్దు చేసే అధికారం ఉన్నప్పటికీ డబ్బు మూటలు ముట్టేసరికి చోద్యం చూస్తున్నారు. పరిశ్రమల్లో గాయపడిన, మృతి చెందిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించకపోయిన అధికారులు పట్టించుకోవడం లేదు. కార్మిక శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గ్రానెట్ పరిశ్రమల నిర్వాహకులకు శ్రమ దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయింది.

కారు బోల్తా


బోల్తా పడి నుజ్జునుజ్జయిన వాహనం

యువకుడి దుర్మరణం

పర్వతగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కారు బోల్తా పడి యువకుడు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని ఏనుగల్లు గ్రామ శివారులో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు గ్రామానికి చెందిన షేక్ సాహెల్ (23) సంగెం మండలంలోని గవిచర్ల గ్రామంలో వారి బంధువుల వివాహానికి హాజరై తిరిగి వెళ్తుండగా తాను ప్రయాణిస్తున్న హుండాయ్ వెన్యూ కారును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన పడిపోయింది. ఇంజను ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో సాహెల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి యాకూబ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి సాహెల్ మృతదేహాన్ని తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.


షేక్ సాహెల్ (ఫైల్)

ముగిసిన జోనల్ క్రీడలు
విజేతలకు బహుమతులు అందజేత

రాయపర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో ఈ నెల 6 నుంచి ప్రారంభమైన 11వ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు శనివారం కోలాహలంగా ముగిశాయి. చివరి రోజు క్రీడా పోటీలు ఉత్సాహంగా జరగ్గా, గెలుపొందిన క్రీడాకారులకు ప్రిన్సిపాల్ సరిత బహుమతులను ప్రదానం చేశారు. అథ్లెటిక్స్ అండర్-14 విభాగంలో తొర్రూరుకు చెందిన సంకీర్తన, అండర్-17లో మడికొండకు చెందిన చందనశ్రీ, అండర్-19 విభాగంలో మహబూబాబాద్‌కు చెందిన అశ్విని గెలుపొందారు. అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్ షిప్‌లో అండర్-14లో తొర్రూరు, అండర్-17లో మడికొండ, అండర్-19లో మడికొండ పాఠశాలలు ఎంపికయ్యాయి. గేమ్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో అండర్-14లో రాయపర్తి, అండర్-17లో పరకాల, అండర్-19లో రాయపర్తి ఉన్నాయి. గేమ్స్ అండర్ అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో అండర్-14, 17, 19లో రాయపర్తి నిలిచింది. ఖో-ఖో, కబడ్డీ, చెస్, క్యారమ్స్, హ్యాండ్‌బాల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్‌తో పాటు జ్ఞాపికలను అందించారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ సరిత, టీచర్లు

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సరిత మాట్లాడుతూ 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్ ఎంతో విజయవంతంగా ముగిసిందని తెలిపారు. 14 పాఠశాలల నుంచి 1,190 మంది విద్యార్థులు పాల్గొన్నారని, క్రీడా పోటీల్లో వారి స్ఫూర్తిని ప్రదర్శించడం గర్వకారణమని తెలిపారు. ఈ క్రీడా పోటీలకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలియచేశారు.

రోడ్డు బాగా లేదని బస్సు ఆపేశారు..

» రాగంపేట, రంగాపురం, కొత్తూరుకు బస్సు బంద్
» ఎమ్మెల్యే దొంతి చొరవతో రోడ్డుకు మరమ్మతు
» అయినా పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
» ఇబ్బందులు పడుతున్న మూడు గ్రామాల ప్రజలు

ఖానాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేట, కొత్తూరు, రంగాపురం గ్రామాల మీదుగా వెళ్లే బస్సు సర్వీసు బంద్ అయి ప్రజలు అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాలకు మండల కేంద్రం నుంచి ఈ మూడు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో నాలుగు నెలల కిందట ఆ గ్రామాలకు అప్పటి వరకు ఉదయం, సాయంత్రం నడిచిన షటిల్ సర్వీస్ బస్సును ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నెల కిందట గుంతలమయమైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు చేయించారు. దీంతో నాటి నుంచి వాహన రాకపోకలకు ఇబ్బందులు తప్పాయి. కానీ, ఆర్టీసీ అధికారులు మాత్రం ఇప్పటివరకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించలేదు.

రోజూ రాకపోకలు

రాగంపేట, కొత్తూరు, రంగాపురం గ్రామాల్లో 8 వేలకు పైగా జనాభా ఉంటుంది. నిత్యం ఆయా గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు వస్తుంటారు. వీరు నర్సంపేటలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు వెళ్తుంటారు. అలాగే వీరితో పాటు మహిళలు, ప్రైవేట్ ఉద్యోగులు, రైతులు వివిధ పనుల నిమిత్తం వందలాది మంది ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. నాలుగు నెలలుగా బస్సు సౌకర్యం నిలిపివేయడంతో వారంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.


మరమ్మతు చేపట్టిన రోడ్డు

ఆర్టీసీ అధికారులకు మొర

ఈ గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఆయా గ్రామాల వాసులు, విద్యార్థులు పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల విద్యార్థులు, గ్రామస్థులు ఆర్టీసీ డీఎంను కలిసి వినతిపత్రం ఇవ్వబోగా ఆమె తీసుకోవడానికి నిరాకరించిందని విద్యార్థులు తెలిపారు. ఆర్టీసీ అధికారులు వచ్చి రోడ్డును పరిశీలించాక బస్సు సౌకర్యం కల్పించాలా ? వద్దా ? అనే విషయం ఆలోచిస్తామని డీఎం అన్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. ఇలా చెబుతూ తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు..
బంధారపు శ్రీనివాస్‌గౌడ్, రంగాపురం



రాగంపేట, కొత్తూరు, రంగాపురం గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులకు కలిసి విన్నవించాం. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. డీఎం రూట్ పరిశీలన చేయాలన్నారు. దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా బస్సు సౌకర్యం కల్పించాలి.

ఎమ్మెల్యే స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి
శౌంతి విఘ్నేష్, బీటెక్ విద్యార్థి, కొత్తూరు



గతంలో ఉదయం, సాయంత్రం కళాశాల సమయానికి బస్సు నడవడంతో బస్సులోనే నర్సంపేటకు వెళ్లి వచ్చేవాళ్లం. బస్సు సౌకర్యం నిలిపివేయడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల డయల్ యువర్ డీఎం ప్రోగ్రాంలో ఈ విషయాన్ని డీఎం దృష్టికి తీసుకెళ్లాం. అయినా పట్టించుకోవడంలేదు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పందించి మాకు బస్సు సౌకర్యం కల్పించాలి.

కోటను సందర్శించిన విదేశీయులు

ఖిలావరంగల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్‌ను శనివారం నెదర్లాండ్ దేశస్థులు సందర్శించారు. మధ్యకోటలోని శిల్ప సంపదలను జోహన్-హెలేన్ దంపతులతో పాటు అమెరికా దేశస్థురాలు మోనికా కోటను తిలకించారు. మధ్యకోటలోని శిల్పాలతో పాటు ఏకశిల గుట్ట, శృంగారపుబావి, ఖుష్‌మహల్, స్వయంభూదేవాలయం రాతి, మట్టికోటలను పరిశీలించి వారి కెమెరాలలో బంధించుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



చతుర్ముఖ లింగం గురించి తెలుసు కుంటున్న విదేశీయులు



బహుమతులు ఇస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలి

కాజీపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ముందుండాలని కాజీపేట ఏసీపీ పి.ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాజీపేట బాపూజీనగర్‌లో నారాయణ పాఠశాల ప్రాంగణంలో శనివారం జోనల్స్ స్పోర్ట్స్ మీట్ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీలకు కాజీపేట ఏసీపీ పి.ప్రశాంత్‌రెడ్డి, జోనల్ డీజీఎం రిజ్వానా ఇమ్రాన్, ఎంఈవో నెహ్రూనాయక్‌లు హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు కేవలం శారీరక బలాన్నే కాకుండా మానసిక బలాన్ని ఇస్తాయన్నారు. ఆటల్లో నిజమైన స్ఫూర్తిని ప్రదర్శించాలని చెప్పారు. క్రీడల్లో జాతీయ స్థాయిలో ముందుండి దేశప్రతిష్టను పెంచాలని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో నారాయణ కళాశాల ప్రిన్సిపల్ తేజవత్ అనిత, సిబ్బంది అలేఖ్య, ఫర్హానా, మమత, జోనల్ కో- ఆర్డినేటర్ ఆకుల సాయకృష్ణ, తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

రహమత్ నగర్‌లో భూగర్భ జలాలు కలుషితం



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బాబుమియా, దిల్‌షాద్

వడ్డెపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాజీపేట 62వ డివిజన్ పరిధిలోని రహమత్ నగర్‌లో సోమిడి, విష్ణుపురి మీదుగా వచ్చే మురుగు నీటితో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని రహమత్‌నగర్ కాలనీ ప్రతినిధి ఎం.డి. బాబుమియా, ఎం.డి. దిల్‌షాద్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు రాంబాబు, ఎం.డి.ఖలీల్, కవిత మాట్లాడారు. డ్రెయినేజీ నీటితో రహమత్‌నగర్‌లో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నో పర్యాయాలు విన్నవించుకున్నా నిమ్మకు నీరెత్తినట్లుగానే వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జలాలు కలుషితం కావడంతో చర్మ వ్యాధులు, విష జ్వరాలు, శ్వాస సంబంధమైన వ్యాధులతో ప్రజలు అనారోగ్యబారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రహమత్‌నగర్ కాలనీప్రతినిధులు రాజేషం, అంకుషా వలి, ముంతాజ్, అమీదా, రహిమొద్దీన్, రాంబాబు పాల్గొన్నారు.

రుద్రేశ్వరాలయంలో మహా లింగార్చన



లింగార్చనలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయి స్తంభాల రుద్రేశ్వరాలయంలో కార్తీక మాస వేడుకల్లో భాగంగా సంకటహర చతుర్థిని పురస్కరించుకుని శనివారం రాత్రి ప్రదోశ కాల సమయంలో మహాలింగార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో 11మంది వేద పండితుల సమక్షంలో పుట్టమట్టితో తయారు చేసిన వేయి శివలింగాలను లింగార్చనకు వినియోగించారు. చెరకు రసం, నెయ్యి, తేనె, బిల్వ ఫలాలు, నువ్వుల నూనె, రుద్రాక్ష ఉదకం, కస్తూరి పరిమళ ద్రవ్యాలతో లింగాలకు అభిషేకం నిర్వహించారు. ధన ప్రాప్తి, వంశ వృద్ధి, ఆరోగ్యం, తేజస్సు లాంటి సత్ఫలితాలు సిద్ధిస్తాయని లింగార్చన కార్తీకంలో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుందని ఉపేంద్రశర్మ చెప్పారు. గంగు మణికంఠశర్మ, జ్యోతిభరత్‌శర్మ, ప్రసాద్‌శర్మ, కృష్ణశర్మ, ప్రద్యుమ్నశర్మ, తదితర వేద పండితులు వైదిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ఈవో డి.అనిల్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్.మధుకర్, రామకృష్ణ, రజిత, తదితర ఆలయ సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. రాత్రి వేళ నందీశ్వరుడి సన్నిధిలో భక్తులు ఉసిరిక దీపాలను పెద్ద సంఖ్యలో వెలిగించుకున్నారు. ప్రముఖ శివ భక్తుడు సతీష్‌కుమార్ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో విశేష కార్తీక సమారాధన పేరిట అన్నప్రసాద వితరణ చేశారు.

రామకృష్ణ సేవ మందిర్‌లో సత్సంగ్ జపసాధన



భజన చేస్తున్న భక్తులు

బాలసముద్రం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో జపం చేస్తే ఆటంకాలు ఉంటాయని కుటుంబం నుంచి వేరుగా ఏకాంతంగా భగవత్ సాధన చేయడానికి హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి నగర్‌లోని రామకృష్ణా సేవా మందిర్‌లో పలువురు భక్తులు శనివారం జప సాధన చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 5 గంటల పాటు భక్తులు శ్రీలలితసహస్ర పారాయణం, శ్రీవిష్ణు సహస్ర పారాయణం, ఓం నమో భగవతే రామకృష్ణాయా నామ జపం ప్రముఖులచే ఆధ్యాత్మిక ప్రసంగాలు, భజనలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా దీపారాధన, తులసీ ఆరాధన నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణతో కార్యక్రమం ముగించారు. జప సాధనలో భక్తులు స్వరూపమ్మ, లక్ష్మమ్మ, రాధికమ్మ, భాస్కర్, తిరుపతిరెడ్డి, రంజిత్, తదితర భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

వడ్డెపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు హనుమకొండ 56, 57 డివిజన్లలోని గోపాల్‌పూర్, సమ్మయ్య నగర్, ఇంజనీర్స్ కాలనీ లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు ఆస్తి నష్టానికి గురయ్యారు. సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ అండ్ హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సాగంటి మంజుల వరద బాధితులకు నిత్యవసర సరుకులు, దుప్పట్లు, చీరలు, బ్రెడ్, బిస్కెట్లను శనివారం పంపిణీ చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- కేక్‌లు కట్ చేసి స్వీట్ల పంపిణీ
- పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు



హసన్‌పర్తి బస్టాండ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మడికొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మడికొండలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మడికొండ మెట్టుగుట్టపై గల రామలింగేశ్వర స్వామి, సీతారామచంద్ర స్వామి ఆలయా ల్లో అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం మడికొండ చౌరస్తాలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొట్ల రాజు యాదవ్, కాంగ్రెస్ శ్రేణులు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నార్లగిరి కుమారస్వామి, వస్కుల శంకర్, కుర్ల మోహన్, వస్కు ల నాగరాజు, బిల్లా రవీందర్, బైరి రాజు, రాజారపు స్వామి, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, కల్లపు అర్జున్, వస్కుల శ్రీను, బైరి రజినీ వేణు, దువ్వ విజయ్ పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట: కడిపికొండ ఆర్వోబీ వద్ద శనివారం సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. 47వ డివిజన్ నాయకులు సిరిల్ లారెన్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పలువురు నేతలు హాజరై కేక్‌కట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పదకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు బర్ల రాజ్‌కుమార్, నీలం భాను చందర్, కె. వంశీనాధ్, అలీమ్, మధర్, తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి బస్టాండులో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ అధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎర్రగట్టుదేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, పెద్దమ్మ నర్సింహరాములు, ఆరెల్లి వెంకటస్వామి, పల్లపు అనూష, కోడెల మురళి, గుండమీది రవి, పుల్ల రవి, మేకల రవి, జన్ను రవి, ఎన్‌టీఆర్ మొగిలి, గంగాధర్, శ్యామ్, తిరుపతి, కిశోర్, సతీష్, సంపత్, సురేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



కాజీపేటలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సీఎం రేవంత్ జన్మదినం సందర్భంగా మడికొండలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వైన్‌షాపు ఏర్పాటును విరమించుకోవాలి

అశోక కాలనీ వాసులు డిమాండ్



వైన్ షాపు ఏర్పాటు చేసే భవనం వద్ద ధర్నా చేస్తున్న అశోక కాలనీ వాసులు

వడ్డెపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 57వ డివిజన్ ఎన్జీవోస్‌కాలనీ ప్రధాన రహదారిలోని అశోక కాలనీలో వైన్స్ షాపు ఏర్పాటును విరమించుకోవాలని అశోక కాలనీ అధ్యక్షుడు మందల కృష్ణారెడ్డి డిమాండ్‌చేశారు. వైన్స్ షాపు ఏర్పాటును వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శనివారం వైన్స్‌షాపు ఏర్పాటు చేసే భవనం ముందు అశోక కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నివాస గృహాల మధ్య వైన్స్ షాపు ఏర్పాటు చేస్తే కాలనీ వాసులు మందుబాబులతో పాటు ఆకతాయిల బెడదను ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. ఈ ప్రాంతంలో పాఠశాలలతో పాటు దేవాలయాలు, వాణిజ్య సముదాయాలు, ఆస్పత్రులు ఉన్నాయని వైన్స్ షాపు ఏర్పాటుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ చహత్‌బాజ్‌పాయ్ చొరవ తీసుకొని వైన్స్ షాపును ఏర్పాటును నిలువరించాలని కోరారు. ఈ ధర్నాలో అశోక కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు రాంచందర్, బసవయ్య, ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్, నాగరాజు, నారాయణరెడ్డి, లక్ష్మణ్ రావు, హనుమాస్ తిరుపతిరెడ్డి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

సంగెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుంటపల్లి గ్రామానికి చెందిన మాడిశెట్టి సాంబయ్య (50) జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉన్న ఇనుప రాడ్డుకు బెడ్‌షీట్‌తో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకు న్నాడు. శనివారం రాత్రి జరిగిన సంఘటనపై సంగెం ఎస్సై వంశీకృష్ణ, గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు.. సాంబయ్య భార్యతో ఉంటూ వరంగల్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, గత మూడు రోజులుగా కుంటపల్లి గ్రామంలోని తన సొంత ఇంటిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. కాగా, సాంబయ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య , ఇద్దరు కుమారులు ఉన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ మృతి

వరంగల్ చౌరస్తా, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటకు చెందిన అంగన్‌వాడి వర్కర్ చెనబోయిన ఉమ (35) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. రెండు రోజుల క్రితం ఆమెకు బ్రెయిన్ స్ట్రోక్ రాగా కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ శనివారం కన్నుమూశారు. ఆమెకు భర్త, కూతురు, కుమారుడు ఉన్నారు. నిరుపేద అయిన ఉమ కుటుంబాన్ని మంత్రి, ఎమ్మెల్యే, ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు కోరారు.



హైదరాబాద్‌లో శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మేయర్, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

ప్రమాదాలపై పట్టింపేదీ?

- కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లు
- ఏర్పాటు చేయాలని ప్రజల వినతి

వడ్డెపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వివిధ డివిజన్లలో విద్యుత్ శాఖ రోడ్లపక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. కంచెలు లేకపోవడం వల్ల పశువులు ప్రమాదాల భారిన పడుతున్నాయి. వాటి చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని పలు కాలనీల ప్రజలు విద్యుత్ శాఖ అధికారులను వేడుకుంటున్నారు. హనుమకొండ 56వ డివిజన్‌లోని సాయికృష్ణా కాలనీ, గోపాల్‌పూర్, 58వ డివిజన్‌లోని ఎన్జీవోస్ కాలనీ , 60వ డివిజన్‌లోని విజయపాల్ కాలనీ, కేయూ ఎంప్లాయీస్ కాలనీ, రిజిస్ట్రేషన్ ఆఫీస్ రోడ్డులోని , టీచర్స్‌కాలనీ ఫేస్-2తోపాటు వివిధ కాలనీలలో రోడ్డు పక్కన విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేవు. ఈ ప్రాంతాల్లో పశువులు రేయింబవళ్లు రోడ్లపైనే సంచరిస్తుంటాయి. కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లను అవి తాకితే ప్రమాదాలు జరుగుతాయని వడ్డెపల్లితో పాటు సురేంద్రపురి కాలనీ, విష్ణుపురి కాలనీలకు చెందిన పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. వడ్డెపల్లిలో సుమారు వందలాది కుటుంబాలు పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. గేదెలు, ఆవులను పెంచుతూ వాటి ద్వారా వచ్చిన పాల ఉత్పత్తులను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి తెచ్చిన గేదెలు, ఆవులు ప్రమాదాలకు గురైతే భారీగా నష్టపోవల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇటీవలనే వడ్డెపల్లికి చెందిన అనుమాల నాగరాజుకు చెందిన రెండు గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. చిన్న పిల్లలు సైతం ఆటలు ఆడుతూ ఆకతాయిగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తాకే ప్రమాదం ఉంది.విద్యుత్ శాఖతో పాటు జీడబ్ల్యూఎంసీ అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని రైతులతో పాటు పశుపోషకులు కోరుతున్నారు.



సాయికృష్ణ కాలనీలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్



కేయూ ఎంప్లాయీస్ కాలనీలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలి

వల్లాల రాజ్‌కుమార్ గౌడ్, గోపాల్‌పూర్



సాయికృష్ణా కాలనీ, గోపాల్‌పూర్, ద్వారకా సాయి కాలనీ, సురేంద్రపురి కాలనీలలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు వెంటనే కంచెలు ఏర్పాటు చేయాలి. కంచెలు ఏర్పాటు చేయకపోవడం వలన పశువులు వాటిని తాకి ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. చిన్న పిల్లలు సైతం ఆటలు ఆడుతూ ట్రాన్స్‌ఫార్మర్లను తాకే ప్రమాదం ఉంది.

ఆర్మీ ఉద్యోగం ఇప్పిస్తామంటే నమ్మొద్దు

- హనుమకొండ ఏసీపీ నరసింహారావు

వరంగల్ క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రలోభాలకు గురిచేసే దళారులను నమ్మవద్దని హనుమకొండ ఏసీపీ నరసింహారావు ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 10 నుంచి 23 వరకు జేఎన్ఎస్ స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, ఆర్మీ ఉద్యోగం ఇప్పిస్తామనే దళారులు కంటపడితే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. రిక్రూట్‌మెంట్ అయిపోయేంత వరకు ప్రతీరోజు జేఎన్ఎస్‌కు వచ్చే వాకర్స్‌తో పాటు ప్రాక్టీస్ చేసే ఆటగాళ్లకు అనుమతి లేదని ఏసీపీ తెలిపారు.

ఎంపీవో శివనాగేష్‌కు సన్మానం



ఎంపీవో శివనాగేష్‌కు సన్మానిస్తున్న గురుకుల సిబ్బంది

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-2లో విజయం సాధించి ఇటీవలే మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కొలనుపాక శివనాగేశ్‌ను హనుమకొండలోని మైనార్టీ గురుకుల పాఠశాల సిబ్బంది శనివారం శాలువాతో సన్మానించారు. కాగా, శివనాగేష్ అంతకుముందు గురుకులంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించి గ్రూప్-2లో ఎంపీవోగా ఎంపిక కావడంతో గురుకుల సిబ్బంది ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి తిరుప్పావడ సేవ

మట్టెవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ బట్టల బజార్ రామన్నపేటలోని శ్రీ బాలానగర వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసం మూడో శనివారాన్ని పురస్కరించుకొని స్వామివారికి తిరుప్పావడ సేవ ఘనంగా నిర్వహించారు. శ్రీ శ్రీనివాస పద్మావతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామికి 108కిలోల పులిహోరతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం గార్నెపల్లి సుధాకర్ ఆధ్వర్యంలో సామూహిక శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో కిషన్‌రావు, ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, అర్చకులు పరాశరం శ్రీధరాచార్యులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, గందె గోవిందరాజులు పాల్గొన్నారు.

ప్రకటన

(ఒరిజినల్ డాక్యుమెంట్ కనిపించుట లేదు)

[illegible]

1) వలుపదాసు విజయ్ కుమార్, తండ్రి: ఉప్పలయ్య (లేటు), వయస్సు: 41 సం॥లు, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి, నివాసం: ఇ.నెం. 24-3-28, దర్గా, కాజీపేట మం॥, హన్మకొండ జిల్లా.

2) వలుపదాసు రవికుమార్, తండ్రి: ఉప్పలయ్య (లేటు), వయస్సు: 44 సం॥లు, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి, నివాసం: ఇ.నెం. 24-3-28, దర్గా, కాజీపేట మం॥, హన్మకొండ జిల్లా. [illegible] D.P. No. 29/92, REC Employees Housing Colony, (2nd Phase Vishal Housing Colony), [illegible] నెం. 1001 [illegible] శ్రీమతి వలుపదాసు చంద్రకళ, భర్త: ఉప్పలయ్య (లేటు), నివాసం: ఇ.నెం. 24-3-28, దర్గా, కాజీపేట మం॥, హన్మకొండ జిల్లా [illegible] 1440/2012 [illegible] 120 [illegible] 1439/2012 [illegible] 120 [illegible] 240 [illegible] 4566/1992, 30-10-2025 [illegible]


1) [illegible] తూర్పు: 33 ఫీట్ల వెడల్పు రోడ్డు, పడమర: ఓపెన్ ప్లాట్ నెం.6, ఉత్తరం: ఓపెన్ ప్లాట్ నెం. 14, దక్షిణం: ఓపెన్ ప్లాటు నెం.13 భాగం.

2) [illegible] తూర్పు: 33 ఫీట్ల వెడల్పు రోడ్డు, పడమర: ఓపెన్ ప్లాట్ నెం.6, ఉత్తరం: ఓపెన్ ప్లాట్ నెం.13 భాగం, దక్షిణం: ఓపెన్ ప్లాటు నెం.12.

సం/- కందగట్ల శ్రవణ్ కుమార్
అడ్వకేట్

Date: 8-11-2025

ఇ.నెం. 2-7-58/2/1, [illegible] సెల్: 8099593915





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
మెరైన్స్	వెబ్‌సిరీస్	నవంబర్ 10
ఢిల్లీ క్రైమ్ 3	హిందీ సిరీస్	నవంబర్ 13
అమెజాన్ ప్రైమ్		
ప్లే డేట్	ఒరిజినల్ మూవీ	నవంబర్ 12
జియో హాట్‌స్టార్		
జాలీ ఎల్ఎల్‌బీ 3	హిందీ చిత్రం	నవంబర్ 14
జీ 5		
ఇన్‌స్పెక్షన్ బంగ్లా	మలయాళ సిరీస్	నవంబర్ 14
మనోరమా మ్యాక్స్		
కప్లింగ్	మలయాళ చిత్రం	నవంబర్ 14

'భీమ్లానాయక్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన **సంయుక్తా మీనన్**... 'బింబిసార', 'విరూపాక్ష' తదితర చిత్రాలతో విలక్షణ నటిగా గుర్తింపు పొందారు. 'అఖండ తాండవం' లాంటి తెలుగు సినిమాలతో పాటు ఇతర భాషా చిత్రాలతోనూ బిజీగా ఉన్న ఆమె... తన గురించి, తన కెరీర్ గురించి 'నవ్య'తో ప్రత్యేకంగా మాట్లాడారు.



ప్రేక్షకులకు నచ్చితేనే భవిష్యత్తు

మీరిప్పుడు ఎలాంటి పాత్రల్లో నటిస్తున్నారు?

నేను పోషిస్తున్న పాత్రలన్నీ వేటికవే ప్రత్యేకమైనవి. 'బ్లాక్ గోల్డ్' సినిమాలో పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషించాను. ప్రస్తుతం పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో నా పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. అలాగే 'అఖండ తాండవం'లో కూడా నా పాత్ర వినూత్నంగా ఉండబోతోంది. ఇన్ని వైవిధ్యమైన పాత్రల్లో ఇమిడిపోగలుగుతానని నేను కూడా అనుకోలేదు. కానీ ప్రతి పాత్రనూ ఆస్వాదిస్తాను. ఒక పాటలో భాగంగా చక్కని డాన్స్‌ను ప్రదర్శించవలసి వచ్చినా, సన్నివేశంలో భాగంగా భావోద్వేగాలను ప్రదర్శించవలసి వచ్చినా... పూర్తి ప్రతిభను కనబరచడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను.

ఇన్ని భిన్నమైన పాత్రల్లో నటించడం, వరుస షూటింగ్‌లు.. ఇదంతా మీకు కష్టంగా ఉంటుందా?

లేదు. నేనెప్పుడూ అలా అనుకోను. చేస్తున్న పనిని ప్రేమించడం నా నైజం. మక్కువ కలిగిన పని చేసేటప్పుడు ప్రతిక్షణం ఆనందాన్ని అనుభవిస్తాం. ఆ పని శ్రమలా తోచదు. ఒక్కో రోజు షూటింగ్‌తో ఒంట్లో ఉన్న శక్తినంతా ఖర్చు చేయాల్సిన అవసరం ఉందనిపిస్తుంది. కానీ షూటింగ్ ముగించుకుని, సాయంత్రం జిమ్‌లో వ్యాయామం చేసి, ఇంటికి వచ్చి, గంట సేపు పెంపుడు కుక్కలతో ఆడుకున్న తర్వాత కూడా... అలసిపోయిన భావన కలగదు.

మీరు ఎక్కడికి వెళ్లినా... పెంపుడు కుక్కలను కూడా వెంటబెట్టుకు వెళ్తూ ఉంటారా?

నాకు మూడు పెంపుడు కుక్కలున్నాయి. నోవా, ఆర్య, రుద్ర వాటి పేర్లు. మూడు భిన్నమైన కుక్కలే! మూడిటిలో రుద్ర పెద్దది. 45 కిలోల బరువు ఉండే రుద్ర... నా మీదకు దూకేసి ఆటలాడే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. మేము మా పెంపుడు కుక్కలను కూడా కుటుంబ సభ్యుల్లాగే పరిగణిస్తాం.

సినీనటిగా, కథానాయికగా ఎదుగుతానని చిన్నప్పుడు అనుకున్నారా?

లేదు. ఎప్పుడూ అనుకోలేదు. నాకసలు అలాంటి ఆలోచనే ఉండేది కాదు. ఇదంతా విధి ఫలితమే! నేను కేరళలోని ఒక అందమైన గ్రామంలో పుట్టాను. ఆ గ్రామం కేరళ, తమిళనాడు సరిహద్దులో ఉంది. అంత మారుమూల గ్రామం నుంచి సినీ రంగంలోకి ప్రవేశించే మార్గమే లేనప్పుడు, దాని గురించి ఆలోచించే అవకాశం కూడా ఉండదు కదా? కాబట్టి బాగా చదువుకొని, డాక్టరు కావాలని కోరుకునే దాన్ని. ప్రపంచమంతా చుట్టి రావాలని అనుకునేదాన్ని. బడిలో చదువుకునే రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనేదాన్ని. పుస్తకాలు ఎక్కువగా చదివేదాన్ని. చిన్మయ స్కూల్‌లో చదివే రోజుల్లో వేదాలతో పరిచయం ఏర్పడింది. నేను పెద్దయ్యాక నటిని అవుతానని నా కుటుంబం, స్నేహితులు, బంధువులు ఎవరూ ఊహించలేదు.



ఖాళీ సమయాల్లో ఏం చేస్తారు?

నేను పుస్తకాలు ఎక్కువగా చదువుతాను. షూటింగ్‌లో ఖాళీ ఉంటే.. 'కిండిల్'లో పుస్తకాలు చదువుతాను. ఖాళీ సమయాల్లోనే కాదు, సంతోషంగా ఉన్నా, విచారంగా ఉన్నా, ప్రయాణం చేయవలసివచ్చినా పుస్తకాలనే ఎంచుకుంటాను.

సినిమాల్లోకి ఎలా ప్రవేశించారు?

యాదృచ్ఛికంగా జరిగింది. ఇంటర్ పూర్తయ్యాక కాలేజీలో చేరాలని అనుకుంటూ ఉండేదాన్ని. మా గ్రామ ప్రజలు కొన్ని వార్షిక సంచికలు ముద్రించేవారు. గ్రామీణుల కథలు, అనుభవాలు వాటిలో ప్రచురితమవుతూ ఉండేవి. ఒక సందర్భంలో ఆ సంచిక ముఖచిత్రం కోసం వాళ్లు నన్ను సంప్రతించారు. నా ఫొటో ఆ సంచిక ముఖ చిత్రంగా అచ్చయింది. అలాగే నేను సందర్శించే ఒక బ్యూటీ పార్లర్.. పాలక్కాడ్‌లో బ్యూటీషియన్స్ కోసం ఒక మేకప్ సెమినార్‌ను నిర్వహించింది. ఆ సెమినార్‌కు ఒక సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్ ఆధ్వర్యం వహించింది. ఆ ఆర్టిస్ట్‌కు మోడల్‌గా వ్యవహరించవలసిన అమ్మాయి సమయానికి సెమినార్‌కు చేరుకోలేకపోయింది. దాంతో మా అమ్మ బలవంతం మీద... నేను మోడల్‌గా వ్యవహరించవలసి వచ్చింది. అప్పుడు నన్ను పోర్ట్‌ఫోలియో తయారుచేసుకోవాలనీ, మోడలింగ్ అవకాశాల కోసం ప్రయత్నించాలనీ ఆ మేకప్ ఆర్టిస్ట్ సలహా ఇచ్చింది. ప్రొఫెషనల్ మేకప్‌లో నేను భిన్నంగా కనిపిస్తున్నట్టు మొదటిసారిగా గ్రహించాను. ఆ తర్వాత ఆ మేకప్ ఆర్టిస్ట్, నేనూ ఫేస్‌బుక్ ఫ్రెండ్స్‌గా మారిపోయాం. 'వనిత' అనే మ్యాగజైన్‌కు ఫొటోగ్రాఫర్‌గా వ్యవహరించే ఒక వ్యక్తి... ఓనమ్ పండుగ కోసం నన్ను ఫొటోషూట్ చేస్తానని అడిగారు. ఆ ఫొటోలు పబ్లిష్ అయిన తర్వాత, నాకు సినిమా అవకాశాలు రావడం మొదలుపెట్టాయి. అప్పటివరకూ నాకు సినీ వాతావరణం గురించి ఏమాత్రం తెలీదు. షూటింగ్‌లు ఎలా జరుగుతాయో, లోకేషన్లు ఎలా ఉంటాయో కూడా తెలీదు. అయితే రెండో సినిమా తరువాత... ఈ రంగంతో ప్రేమలో పడిపోయాను. అనంతరం గొప్ప దర్శకుల దర్శకత్వంలో రూపొందిన అంతర్జాతీయ సినిమాలు చూశాను. గొప్ప నటుల ప్రతిభను అర్థం చేసుకుకోవడానికి, నటిగా నన్ను నేను ఆవిష్కరించుకోవడానికి ప్రయత్నించాను. అయితే నాలోని నటిని వెలికి తీయడానికి తగిన దర్శకుడు, తగిన కథ, తగిన సహనటులు అవసరమనే విషయాన్ని కూడా గ్రహించాను. అలా అంశాలన్నీ అనుకూలించినప్పుడు, కచ్చితంగా నటనా ప్రతిభను చాటుకోవచ్చని నేను నమ్ముతాను. 'విరూపాక్ష' సినిమా విషయంలో అదే జరిగింది.

సున్నితమైన నటన, సాంస్కృతిక మూలాలు, ప్రాంతీయతలను ప్రతిబింబించే కథాంశాలు మలయాళ సినిమాకు ఆయువుపట్లు. కానీ ఇక్కడ వినోదమే ప్రధానం. ఈ రెండు ప్రపంచాలకు సమన్వాయం ఎలా చేస్తున్నారు?

భారతదేశంలో ఒక నటిగా సినిమా పరిశ్రమను అన్వేషించేటప్పుడు... భిన్నమైన రాష్ట్రాకు చెందిన భిన్నమైన సినీ పరిశ్రమల లోతుపాతులను అన్వేషించాలి. వాటిని యథాతథంగా స్వీకరించాలి. భిన్న రాష్ట్రాల ప్రేక్షకుల ఇష్టాయిష్టాలు కూడా భిన్నంగానే ఉంటాయి. భారతీయ సినీ పరిశ్రమ ఒకటే అయినప్పటికీ ప్రేక్షకులు భిన్నంగా ఉంటారు. అలాగని సినిమా కమర్షియల్ అయినంత మాత్రాన దానికి తగ్గట్టు మన నటనను మార్చుకోవలసిన అవసరం లేదని భావిస్తాను. అయితే ఒక పాత్ర నాకు తగినది కాదని అనిపించినప్పుడు... దాన్ని అంగీకరించడానికి వెనకాడతాను. అలా వద్దనుకున్న పాత్రలు కూడా ఉన్నాయి. నేను తెలుగు సినీ రంగంలోకి అడుగు పెట్టిన ఈ రెండేళ్ల కాలంలో తెలుగు ప్రేక్షకులు చక్కని నటనను, కథను చూడాలనుకుంటున్న విషయాన్ని గ్రహించాను. ప్రేక్షకులకు నచ్చినప్పుడే నటులకు భవిష్యత్తు ఉంటుంది. కాబట్టి వాళ్లకు నచ్చినది అందించగలగాలి.

మీరు తెలుగు ఎలా నేర్చుకున్నారు?

నటనా ప్రతిభ కనబరచాలంటే మొదట భాష తెలుసుకోవాలి. నా సహనటులు చెప్తున్న డైలాగ్స్ నాకు అర్థమైనప్పుడే... నేను మెరుగైన ప్రతిభ కనబరచగలుగుతాను. 'విరూపాక్ష' సినిమా రూపొందే సమయంలో కొవిడ్ వల్ల ఒక నెల ఖాళీ సమయం చిక్కింది. ఆ సమయంలో 'జూమ్' ద్వారా నేను తెలుగు భాష నేర్చుకున్నాను. మొదట్లో రెండు వాక్యాలతో మొదలుపెట్టాను. మొదట్లో తప్పులు మాట్లాడేదాన్ని. అయినా సిగ్గు పడకుండా మాట్లాడుతూనే తెలుగు భాష మీద పట్టు పెంచుకున్నాను. నేనిప్పుడు కొన్ని మాండలికాలను కూడా అనుకరించగలుగుతున్నాను.

మీ ఎమోషనల్ సపోర్ట్ ఎవరు?

నా కుటుంబానికి నేనే ఎమోషనల్ సపోర్ట్. నా ఎమోషనల్ సపోర్ట్... శివుడు. 'శైవ కాశ్మీర్ స్కూల్‌'లో కాశ్మీర్ శైవిజం గురించి నేర్చుకున్నాను.

మీరు చేయబోతున్న తెలుగు ప్రాజెక్టులు?

'స్వయంభూ', 'అఖండ తాండవం' రిలీజ్ కాబోతున్నాయి. పూరీ జగన్నాథ్ గారి సినిమా ఎంతో ఆసక్తికరంగా ఉండబోతోంది. ఈ సినిమాలన్నీ విజయం సాధించాలని కోరుకుంటున్నా! ఫీమేల్ సెంట్రిక్ మూవీ 'బ్లాక్ గోల్డ్' కూడా విడుదల కాబోతోంది. బెల్లంకొండ శ్రీనివాస్‌తో కలిసి ఒక సినిమాలో నటిస్తున్నాను. తమిళంలో కూడా ఒక సినిమాలో నటిస్తున్నాను.

● సీవీఎల్ఎన్ ప్రసాద్



ఎన్టీఆర్ భవన్‌లో స్త్రీ శక్తి హస్తకళ స్టోర్‌ను ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి

కుటుంబంలో మహిళదే కీలక పాత్ర: నారా భువనేశ్వరి

» ఎన్టీఆర్ భవన్‌లో స్త్రీ శక్తి హస్తకళ స్టోర్ ప్రారంభం

హైదరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో మహిళదే కీలక పాత్ర అని ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి చెప్పారు. అమ్మగా, చెల్లిగా, భార్యగా బాధ్యతలు నిర్వహించడం సృష్టి గొప్పదనమని, ప్రేమ, ధైర్యం మహిళల్లోనే ఉంటుందన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో స్త్రీశక్తి హస్తకళ స్టోర్‌ను భువనేశ్వరి ప్రారంభించారు. ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో 511 మంది మహిళలు ఎంబ్రాయిడరీ, టైలరింగ్ వంటి విభాగాల్లో శిక్షణ పొందారు. ఇక్కడి ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం తొలి స్త్రీశక్తి స్టోర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో వచ్చే లాభం మహిళలకేనని, ఎన్టీఆర్ ట్రస్టు ఒక్క పైసా తీసుకోదని భువనేశ్వరి స్పష్టం చేశారు.

పెళ్లి వేడుకలో డ్యాన్స్ చేస్తూ.. గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడి మృతి



చోలేటి కిషన్‌రెడ్డి (ఫైల్)

హుజూరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ పెళ్లి వేడుకలో డ్యాన్స్ చేస్తూ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చోలేటి కిషన్‌రెడ్డి (62) గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం తమ సమీప బంధువు కుమార్తె వివాహానికి వెళ్లిన ఆయన ఆ వేడుకలో డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. అక్కడున్న వారు వెంటనే ఆయనను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు.

రేషన్ బియ్యంలో తలంబ్రాలు.. అవాక్కైన లబ్ధిదారులు



రేషన్ బియ్యంలో తలంబ్రాలు, రంగురంగుల పూసలు

కేశంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యంలో తలంబ్రాలు, రంగురంగుల పూసలు రావడంతో లబ్ధిదారులు అవాక్కయ్యారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం లింగంధన గ్రామంలోని రేషన్ దుకాణంలో బియ్యం తీసుకోవడానికి వెళ్లిన గ్రామస్థులు వాటిలో తలంబ్రాలు రావడం చూసి ఆశ్చర్యపోయారు. నాలుగు బస్తాల్లో తలంబ్రాలు, రంగురంగుల పూసలు దర్శనమిచ్చాయి. అప్పటికే అక్కడికి బియ్యం తీసుకోవడానికి వెళ్లిన మాజీ సర్పంచ్ మధుసూదన్ గౌడ్ విషయాన్ని తహసీల్దార్ రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తలంబ్రాలు వచ్చిన బస్తాలను పక్కన పెట్టాలని, వాటిని గోదాంకు పంపి మంచి బియ్యం తెప్పిస్తామని ఆయన తెలిపారు. మండలంలోని తొమ్మిదిరేకుల గ్రామంలో కూడా రేషన్ బియ్యంలో తలంబ్రాలు వచ్చినట్లు తెలిసింది. అధికారులు గోదాంలో పరిశీలించి మంచి బియ్యం పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

వారానికి మూడుసార్లు జంక్‌ఫుడ్

(మొదటిపేజీ తరువాయి)



ఇచ్చారు. కొంత సమయమిచ్చి, వారి అభిప్రాయాన్ని సేకరించారు. అందులో వారానికి ఎన్నిసార్లు బయట జంక్‌ఫుడ్ తింటున్నారు? ఎక్కడ తింటున్నారు? ఏమేమి తింటున్నారు? ఎవరితో కలసి తింటున్నారు? ఏ సమయంలో తింటారు? లాంటి ప్రశ్నలడిగి, సమాచారాన్ని సేకరించారు. సేకరించిన డేటాను విశ్లేషించారు. కొవ్వు, చక్కెర, ఉప్పు అధికంగా ఉండే జంక్ ఫుడ్ తరచుగా తినడం వల్ల ఊబకాయంతోపాటు అధిక రక్తపోటు, ఫ్యాటీ లివర్, మధుమేహం వంటి వ్యాధుల బారిన పడే ముప్పు ఎక్కువ. ఆరోగ్యంపై జంక్ ఫుడ్ చూపే ఈ దుష్ప్రభావాల గురించి పూర్తి అవగాహన ఉన్నప్పటికీ.. మహిళా విద్యార్థులు ఆ తరహా ఆహారాన్ని ఎక్కువగా తింటున్నారని అధ్యయనంలో తేలింది.

ఆందోళన కలిగించేలా..

ఈ అధ్యయనంలో వెల్లడైన కీలక అంశాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయని అధ్యయనకర్తలు పేర్కొన్నారు. అవేంటంటే..

- స్టడీలో పాల్గొన్న వారిలో దాదాపు 190 మంది (46.4%) విద్యార్థులు వారానికి 3 రోజుల కంటే ఎక్కువ జంక్ ఫుడ్ తింటున్నారు. ఇలా తింటున్న వారిలో మహిళా విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు.
- ఫాస్ట్ ఫుడ్ ఎక్కువగా తింటున్నామని చెప్పిన వారు 134 మంది (33%) కాగా.. స్వీట్లు తింటామని 36 మంది (9%), ఉప్పుతో కూడిన ప్రాసెస్డ్ ఫుడ్స్‌ను ఎక్కువగా ఇష్టపడతామని 30 మంది (7%), శీతల పానీయాలంటే ఇష్టమని 20 మంది (5%), బహుళ ఆహార పదార్థాలు (మల్టీపుల్ ఫుడ్ ఐటెమ్స్) తింటామని 189 మంది (46%) తెలిపారు.
- స్నేహితులతో కలిసి జంక్ ఫుడ్ ఎక్కువగా తింటామని 124 మంది (30%) తెలిపారు. దీని నిబట్టి.. యువత ఆహారపుటలవాట్లపై సామాజిక ప్రభావం ఎక్కువగా ఉందని భావించవచ్చు.
- సర్వేలో పాల్గొన్న వారిలో 391 మందికి (96శాతం) జంక్ ఫుడ్ వల్ల కలిగే హానికరమైన పర్యవసానాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. తింటే అనారోగ్యం పాలవుతామని తెలిసీ వారు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండలేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోందని ఆ స్టడీ పేర్కొంది.
- సర్వేలో పాల్గొన్న వారిలో 60 శాతం మంది జంక్‌ఫుడ్ కోసం వారానికి కనీసం రూ.300 ఖర్చు పెడుతున్నారని వెల్లడైంది. మరో 25 శాతం మంది రూ.300-500 మధ్య ఖర్చుపెడుతుండగా, 7.8 శాతం మంది రూ.500-1000 మధ్య, మరో 6.8 శాతం మంది వెయ్యి రూపాయలకు మించి వ్యయం చేస్తున్నట్లు ఆ స్టడీ పేర్కొంది.
- వారానికి కనీసం ఒకటి రెండు సార్లు ఏదో ఒక పండు తింటున్న వారు 54 శాతం మంది ఉండగా, మరో 24 శాతం మంది మూడు నాలుగు సార్లు, 12 శాతం మంది ఐదారుసార్లు తింటున్నట్లు తేలింది.
- వారంలో కూరగాయలు 1-2 రోజులే తింటున్న వారు 11% ఉండగా, 3-4సార్లు తినేవారు 31%, ఐదారుసార్లు తినేవారు 33 శాతం, ఏడుసార్లకు మించి తినేవారు 25 శాతం మంది ఉన్నట్లు అధ్యయనంలో వెల్లడైంది.

ఎక్కడ తింటున్నారంటే...

జంక్‌ఫుడ్‌ను వినియోగించేవారిలో 41.8 శాతం మంది ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ తినేస్తున్నారు. మరో 20 శాతం మంది స్ట్రీట్ ఫుడ్ వెండర్స్ దగ్గర.. ఇంకో 15 శాతం మంది రెస్టారెంట్లలో.. మరో 11 శాతం కాలేజీల్లో లాగించేస్తున్నారు. మిగతావాళ్లు ఇంటివద్దనే తింటున్నట్లు స్టడీలో తేలింది.

- ఫ్రెండ్స్‌తో కలసి తినేవారు 31 శాతం మంది ఉండగా, ఒంటరిగా 5 శాతం మంది, తల్లిదండ్రులతో కలసి 10.3 శాతం మంది.. చదువుతూ ఒక శాతం, ట్రావెల్ చేస్తూ మరొక శాతం మంది జంక్‌ఫుడ్ లాగిస్తున్నారు. మరో 53.5 శాతం మంది.. ఫ్రెండ్స్, పేరెంట్స్, ఇతరులతో కలసి తింటున్నట్లు తెలిపారు.
- స్టడీలో పాల్గొన్నవారిలో ఊబకాయంతో బాధపడుతున్నవారిలో 45% మంది అబ్బాయిలు ఉండగా.. 55% మంది అమ్మాయిలున్నారు. మహిళా విద్యార్థుల్లో జంక్‌ఫుడ్ వినియోగం అధికంగా ఉండటమే ఇందుకు కారణం.

జంక్‌ఫుడ్‌తో అనేక అనారోగ్య సమస్యలు



జంక్‌ఫుడ్‌లో ఉప్పు, ట్రాన్స్‌ఫ్యాట్స్ అధికంగా ఉంటాయి. ఎక్కువ రుచిగా ఉండడంతోపాటు.. ఫుడ్ డెలివరీ యాప్స్ ద్వారా వెంటనే ఇంటికే వచ్చేస్తున్నాయి. అలాగే కాలేజీలు, స్కూల్స్‌లో మరింత అందుబాటులో ఉంటున్నాయి. జంక్‌ఫుడ్‌ను స్టోర్ చేయడం కూడా చాలా తేలిక. అందుకే జంక్‌ఫుడ్ వినియోగం బాగా పెరుగుతోంది. కానీ.. ఈ తరహా తిండిని ఎక్కువగా తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యలొస్తాయి. ముఖ్యంగా ఊబకాయం రావడం ఖాయం. అలాగే బీపీ, షుగర్‌తో పాటు అమ్మాయిల్లో పీసీవోడీ లాంటి సమస్యలు తలెత్తుతాయి. వీలైనంత మేరకు వీటికి దూరంగా ఉంటే మంచిది.

- డాక్టర్ ఎంవీ రావు, కన్సల్టెంట్ ఫిజిషియన్, యశోద ఆస్పత్రి, హైదరాబాద్

భావ ప్రకటనా స్వేచ్ఛ లేకుంటే ప్రజాస్వామ్యమే ఉండదు

» ప్రభుత్వాలు లేకున్నా ఫర్వాలేదు పత్రికలు మాత్రం తప్పనిసరి

» సి.రాఘవాచారి 6వ స్మారకోపన్యాసంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి



హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థకు పత్రికా రంగానికి అత్యంత అవినాభావ సంబంధం ఉందని, పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వాలు నియంత్రించడానికి ప్రయత్నించిన ప్రతి సందర్భంలోనూ న్యాయస్థానాలు భావ ప్రకటనా స్వేచ్ఛకు రక్షణగా నిలిచాయని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యమే ఉండదని, ఇది కేవలం న్యాయసూత్రం కాదు జీవన సత్యమన్నారు. 'ప్రభుత్వాలు లేకపోయినా ఫర్వాలేదు కానీ పత్రికలు మాత్రం తప్పనిసరిగా ఉండాలి' అన్న అమెరికన్ ఫౌండింగ్ ఫాదర్ థామస్ జెఫర్సన్ మాటలను ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి గుర్తు చేశారు. ప్రభుత్వాలు వ్యక్తిగత కక్షతో ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా పత్రికా ప్రచురణకు అవాంతరాలు కలిగిస్తే అది ముమ్మాటికి రాజ్యాంగ వ్యతిరేకమే అంటూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కేసును ఉదహరించారు. రాఘవాచారి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షరశస్త్రధారి, పీపుల్స్ ఎడిటర్ సి.రాఘవాచారి 6వ స్మారకోపన్యాస కార్యక్రమం శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా 'ప్రసార మాధ్యమాలు-న్యాయ వ్యవస్థ' అంశంపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి కీలకోపన్యాసం చేశారు. పత్రికా స్వేచ్ఛను నియంత్రించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కనుక నాటి నెహ్రూ ప్రభుత్వం 19వ అధికరణకు సవరణ చేసి క్లాజ్ 2ను జతచేసినట్టు ఆయన వివరించారు. ప్రస్తుతం సోషల్‌మీడియా సంప్రదాయ మీడియా పరిధి దాటిందన్నారు. ప్రపంచంలోని అతికొద్ది మంది సంపన్నులు సోషల్ మీడియాను శాసిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బు సంపాదనకన్నా, నమ్మిన సిద్ధాంతానికి చివరి వరకు అంకితమైన గొప్ప ప్రజా సంపాదకుడు రాఘవాచారి అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి కొనియాడారు. మహాభారత, రామాయణాలను వామపక్ష, ప్రగతిశీలవాదులు విస్మరించడంవల్ల మతఛాందసవాదులు వాటి స్ఫూర్తికి విరుద్ధంగా లేని రంగులద్ది ప్రచారంలో పెడుతున్నారని విమర్శించారు.


గజగజ

» రంగారెడ్డి జిల్లా చందన్వెల్లి, తాళ్లపల్లిలో శనివారం 14.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

» రాష్ట్రంలో రోజురోజుకి పెరుగుతున్న చలి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో చలి ప్రభావం మొదలైంది. చలి, చలిగాలుల తీవ్రత రోజురోజుకి అధికమవుతోంది. శివారు ప్రాంతాల్లో పొగ మంచు ప్రభావం చూపెడుతోంది. ముఖ్యంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి రోజురోజుకూ పెరిగిపోతోంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు శనివారం 15 డిగ్రీల దిగువకు పడిపోయాయి. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన్వెల్లి, తాళ్లపల్లిలో శనివారం 14.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో శనివారం నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రత ఇదే కావడం గమనార్హం. ఇక, హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. పొగ మంచు ప్రభావం అధికంగా ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.



ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళను పరామర్శిస్తున్న కల్వకుంట్ల కవిత

సీఎం.. వీధి రౌడీ భాష మార్చుకో!

» మీరు మాట తప్పి కాలేజీ యాజమాన్యాలను బెదిరిస్తారా?: కవిత

వరంగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీఎం వీధి రౌడీ భాషను మార్చుకోవాలని, కాలేజీ యాజమాన్యాల తాట, తోలు తీస్తానని మాట్లాడటం సిగ్గుచేటని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. వీధి రౌడీలు కూడా సిగ్గుపడేలా సీఎం మాట్లాడారని దుయ్యబట్టారు. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు ప్రాంతాల్లో చేపట్టిన 'జాగృతి జనంబాట'లో కవిత మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం కాలేజీలను తెలంగాణలో పెట్టకపోతే.. లోన్లు తీసుకుని పైసా పైసా పెట్టి ఇక్కడ డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలను ఏర్పాటు చేశారన్నారు. తెలంగాణ విద్యార్థులకు విద్యను అందించినందుకు వారి తాట తీస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 1,800 కాలేజీలుంటే.. రెండు కాలేజీల పేర్లే సీఎం చెప్పారని, ఆ రెండు కాలేజీలు నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అనుమతులు ఇవ్వొద్దన్నారు. కానీ, మిగతా కాలేజీలు ఏం తప్పు చేశాయని ప్రశ్నించారు. ఇచ్చిన మాట తప్పి వారినెలా బెదిరిస్తారంటూ సీఎంను ప్రశ్నించారు. తన మాటే జీవోతో సమానమన్న రేవంత్.. వరంగల్ వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చి 15 రోజులైనా ఇప్పటికీ నయా పైసా నిధులు ఇవ్వలేదన్నారు.

తప్పంతా కొలికపూడిదే!

కఠిన చర్యలు తీసుకోవాలి.. పార్టీ లైన్ దాటి ప్రవర్తించారు

- ఒక్క ఆరోపణకూ ఆధారం ఇవ్వలేదు
- చంద్రబాబుకు క్రమశిక్షణ కమిటీ నివేదిక

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలు.. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మధ్య తలెత్తిన వివాదంలో తప్పంతా కొలికపూడిదేనని పార్టీ క్రమశిక్షణ కమిటీ తేల్చింది. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. ఈ మేరకు శనివారం ఏపీ సీఎం చంద్రబాబుకు పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలోని కమిటీ సభ్యులు వర్ల రామయ్య, పంచుమర్తి అనురాధ, ఎంఏ షరీఫ్, కొనకళ్ల నారాయణ, బీసీ జనార్దన్‌రెడ్డిలు విచారణ నివేదికను అందించారు. కొలికిపూడి శ్రీనివాస్ వ్యవహారశైలి తొలి నుంచీ పార్టీ సిద్ధాంతాలకు భిన్నంగా ఉందని, తప్పటడుగు వేసిన ప్రతిసారీ క్రమశిక్షణ కమిటీ పిలిచి వివరణ తీసుకుంటూనే ఉన్నా ఆయన తన శైలిని మార్చుకోలేదని కమిటీ తన నివేదికలో పేర్కొంది. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి 16 నెలల కాలంలో మూడుసార్లు కొలికపూడి క్రమశిక్షణ కమిటీ ముందు హాజరయ్యారని, ప్రతిసారీ తప్పయిందని ఒప్పుకోవడం.. మరోసారి పునరావృతం కాకుండా చూసుకుంటానని చెప్పడం ఆయనకు రివాజుగా మారిందని పేర్కొంది. తాజా వివాదంలోనూ తిరువూరు నియోజకవర్గంలో పార్టీకి నష్టం కలిగించేలా కొలికపూడి వ్యవహరించారని, ఏకంగా పార్టీ ఎంపీపైనే డబ్బులు తీసుకుని టికెట్ ఇచ్చారని బహిరంగ ఆరోపణలు చేయడం క్షమార్హం కాదని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. తాను చేసిన ఆరోపణలకు రుజువులు ఉన్నాయంటూ క్రమశిక్షణ కమిటీ ఎదుట చెప్పిన కొలికపూడి ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేదని తెలిపారు. కొలికపూడి తీరు బాధ్యతారాహిత్యంగా ఉందని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది.

అధిష్ఠానం వారించినా ఆరోపణలు

'నా నియోజకవర్గంలో ఎంపీకి ఏం పని?.' అని క్రమశిక్షణ కమిటీ సభ్యుల ఎదుట కొలికపూడి తన వాదన వినిపించారని, వివాదం సద్దుమణగాలంటే ఎంపీ తన నియోజకవర్గంలో జోక్యం చేసుకోకుండా చూడాలని కూడా కోరారని నివేదికలో పేర్కొన్నారు. అయితే, ఈ వాదన సరికాదన్న కమిటీ.. ఎంపీగా తన పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేశినేని చిన్ని పర్యటించకుండా అడ్డుకోవడం సమంజసం కాదని తెలిపింది. అయినా తిరువూరు నియోజకవర్గ పర్యటన సమయంలో చిన్ని ముందుగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అనుమతితోనే పర్యటించారని పేర్కొంది. కానీ, కొలికపూడి మాత్రం ఏ విషయంలోనూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని కానీ, అధిష్ఠానం పెద్దలను కానీ సంప్రదించలేదని తెలిపింది. ఎమ్మెల్యే కొలికపూడి వ్యవహారశైలిని పరిశీలించిన తర్వాత ఆయనపై క్రమశిక్షణ చర్యగా సస్పెండ్ వేటు వేయాల్సిందేనని కమిటీ స్పష్టం చేసింది. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. తాను ఎమ్మెల్యే కొలికపూడి, ఎంపీ చిన్నిని పిలిచి మాట్లాడతానని తెలిపారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆలోచిద్దామని చెప్పారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

- మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధం
- కారులోని ఆరుగురుని కాపాడిన లారీ డ్రైవర్లు



చిట్యాలరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు ఆరుగురు ప్రయాణికులతో వెళ్తున్న ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. అందులో ఉన్నవారిని తోటి వాహనదారులు, లారీ డ్రైవర్లు ప్రాణాలకు తెగించి కాపాడారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో జరిగింది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి వివేక్‌నగర్‌కు చెందిన ప్రకాశ్‌పటేల్ కుటుంబసభ్యులు, బంధువులు రెండు కార్లలో చెన్నైకి బయలుదేరారు. ప్రకాశ్‌పటేల్ తన భార్య, ఇద్దరు కూతుళ్లు, మరో ఇద్దరు బంధువులతో కలిసి ఇన్నోవా కారులో బయలుదేరగా, తన సోదరుడి కుటుంబం మరో కారులో వెనుక వస్తోంది. ఇన్నోవా కారు చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి శివారులోకి రాగానే డివైడర్‌ను ఢీకొట్టి, బోల్తా పడింది. రహదారిపై వెళుతున్న లారీలు, ఇతర వాహనాల డ్రైవర్లు, వెనకాలే వస్తున్న ప్రకాశ్‌పటేల్ సోదరుడు గమనించి కారులో ఉన్నవారిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ముగ్గురు లారీ డ్రైవర్లు ప్రాణాలకు తెగించి మరీ కారులో ఉన్నవారిని కాపాడారు. కారు దగ్ధమవడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పి, గాయపడిన వారిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విధుల్లో చేరని ఆరుగురు టీచర్లపై చర్యలు

- నవంబరు నెల వేతనాల నిలిపివేతకు నిర్ణయం
- నల్లగొండ జిల్లాలో 270 మంది బదిలీ.. కొత్త స్కూళ్లలో చేరని 68 మంది

నల్లగొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో వర్క్‌ఆర్డర్ ద్వారా డిప్యుటేషన్ పొందిన ఉపాధ్యాయులు విధుల్లో చేరకపోవడంతో వారిపై చర్యలకు ఉపక్రమించారు. పిల్లలున్న ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ఉండాలనే ఉద్దేశంతో జిల్లాలో వర్క్‌ఆర్డర్ ద్వారా మిగులు ఉన్న స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, ఇతర ఉపాధ్యాయులను బదిలీ చేశారు. ఈమేరకు సెప్టెంబరులో రెండు దశల్లో 270 మంది ఉపాధ్యాయులను బదిలీ చేయగా వీరిలో 68 మంది వరకు బదిలీ జరిగిన పాఠశాలల్లో చేరలేదు. తక్షణం చేరనివారిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టర్, డీఈవోలకు విన్నవించారు. ఈ అంశంపై డీఈవో సంబంధిత ప్రధానోపాధ్యాయుల నుంచి నివేదికలు తెప్పించారు. రెండురోజుల్లోగా చేరాలని లేకుంటే క్రమశిక్షణాచర్యలు తీసుకుంటామంటూ 68 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఆ తర్వాతా కొందరు విధుల్లో చేరకుండా పైరవీలు చేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపించారు. కలెక్టర్ సీరియస్‌గా తీసుకోవడంతో ఆరుగురు ఉపాధ్యాయులకు నవంబరు వేతనాలు నిలిపివేయాలని నిర్ణయించారు. అయితే ఉత్తర్వులు పొంది ఇంకా చేరని వారందరిపైనా చర్యలు తీసుకోకుండా రాజకీయపైరవీలు అడ్డుపడుతున్నాయని, ఏ పైరవీలులేని ఆరుగురి వేతనాలు నిలిపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీ అయి పాఠశాలల్లో చేరని అందరిపైనా చర్యలు తీసుకోవాలే తప్ప ఆరుగురిపైనే చర్యలు తీసుకోవడమేంటని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై డీఈవో భిక్షపతిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. అందుబాటులోకి రాలేదు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ముందుకు ఎలా వెళ్లాలో నేర్చుకున్నా

సమంత



నటి సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు రిలేషన్‌లో ఉన్నారంటూ కొంత కాలంగా వార్తలొస్తున్న విషయం తెలిసిందే. తాజాగా సమంత షేర్ చేసిన ఓ ఫొటో నెట్టింట వైరల్ అయ్యింది. తన పెర్‌ఫ్యూమ్ బ్రాండ్ లాంచ్ ఈవెంట్‌లో దిగిన ఫొటో అది. ఆ ఫొటోలో సమంత రాజ్‌ని కౌగిలించుకోవడం చర్చనీయాంశమైంది. ఇదే ఈవెంట్‌లో పలువురితో దిగిన ఫొటోలు కూడా సమంత షేర్ చేశారు. ఈ సందర్భంగా తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ 'ఏడాదిన్నరగా నా కెరీర్‌లో ఎన్నో సాహసోపేతమైన అడుగులు వేశాను. ముందుకు ఎలా వెళ్లాలో నేర్చుకున్నా. చిన్న విజయాలను ఇప్పుడు సెలెబ్రేట్ చేసుకుంటున్నా' అని పేర్కొన్నారు. దీంతో రాజ్, సమంత ప్రేమాయణం నిజమేనంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

విజయ్‌ని పెళ్లి చేసుకుంటా

- రష్మిక మందన్న



విజయ్ దేవరకొండతో నిశ్చితార్థం అయ్యిందని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని కొంత కాలంగా వస్తోన్న వార్తలపై నటి రష్మిక మందన్న ఎట్టకేలకు స్పందించారు. ఇటీవల ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తనకు కాబోయే భాగస్వామికి ఉండాల్సిన లక్షణాల గురించి వివరించారు. 'నా భాగస్వామికి నన్ను లోతుగా అర్థం చేసుకునే శక్తి ఉండాలి. నా కోసం యుద్ధం చేయడానికైనా వెనుకాడకూడదు. అలాంటి మనిషి కోసం నేను తూటాకైనా ఎదురెళ్తా' అని అన్నారు. డేట్, పెళ్లి విషయాల గురించి ప్రస్తావిస్తూ.. 'ఒకవేళ నేను డేట్ చేయాల్సి వస్తే యానిమేషన్ క్యారెక్టర్ నరుటోతో చేస్తా. పెళ్లి చేసుకుంటే విజయ్‌ని చేసుకుంటా' అని చెప్పారు. కాగా, అక్టోబరు 3న రష్మిక, విజయ్ నిశ్చితార్థం జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించలేదు. అయితే ఈ మధ్య పలు ఇంటర్వ్యూల్లో నిశ్చితార్థం వార్తలపై రష్మిక స్పందించారు. సమయం వచ్చినప్పుడు వెల్లడిస్తానని అన్నారు. ఇప్పుడు విజయ్‌తో పెళ్లి విషయంలో స్పష్టతనిచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరి వివాహం జరగనున్నట్లు టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది.

సోమశిలలో అల్లు అర్జున్



నిత్యం షూటింగ్‌లతో బిజీగా గడిపే హీరో అల్లు అర్జున్ తన కుటుంబ సభ్యులు, చిన్ననాటి మిత్రులతో కలిసి శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామం దగ్గర కృష్ణానదిని సందర్శించారు. ఆహ్లాదంగా ఉండే కృష్ణానదిలో సరదాగా బోటింగ్ చేశారు. రెండు గంటలు అక్కడే గడిపారు.

-కొల్లాపూర్, ఆంధ్రజ్యోతి

వినోదం, సందేశం మేళవింపు



సంజీవ్ రెడ్డి

సంతాన లేమి సమస్య నేపథ్యంలో వినోదం, సందేశం మేళవింపుగా రూపొందిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. కథాంశం గంభీరమైనదైనా సగటు ప్రేక్షకులకు నచ్చేలా అన్ని హంగులతో తెరకెక్కించాం' అని దర్శకుడు సంజీవ్‌రెడ్డి అన్నారు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంజీవ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

- కొత్తగా పెళ్లైన దంపతులను 'సంతాన ప్రాప్తిరస్తు' అని దీవిస్తారు. కానీ మన సమాజంలో సంతానలేమి సమస్య తీవ్రంగా ఉంది. పురుషుల్లో వంధ్యత్వం సమస్య ఆధారంగా ఇప్పటివరకూ తెలుగులో సినిమా రాలేదు. మా బంధువులు, స్నేహితులు కొందరు ఇలాంటి సమస్యతో బాధపడ్డారు. తర్వాత వారిలో కొందరికి ఆధునిక వైద్యంతో సంతానం కలిగినా, సమాజం, కుటుంబ సభ్యుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బాలీవుడ్‌లో ఈ తరహా కథలతో కొన్ని సినిమాలు వచ్చాయి. కానీ మన దగ్గర రాలేదు. ఈ నేపథ్యంలో కథను చెబితే బావుంటుందనిపించి, స్ర్కిప్ట్ సిద్ధం చేశాను. ఇప్పటివరకూ నాలుగు గోడల మధ్య మాట్లాడుకునే అంశాన్ని ఈ సినిమా చూశాక ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్చిస్తారని భావిస్తున్నాను.
- ఓవర్ డ్రామా లేకుండా, హద్దులు దాటకుండా కుటుంబ సభ్యులతో కలసి చూసేలా కథను రూపొందించాం. హీరోకు వీర్యకణాల సంఖ్య తక్కువ ఉండడం అనేది కథలో ప్రధానాంశం.

యువతరాన్ని ఆకట్టుకునేలా...



శ్రీ నందు, యామినీ భాస్కర్ జంటగా వరుణ్ రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం 'సైక్ సిద్ధార్థ'. ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి ఆత్రీ కీలక పాత్రలు పోషించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బేనర్లపై శ్రీ నందు, శ్యామ్‌సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యువతరాన్ని ఆకట్టుకునేలా తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను శనివారం విడుదల చేశారు మేకర్స్. హైదరాబాద్ యాస మాట్లాడుతూ హైపర్ యాక్టివ్ వ్యక్తిగా శ్రీ నందు చేసిన నటన ఆకట్టుకుంది. డిసెంబరు 12న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

బిజినెస్ ప్లస్

వరంగల్ ● ఆదివారం 9 నవంబరు 2025

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,000 ▼	1,11,800 ▼	1,64,000 ▼
విజయవాడ	1,24,000 ▼	1,16,000 ▼	1,51,700 ▼
విశాఖపట్నం	1,21,910 ▼	1,11,750 ▲	1,65,000 ▲
రాజమండ్రి	1,22,020 ▲	1,11,850 ▲	1,49,000 ▲
ప్రొద్దుటూరు	1,21,450 ▲	1,11,730 ▲	1,51,600 ▼
ముంబై	1,20,100 ▼	1,10,012 ▼	1,48,275 ▲

డిజిటల్ గోల్డ్‌కు రక్షణ లేదా..?

అనియంత్రిత ప్లాట్‌ఫామ్స్, సంస్థల ద్వారా పసిడిలో పెట్టుబడులపై ప్రజలను హెచ్చరించిన సెబీ

ముంబై: దేశంలో డిజిటల్ గోల్డ్, ఆన్‌లైన్ పసిడి పథకాల్లో పెట్టుబడులు ఊపందుకున్న నేపథ్యంలో అనియంత్రిత వేదికలు, సంస్థల ద్వారా కొనుగోళ్లపై క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ హెచ్చరించింది. "కొన్ని డిజిటల్/ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ఇన్వెస్టర్లకు పసిడి లోహం కొనుగోళ్లకు ప్రత్యామ్నాయంగా డిజిటల్ గోల్డ్ లేదా ఈ-గోల్డ్ సాధనాలను ఆఫర్ చేస్తున్నట్లు సెబీ దృష్టికి వచ్చింది. అయితే, వాటిలో పెట్టుబడులకు రక్షణ ఉండదని, సెక్యూరిటీస్ లేదా కమోడిటీ డెరివేటివ్స్‌గా గుర్తింపు లేనందున అవి సెక్యూరిటీస్ మార్కెట్ రక్షణ పరిధిలోకి రావని" శనివారం విడుదల చేసిన ప్రకటనలో సెబీ స్పష్టం చేసింది. ఈ-గోల్డ్ లేదా డిజిటల్ గోల్డ్ స్కీమ్‌లు సెక్యూరిటీస్ మార్కెట్ పరిధికి వెలుపల పనిచేస్తాయి గనుక వాటిల్లో పెట్టుబడులకు తమ రక్షణ ఉండదని తెలిపింది.

నియంత్రణ పథకాలకే సెబీ రక్షణ

పసిడిలో పెట్టుబడులు పెట్టేందుకు నియంత్రిత సంస్థల ద్వారా ఇప్పటికే పలు సాధనాలను అందుబాటులోకి తేవడం జరిగిందని సెబీ పేర్కొంది. ఎక్స్ఛేంజీలో ట్రేడయ్యే గోల్డ్ డెరివేటివ్ కాంట్రాక్టులు, మ్యూచువల్ ఫండ్లు ఆఫర్ చేసే గోల్డ్ ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్), స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడయ్యే ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్ (ఈజీఆర్) ఇందుకు ఉదాహరణలు. సెబీ చట్టం పరిధిలోకి వచ్చే సంస్థలు ఆఫర్ చేసే బంగారం పథకాల్లో పెట్టుబడులు..మాత్రమే మా పర్యవేక్షణ,రక్షణ నియమావళి పరిధిలోకి వస్తాయని నియంత్రణ మండలి స్పష్టం చేసింది.

బ్యాంకు ఖాతాలో సొమ్ము మరిచిపోయారా..!

రీక్లెయిమ్ చేసుకోండి ఇలా..

మనలో చాలా మందికి బ్యాంకుల్లో పొదుపు ఖాతా (ఎస్‌బీ), కరెంట్ ఖాతాలు లేదా టర్మ్ డిపాజిట్లు ఉంటాయి. కొంతమంది తమ ఖాతాలను రెగ్యులర్‌గా నిర్వహిస్తుంటారు. మరికొంత మంది వాటిని సరిగా నిర్వహించరు.. లేదంటే ఏదో ఒక కారణంతో మర్చిపోతారు. ఒక్కోసారి ఖాతాదారుడు లేదా డిపాజిటర్ చనిపోతే వారి వారసులకు వాటి వివరాలు తెలియక పోవచ్చు. ఇలాంటి సందర్భాల్లోనూ మరుగున పడిన ఈ ఖాతాలు, డిపాజిట్లలోని డబ్బులు తిరిగి క్లెయిమ్ చేసుకోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం.

బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఏటేటా పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి ఈ మొత్తం రూ.67,000 కోట్లకు చేరింది. దీంతో ఈ మొత్తాన్ని వాటి అసలు ఖాతాదారులు లేదా వారి వారసులకు అప్పగించేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) చర్యలు చేపట్టింది. ఇందుకోసం అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్-గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్ (ఉద్గమ్) పేరుతో ఒక ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసింది. ఈ పోర్టల్ ద్వారా బ్యాంకు ఎస్‌బీ/కరెంట్ అకౌంట్ ఖాతాదారులు లేదా టర్మ్ డిపాజిటర్లు లేదా వారి వారసులు ఆ ఖాతాల్లోని మొత్తాలను తిరిగి క్లెయిమ్ చేసుకోవచ్చు.



పదేళ్ల పాటు నిర్వహణలో లేకపోతేనే..

బ్యాంకులోని ఏదైనా ఒక ఎస్‌బీ/కరెంట్ ఖాతాను పదేళ్ల పాటు ఆపరేట్ చేయకపోతే బ్యాంకులు దాన్ని ఇన్ఆపరేటివ్ ఖాతాగా పరిగణించి ఆ ఖాతాలోని మొత్తాన్ని ఆర్‌బీఐ నిర్వహించే డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌కు బదిలీ చేస్తాయి. గడువు దాటిన పదేళ్లలోపు వెనక్కి తీసుకోని టర్మ్ డిపాజిట్లను కూడా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా పరిగణించి డీఈఏ ఫండ్‌కు మళ్లిస్తారు. udgam.rbi.org.in పోర్టల్‌కు లాగిన్ అయి అవసరమైన వివరాలు సమర్పించడం ద్వారా ఈ ఖాతాల్లోని బ్యాలెన్స్ లేదా డిపాజిట్ల మొత్తాన్ని ఖాతాదారులు లేదా వారి వారసులు పొందవచ్చు.

డీఈఏ ఫండ్ నుంచి క్లెయిమ్ చేసుకోవచ్చా?

మర్చిపోయిన లేదా క్లెయిమ్ చేయని ఎస్‌బీ/కరెంట్ ఖాతాల్లోని సొమ్మును లేదా ఫిక్స్‌డ్ లేదా టర్మ్ డిపాజిట్లను ఖాతాదారులు లేదా వారి వారసులు ఉద్గమ్ పోర్టల్‌లో లాగిన్ అయి అవసరమైన వివరాలు సమర్పించటం ద్వారా ఆయా బ్యాంకుల నుంచే క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇందుకు ఎలాంటి కాలపరిమితి లేదు. బ్యాంకులు ఈ సొమ్మును డీఈఏ నుంచి రీక్లెయిమ్ చేసుకుంటాయి.

ఖాతాను గుర్తించడం ఎలా..?

వ్యక్తిగత ఖాతాదారులైతే ఉద్గమ్ పోర్టల్‌లో తమ పేరు, ఖాతా లేదా డిపాజిట్ ఉన్న బ్యాంకు పేరు ఎంటర్ చేయాలి. వీటికి తోడు ఓటర్, పాన్‌కార్డు నంబర్, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు నంబర్ లేదా ఖాతాదారుడి పుట్టిన తేదీ సర్టిఫికెట్.. వీటిలో ఏదో ఒకటి సమర్పించాలి. అదే నాన్ ఇండివిడ్యువల్స్ అయితే సంస్థ పేరు, ఖాతా ఉన్న బ్యాంకు పేరుతో పాటు సంస్థ అధీకృత అధికారి సంతకం, పాన్ నంబరు, కంపెనీ గుర్తింపు నంబర్ (సీఐఎన్), కంపెనీని నమోదు చేసిన తేదీ.. వీటిల్లో ఏదో ఒకదాని వివరాలు ఎంటర్ చేయాలి. ఒకవేళ పై వివరాలేవీ లేకపోయినా ఉద్గమ్ పోర్టల్‌లో వ్యక్తిగత, సంస్థాగత ఖాతాదారులు తమ చిరునామా ఎంటర్ చేయడం ద్వారా తమ డిపాజిట్లను క్లెయిమ్ చేసుకోవచ్చు.

ఇతర మార్గాలూ ఉన్నాయ్..

ఒకవేళ ఉద్గమ్ పోర్టల్ ద్వారా మర్చిపోయిన ఖాతాలు లేదా డిపాజిట్లు క్లెయిమ్ చేసుకోవడం కష్టమనిపిస్తే... ఖాతా లేదా డిపాజిట్ ఉన్న బ్యాంకుకు చెందిన ఏదైనా బ్రాంచ్‌కు వెళ్లి ఆధార్, పాస్‌పోర్టు, ఓటర్ ఐడీ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు వంటి వివరాలు సమర్పించాలి. బ్యాంకు ఈ వివరాలను నిర్ధారించుకున్న తర్వాత మీ సొమ్మును వడ్డీతో సహా చెల్లిస్తుంది. udgam.rbi.org.in పోర్టల్‌లో రిజిస్టరై లాగిన్ కావడం ద్వారా మీ ఖాతాలో ఎంత మొత్తం ఉన్నదీ తెలుసుకోవచ్చు.

డీఈఏ ఫండ్‌కు చేరే ఖాతాల సొమ్ము

పదేళ్లుగా ఆపరేట్ చేయని లేదా గడువు ముగిసి పదేళ్లయినా క్లెయిమ్ చేయని ఈ కింది ఖాతాల్లోని సొమ్ము డీఈఏ ఫండ్‌కు చేరతాయి. వాణిజ్య, సహకార బ్యాంకుల్లోని ఖాతాలకూ ఈ నిబంధన వర్తిస్తుంది. ఆ ఖాతాలు ఏమిటంటే..

- సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఖాతాలు
- ఫిక్స్‌డ్ లేదా టర్మ్ డిపాజిట్ ఖాతాలు
- క్యుములేటివ్/ రికరింగ్ డిపాజిట్ ఖాతాలు
- కరెంట్ డిపాజిట్ ఖాతాలు
- క్యాష్ క్రెడిట్ ఖాతాలు
- ఏదో ఒక పేరుతో లేదా ఏదో ఒక రూపంలో ఉన్న ఇతర డిపాజిట్ ఖాతాలు
- కేటాయింపుల తర్వాత రుణ ఖాతాల్లోని మిగులు
- లెటర్ ఆఫ్ క్రెడిట్/గ్యారెంటీతో పాటు ఇతర సెక్యూరిటీ డిపాజిట్లపై జారీ చేసే మార్జిన్ మనీ

ఉద్గమ్ పోర్టల్ పాత్ర

ఈ విషయంలో ఉద్గమ్ పోర్టల్‌ది కేవలం వెసులుబాటు పాత్ర మాత్రమే. ఖాతాదారులకు రావాల్సిన మొత్తాన్ని సంబంధిత బ్యాంక్ చెల్లిస్తుంది. ప్రస్తుతం ఉద్గమ్ పోర్టల్‌లో దేశంలోని 30 బ్యాంకులు సభ్యత్వం కలిగి ఉన్నాయి. కాకపోతే ఈ పోర్టల్ ద్వారా తమ సొమ్మును రీక్లెయిమ్ చేసుకోవాలంటే బ్యాంకు ఖాతాదారులు, డిపాజిటర్లు తమ పేరు, మొబైల్ నంబర్‌తో ముందుగా రిజిస్టర్ చేసుకోవాలి.

ప్రత్యేక క్యాంపులు

ఎస్‌బీ/కరెంట్ ఖాతాల్లోని అన్‌క్లెయిమ్డ్ మొత్తాలను, ఫిక్స్‌డ్ లేదా టర్మ్ డిపాజిట్లను ఖాతాదారులకు అందించేందుకు ఆర్‌బీఐ ఈ ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ప్రతి జిల్లాలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తోంది. ఈ క్యాంపుల ద్వారానూ తమ సొమ్మును రీక్లెయిమ్ చేసుకోవచ్చు.

ఐటీసీ.. 90% నిబంధన!

జీఎస్‌టీలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను తీసుకోవటానికి నిబంధనలు ఎలా ఉన్నాయో.. తీసుకున్న క్రెడిట్‌ను వాడుకోవటానికి కూడా అలాగే నిబంధనలు ఉన్నాయి. ఇందులో చాలా మంది పట్టించుకోని విషయం 99 శాతం నిబంధన. ఈ నిబంధన ఏమిటనేది ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

నవీన్ చంద్ర పేరుమోసిన బట్టల వ్యాపారి. రాష్ట్రంలోని అన్ని ముఖ్య పట్టణాల్లో షోరూమ్స్ ఉన్నాయి. వ్యాపారం విషయంలో ఎంత నిక్కచ్చిగా ఉంటాడో, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుల విషయంలోనూ అంతే కచ్చితత్వం పాటిస్తాడు. కట్టాల్సిన పన్నులను బకాయిలు లేకుండా సకాలంలో చెల్లించాలని తన సిబ్బందికి చెబుతుంటాడు. అలాంటిది జీఎస్‌టీ డిపార్ట్‌మెంట్ నుంచి తనకు ఒక నోటీస్ అందింది. గడిచిన కొన్ని నెలల్లో తాను కట్టాల్సిన పన్ను మొత్తం అంటే 100 శాతం పన్నును ఐటీసీ ద్వారానే చెల్లించారనీ, జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఒక నెలలో టర్నోవర్ రూ.50 లక్షలు దాటితే చెల్లించాల్సిన పన్నులో 99 శాతం మాత్రమే ఐటీసీ ద్వారా చెల్లించి మిగతా మొత్తాన్ని నగదు రూపంలో అంటే క్యాష్ లెడ్జర్ ద్వారా చెల్లించాల్సి ఉండగా.. మొత్తం పన్నును ఐటీసీతో చెల్లించటం చట్ట ఉల్లంఘన కిందకు వస్తుందని, కాబట్టి ఆ తేడా మొత్తాన్ని వెంటనే చెల్లించాలని స్పష్టం చేసింది. తనకు చట్ట ప్రకారం అర్హత ఉన్న ఇన్‌పుట్స్ మీదనే క్రెడిట్ తీసుకున్నాడు. ఆ క్రెడిట్‌నే పన్ను చెల్లింపునకు ఉపయోగించాడు. పన్ను మొత్తాన్ని క్రెడిట్ ద్వారా చెల్లించకూడదా? అని సందేహం వచ్చింది.



ఇదీ GST

రాంబాబు గొండాల

రూ.50 లక్షల టర్నోవర్ దాటితేనే..

ఏదేనీ నెలలో టర్నోవర్ రూ.50 లక్షలు మించితేనే అప్పుడు ఈ 99 శాతం నిబంధన అమల్లోకి వస్తుంది. అంటే చెల్లించాల్సిన పన్నులో 99 శాతానికి మించి ఐటీసీ వాడకూడదు. దీని అర్థం మిగతా ఒక శాతం కచ్చితంగా నగదు చెల్లింపు ద్వారా అంటే క్యాష్ లెడ్జర్ ద్వారా చెల్లించాలి అని. మరి టర్నోవర్ అంటే ఏం తీసుకోవాలి? ఇందులో నెలలో జరిగిన మొత్తం సరఫరాల విలువ నుంచి పన్ను మినహాయింపు ఉన్న సరఫరాల విలువ, జీరో రేటెడ్ సరఫరాల విలువ మినహాయించాలి. (జీరో రేటెడ్ సరఫరా అంటే ఎగుమతులకు లేదా సెజ్‌లకు పంపిన సరఫరా). ఇలా మినహాయించగా మిగిలిన మొత్తాన్ని టర్నోవర్ కింద లెక్కించాలి. ఇలా లెక్కించిన టర్నోవర్ రూ.50 లక్షలు దాటితే ఈ రూల్ వర్తిస్తుంది. అలా అని రూ.50 లక్షల టర్నోవర్ దాటిన ప్రతి కేసులోనూ ఈ 99 శాతం నిబంధన అమలవుతుందని అనుకోకూడదు. దీనికి కొన్ని మినహాయింపులు ఉన్నాయి.

మినహాయింపులున్నాయ్..

గడచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ రిజిస్ట్రేషన్ పొందిన సంస్థ లేదా వ్యక్తి రూ.లక్షకు మించి ఆదాయ పన్ను చెల్లించి ఉన్నా లేదా గడచిన ఆర్థిక సంవత్సరం సదరు సంస్థ లేదా వ్యక్తి రూ.లక్షకు మించి రిఫండ్ పొంది ఉన్నా (ఈ రిఫండ్ అనేది ట్యాక్స్ చెల్లించకుండా చేసే జీరో రేటెడ్ సరఫరాలకు లేదా ఇన్వర్టెడ్ ట్యాక్స్ స్ట్రక్చర్‌కు సంబంధించినవై ఉండాలి) లేదా ఇప్పటి వరకు అయిన టర్నోవర్ మీద ఇప్పటికే నగదులో ఒక శాతానికి మించి కట్టి ఉన్నా, ఇలాంటి సందర్భాల్లో ఈ రూల్ అమలు కాదు మిగతా అన్ని సందర్భాల్లోనూ ఎప్పుడైతే టర్నోవర్ రూ.50 లక్షలు దాటుతుందో అప్పుడు కనీసం ఒక శాతం పన్ను క్యాష్ లెడ్జర్ ద్వారా చెల్లించాలి.

కాబట్టి, జీఎస్‌టీ కింద రిజిస్ట్రేషన్ పొందిన వ్యక్తులు.. ఐటీసీ తీసుకోవటానికి గల నిబంధనలతో పాటు తీసుకున్న క్రెడిట్‌ను ఎలా వాడాలి? ఎంత మేరకు వాడాలి? ఇతరత్రా నియమ నిబంధనలు కూడా తెలుసుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభం రూ.49 కోట్లు

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.49.43 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.47.65 కోట్లు)తో పోల్చితే లాభం స్వల్పంగా 4 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా రూ.524 కోట్ల నుంచి రూ.657 కోట్లకు పెరిగింది. సెప్టెంబరు ముగిసే నాటికి ఆర్డర్ బుక్ 9,818 ఎలక్ట్రిక్ వాహనాలుగా ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	590	విజయవాడ	600
వరంగల్	592	గోదావరి	600
చిత్తూరు	623	విశాఖపట్నం	585
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	106
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	103
కర్నూలు	100	నెల్లూరు	108
విశాఖపట్నం	108	అనంతపురం	108
గోదావరి	106		

స్పోర్ట్స్

ఆసియా 'ట్రోఫీ' రాబోతోంది!

నఖ్వీతో సమావేశమైన బీసీసీఐ కార్యదర్శి

దుబాయ్: ఆసియాకప్ టీ20 టోర్నీలో చాంపియన్‌గా నిలిచిన టీమిండియాకు దాదాపు నెలన్నర రోజులైనా ట్రోఫీ అందలేదు. అయితే ఈ విషయమై దుబాయ్‌లో జరుగుతున్న ఐసీసీ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో బీసీసీఐ, పీసీబీ ఛైర్మన్ మొహిసిన్ నఖ్వీ మధ్య సానుకూలంగా చర్చలు జరిగాయి. త్వరలోనే ట్రోఫీ మనకు అందుతుందన్న విశ్వాసం ఉందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించాడు. 'అజెండాలో లేనప్పటికీ సీనియర్ ఐసీసీ అధికారుల సమక్షంలో నేను, నఖ్వీ భేటీ అయ్యాం. ఇక ఈ విషయమై ప్రతిష్టంభన తొలగినట్టే' అని సైకియా తెలిపాడు. సెప్టెంబరు 28న ఆసియాకప్ ఫైనల్లో గెలిచిన భారత్ ఏసీసీ చీఫ్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు నిరాకరించింది. దీంతో నఖ్వీ కప్‌ను తీసుకెళ్లి తన కార్యాలయంలో భద్రపరిచాడు.

ఆఖరిది వరుణుడి ఖాతాలోకి



- ఆసీస్‌తో ఐదో టీ20 రద్దు
- 2-1తో భారత్‌దే సిరీస్

బ్రిస్బేన్: ఐదు టీ20ల సిరీస్‌లో చివరి మ్యాచ్.. హ్యాట్రిక్ విజయంతో సిరీస్‌ను పట్టేయాలని భారత్ బరిలోకి దిగితే.. ఎలాగైనా సమం చేయాలనే కసితో ఆస్ట్రేలియా పోటీ పడింది. దీంతో ప్రఖ్యాత గాబా మైదానంలో ఎవరిది ఆధిపత్యమో తెలుసుకునేందుకు అభిమానులు కూడా ఎనలేని ఆసక్తి ప్రదర్శించారు. కానీ ఆట ఆరంభమై ఐదు ఓవర్లు కూడా పూర్తి కాకుండానే ఫ్యాన్స్ ఉత్సాహంపై వరుణుడు నీళ్లుజల్లాడు. సిరీస్‌లో తొలి మ్యాచ్ తరహాలోనే శనివారం జరిగిన ఐదో టీ20 కూడా వర్షంతో రద్దయ్యింది. కేవలం 29 బంతుల ఆటే సాధ్యమైంది. అయితే ఇప్పటికే 2-1తో ఆధిక్యంలో ఉండడంతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌ను కైవసం చేసుకుంది. తద్వారా ఆస్ట్రేలియా గడ్డపై ఈ ఫార్మాట్‌లో టీమిండియా తన అజేయ ఆటతీరును కొనసాగించింది.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత ఇన్నింగ్స్ ధాటిగా సాగింది. ఓపెనర్లు గిల్ (16 బంతుల్లో 6 ఫోర్లతో 29 నాటౌట్), అభిషేక్ శర్మ (13 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 23 నాటౌట్) ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగారు. తొలి ఓవర్‌లో చెరో ఫోర్ బాదగా.. అభిషేక్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను మ్యాక్స్‌వెల్ వదిలేశాడు. ఇక మూడో ఓవర్‌లో గిల్ 4 ఫోర్లతో చెలరేగి 16 రన్స్ అందించాడు. తర్వాతి ఓవర్‌లోనే అభిషేక్ ఫైన్ లెగ్‌లో ఇచ్చిన మరో క్యాచ్‌ను ద్వార్షుస్ వదిలేశాడు. అయితే భారత్ 4.5 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 52 పరుగులతో నిలిచిన దశలో.. తీవ్రమైన ఉరుములు, మెరుపులు రావడంతో ఆటగాళ్లంతా మైదానం వీడారు. ఆ తర్వాత చిరుజల్లులు మొదలై భారీ వర్షం కురవడంతో మైదానం చిత్తడిగా మారింది. దాదాపు రెండున్నర గంటలు వేచి చూసినా ఫలితం లేకపోయింది. అప్పటికే ఆసీస్‌లో సమయం రాత్రి 9 కావడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా అభిషేక్ నిలిచాడు.

1 తక్కువ బంతుల్లోనే (528) టీ20ల్లో వెయ్యి పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా అభిషేక్. సూర్యకుమార్ (573)ను అధిగమించాడు.

2 తక్కువ ఇన్నింగ్స్ (28)లో టీ20ల్లో వెయ్యి పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా అభిషేక్. విరాట్ (27) ముందున్నాడు.



అభిషేక్

స్కోరుబోర్డు

భారత్: అభిషేక్ (నాటౌట్) 23, గిల్ (నాటౌట్) 29; **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం:** 4.5 ఓవర్లలో 52/0. **బౌలింగ్:** ద్వార్షుస్ 2-0-27-0, బార్ట్‌లెట్ 1.5-0-13-0, ఎలిస్ 1-0-12-0.

గుకేష్‌కు షాక్

మూడో రౌండ్‌లో నిష్క్రమణ
వరల్డ్ కప్ చెస్

పనాజీ: ప్రపంచ కప్ చెస్‌లో పెను సంచలనం చోటు చేసుకుంది. వరల్డ్ చాంపియన్ గుకేష్‌కు మూడో రౌండ్‌లో చుక్కెదురైంది. జర్మన్ గ్రాండ్‌మాస్టర్ ఫ్రెడరిక్ స్వాన్ టాప్‌సీడ్ గుకేష్‌కు షాకిచ్చాడు. శనివారం జరిగిన రెండో క్లాసికల్ గేమ్‌లో తెల్లపావులతో బరిలో దిగినా గ్రాండ్‌మాస్టర్ గుకేష్ 55 ఎత్తుల్లో పరాజయం చవిచూడడం గమనార్హం. ఇద్దరి మధ్య జరిగిన తొలి గేమ్ డ్రా అయిన సంగతి తెలిసిందే. రెండో గేమ్ నెగ్గిన స్వాన్ 1.5-0.5 స్కోరుతో గుకేష్‌ని ఓడించి ముందంజ వేశాడు. భారత గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద, పెంటేల హరికృష్ణ, వి.ప్రణవ్ కూడా రౌండ్-32కి చేరారు. కార్తీక్ వెంకటరామన్-బొగ్దాన్ డానియల్ (రుమేనియా) మూడో రౌండ్ రెండో గేమ్‌కూడా డ్రా అయ్యింది. దాంతో ఇద్దరూ చెరో పాయింట్‌తో నిలవడంతో పోరు టైబ్రేక్‌కు మళ్లింది.

లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో భారత్ X పాక్ పోరు లేనట్టేనా?

దుబాయ్: చాలా దశాబ్దాల తర్వాత.. చెప్పాలంటే 128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం చేస్తోంది. 2028 లాస్‌ఏంజిల్స్ విశ్వక్రీడల్లో క్రికెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. టీ20 ఫార్మాట్‌లో నిర్వహించే పోటీల్లో పురుషులు, మహిళల క్రికెట్ జట్లు బరిలో దిగనున్నాయి. అయితే ప్రపంచంలో ఎక్కడ టోర్నీ జరిగినా ఫ్యాన్స్ అంతా ఆసక్తిగా చూసేది భారత్-పాకిస్థాన్ పోరు కోసమే. అలాగే ఒలింపిక్స్‌లోనూ ఈ రెండు జట్లు పరస్పరం తలపడతాయా? అనే ఆసక్తి అభిమానుల్లో ఏర్పడింది. కానీ విశ్వక్రీడల్లో భారత్, పాకిస్థాన్ జట్లు ముఖాముఖి ఢీకొనే అవకాశాలు కనిపించడం లేదు. అసలు పాక్ జట్టుకు 'లాస్‌ఏంజిల్స్'లో చోటు దక్కడమే గగనంగా మారింది. ఇందుకు ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు సంబంధించి ఐసీసీ రూపొందించిన నిబంధనలే. పురుషులు, మహిళల విభాగాలలో ఆరేసి జట్లకే ఐసీసీ చోటు కల్పించింది. ఈ జట్లను ర్యాంకుల ఆధారంగా ఎంపిక చేయాలని ఐసీసీ తొలుత భావించింది. కానీ ఒక్కో ఖండం/ప్రాంతం నుంచి ఒక్కో అత్యుత్తమ జట్టును ఎంపిక చేసి..ఆరో జట్టును క్వాలిఫయింగ్ రౌండ్ ద్వారా తీసుకోవాలని ఐసీసీ తాజాగా నిర్ణయించినట్టు సమాచారం. ఆ ప్రకారం చూస్తే..ఆసియా ఖండం నుంచి ఒక్క జట్టే విశ్వక్రీడల్లో అడుగుపెట్టనుంది. ప్రస్తుతం టీ20లలో టాప్ ర్యాంక్‌లో ఉన్న టీమిండియా ఆసియా నుంచి ఒలింపిక్స్‌కు క్వాలిఫై కానుంది. ఓషియానా నుంచి ఆస్ట్రేలియా, యూరప్ నుంచి ఇంగ్లండ్, ఆఫ్రికా నుంచి దక్షిణాఫ్రికాలకు చోటు లభించనుంది. కారణం ఆయా ప్రాంతాలనుంచి ఈ మూడు జట్లు టాప్‌లో ఉండడమే. ఇక ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిస్తున్నందున అమెరికాకూ చోటు దక్కనుంది. మిగిలిన ఒక్క జట్టును గ్లోబల్ క్వాలిఫయర్స్ టోర్నీ ద్వారా ఎంపిక చేస్తారు. కానీ ఈ క్వాలిఫయర్స్‌లో మేటి జట్లు తలపడనున్న నేపథ్యంలో.. ఇందులో విజేతగా నిలిచి పాక్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తుందా? చూడాలి.



భారత 91వ గ్రాండ్‌మాస్టర్.. రాహుల్

న్యూఢిల్లీ: భారత చెస్ ఆటగాడు రాహుల్ వీఎస్ గ్రాండ్‌మాస్టర్ (జీఎం) హోదా సాధించాడు. ఫిలిప్పీన్స్‌లో జరిగిన ఏషియన్ చెస్ వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లో తమిళనాడుకు చెందిన 21 ఏళ్ల రాహుల్ విజేతగా నిలిచాడు. దీంతో జీఎంకు అవసరమైన చివరి నార్మ్‌ను రాహుల్ అందుకున్నాడు. రాహుల్.. భారత్ తరఫున 91వ గ్రాండ్‌మాస్టరయ్యాడు.

హైదరాబాద్ 295/7

రాజస్థాన్‌తో రంజీ మ్యాచ్

హైదరాబాద్: రాజస్థాన్‌తో జరుగుతున్న రంజీ ఎలీట్ గ్రూప్ 'డి' మ్యాచ్‌లో రాహుల్ రాదేష్ (85 బ్యాటింగ్), కెప్టెన్ రాహుల్ సింగ్ (55) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. దీంతో శనివారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 89 ఓవర్లలో 295/7 స్కోరుతో నిలిచింది. రోహిత్ రాయుడు (47), హిమతేజ (39) పర్వాలేదనిపించారు. అంకిత్, అశోక్ శర్మలకు రెండేసి వికెట్లు దక్కాయి. క్రీజులో రాదేష్‌తో పాటు తనయ్ (5) ఉన్నాడు. ఇక, విశాఖపట్నంలో తమిళనాడుతో మొదలైన రంజీ పోరులో మొదటి రోజు ఆట ముగిసేసరికి ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 20/1 స్కోరు చేసింది. అంతకుముందు ఆంధ్ర బౌలర్లు పృథ్వీరాజ్ (4/46), సౌరభ్ (2/4) విజృంభించడంతో తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 182 పరుగులకే కుప్పకూలింది.

గంగూలీని ఆపలేరు..



భవిష్యత్‌లో అతడు ఐసీసీ అధ్యక్షుడు అవుతాడు
బెంగాల్ సీఎం మమత

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి భారత జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి మద్దతుగా నిలిచారు. ఈక్రమంలో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. దాదా ఐసీసీ అధ్యక్షుడు కాకుండా ఎవరూ ఆపలేరని స్పష్టంజేశారు. అసలు సౌరవ్ ఈ పాటికే ఐసీసీ చీఫ్ కావాల్సి ఉందన్నారు. వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టు సభ్యురాలు రిచా ఘోష్‌ను బెంగాల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ సన్మానించారు. ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మమత మాట్లాడుతూ.. 'అసలు ఈ రోజు ఐసీసీ చీఫ్‌గా ఉండాల్సింది ఎవరు? అతడు గంగూలీ తప్ప మరొకరు కాదు. అతడు ఇప్పుడు అధ్యక్షుడు కాకపోయి ఉండొచ్చు. కానీ ఏదో ఒకరోజు దాదా ఆ పదవి తప్పకుండా చేపడతాడు. అప్పుడు అతడిని ఆపడం ఎవరి తరమూ కాదు' అని వ్యాఖ్యానించారు.

జురెల్ మరో శతకం

భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్ 382/7 డిక్లేర్

బెంగళూరు: భారత్ 'ఎ' వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ అద్భుత ఫామ్‌తో దూసుకెళుతున్నాడు. దక్షిణాఫ్రికా 'ఎ'తో రెండో అనధికార టెస్టులో అతను వరుసగా రెండో శతకం (127 నాటౌట్) బాదాడు. దీంతో.. ఓవర్‌నైట్ స్కోరు 78/3తో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'ఎ' 382/7 స్కోరు చేసి డిక్లేర్ చేసింది. హర్ష్ దూబే (84), కెప్టెన్ రిషభ్ పంత్ (65) అర్ధసెంచరీలు సాధించారు. మొదట 17 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన పంత్.. దూబే అవుటయ్యాక తిరిగి క్రీజులోకి వచ్చి తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. దీంతో అతడి గాయంపై జట్టుకు ఆందోళన పడాల్సిన అవసరం లేకపోయింది. ఇక, తొలి ఇన్నింగ్స్‌లోనూ జురెల్ అజేయ శతకంతో నిలిచిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 417 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా మూడోరోజు ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 25/0 స్కోరు చేసింది. ఆటకు ఆదివారమే చివరిరోజు కాగా.. సఫారీలు 392 రన్స్ వెనుకంజలో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 'ఎ' 255, సఫారీ జట్టు 221 రన్స్ చేశాయి.

రవిందర్ గోల్డెన్ షూట్

- ఎలవెనిల్‌కు కాంస్యం

షూటింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్



కైరో: ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో శనివారం భారత షూటర్లు పతకాలతో సత్తా చాటారు. భారత ఆర్మీలో నాయక్ సుబేదార్‌గా పనిచేస్తున్న 29 ఏళ్ల రవీందర్ సింగ్ 50 మీటర్ల వ్యక్తిగత పిస్టల్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించాడు. ఇక, 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో కమల్జీత్, యోగేశ్వర్, రవీందర్‌లతో కూడిన భారత జట్టు రజతం నెగ్గింది. దీంతో రవీందర్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. ఇక, వ్యక్తిగత 10 మీటర్ల రైఫిల్ ఈవెంట్‌లో భారత షూటర్ ఎలవెనిల్ వలరివన్ కాంస్యం దక్కించుకుంది. ఇదే 10 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో ఎలవెనిల్, మేఘన, శ్రేయాలతో కూడిన భారత త్రయం కాంస్యం అందుకుంది.

బ్యాడ్మింటన్‌కు తైజు గుడ్‌బై



15 ఏళ్ల కెరీర్‌లో 17 టైటిళ్లు
సింధుతో మరపురాని మ్యాచ్‌లెన్నో..

న్యూఢిల్లీ: తైపీకి చెందిన ప్రఖ్యాత షట్లర్ తైజు యింగ్ బ్యాడ్మింటన్‌కు గుడ్‌బై చెప్పింది. తిరగబెడుతున్న గాయాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్టు 31 ఏళ్ల ప్రపంచ మాజీ నెంబర్ వన్ తైజు శనివారం వెల్లడించింది. టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత అయిన తైజు.. తన 15 ఏళ్ల కెరీర్‌లో 17 బీడబ్ల్యూఎఫ్ టైటిళ్లు సొంతం చేసుకుంది. మరో 12 ఈవెంట్లలో రన్నరప్‌గా నిలిచింది. 2024లో ఇండియా ఓపెన్‌తో చివరి బీడబ్ల్యూఎఫ్ టైటిల్ అందుకుంది.

నా పయనంలో నిన్ను కోల్పోతున్నా: సింధు

సమకాలీన బ్యాడ్మింటన్‌లో భారత స్టార్ పీవీ సింధు, తైజు చిరకాల ప్రత్యర్థులు. వీరిద్దరి మ్యాచ్ అంటే బ్యాడ్మింటన్ ప్రియులకు పసందైన విందు. ఆఖరి ర్యాలీ వరకూ ఉత్కంఠగా సాగిన వీరి మ్యాచ్‌లు ఫ్యాన్స్‌ను మునివేళ్లపై నిలబెట్టాయి. అలాంటి తైజు ఆటకు వీడ్కోలు పలకడంతో సింధు భావోద్వేగానికి లోనైంది. '15 ఏళ్లుగా నీతో తలపడిన ప్రతి మ్యాచ్ మరపురానిదే. ఆ మ్యాచ్‌ల నుంచి ఓ అథ్లెట్‌గా ఎంతో మెరుగయ్యా' అని సింధు సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

మృతదేహానికి రక్తప్రసారం పునరుద్ధరణ!

- అవయవదానం కోసం ఢిల్లీలోని మణిపాల్ వైద్యుల అరుదైన ప్రక్రియ
- ఒక మహిళ చనిపోయిన తర్వాత కాలేయం, కిడ్నీ సేకరించిన డాక్టర్లు



న్యూఢిల్లీ, నవంబరు 8:. సాధారణంగా బ్రెయిన్‌డెడ్ అయినవారి నుంచి మాత్రమే అవయవాలను సేకరిస్తారు! అంటే.. మెదడు మాత్రమే పనిచేయడం ఆగిపోయి, మిగతా అవయవాలన్నీ యథావిధిగా పనిచేసేవారి నుంచే తీసుకుంటారు!! సహజమరణం పొందినవారి నుంచి అవయవాలను సేకరించరు. కానీ.. దేశంలో తొలిసారిగా సహజంగా చనిపోయిన ఒక మహిళ నుంచి అవయవాలను ఢిల్లీలోని మణిపాల్ వైద్యులు సేకరించారు. అందుకు వారు ఓ అరుదైన వైద్య ప్రక్రియ చేపట్టారు!! ఆమె సహజంగా కన్నుమూయగానే.. ఆమె శరీరంలోని అవయవాలు నిరుపయోగంగా మారకుండా పొత్తికడుపు భాగంలో రక్తప్రవాహాన్ని కృత్రిమంగా పునరుద్ధరించారు! అనంతరం ఆమె కాలేయం, మూత్రపిండాలను సేకరించారు. ఈ ప్రక్రియను 'నార్మోథెర్మిక్ రీజనల్ పర్ఫ్యూజన్' అంటారు. ఇందులో భాగంగా.. సేకరించదలచుకున్న అవయవాలున్న ప్రాంతంలో పంప్ ద్వారా రక్తాన్ని పంపుతారు. దాంతో సదరు అవయవాల పనితీరు దెబ్బతినకుండా వెలికితీసి ఇతరులకు అమర్చవచ్చు. ఈ ప్రక్రియ ప్రపంచమంతా రెండు దశాబ్దాలుగా జరుగుతున్నప్పటికీ భారతదేశంలో ఇలా చేయడం ఇదే ప్రథమం. మోటార్ న్యూరాన్ డిసీజ్ కారణంగా చాలా ఏళ్లుగా మంచానికే పరిమితం అయిన 55 ఏళ్ల గీతాచావ్లా అవయవ దానానికి సిద్ధం అయ్యారు. భారతదేశ చట్టాల ప్రకారం బ్రెయిన్ డెడ్ అయ్యి, గుండె కొట్టుకుంటుంటే మాత్రమే కుటుంబ సభ్యులు అవయవదానం చేయవచ్చు. గీతాచావ్లా విషయంలో.. ఊపిరితిత్తుల సమస్యతో ఆసుపత్రికి వచ్చిన ఆమె నవంబరు 6వ తేదీ రాత్రి 8.43 గంటలకు సహజంగా గుండె ఆగి మరణించారు. ఐదు నిమిషాల తర్వాత.. వైద్యులు పంప్ ద్వారా ఆమె కాలేయం, మూత్రపిండాలకు రక్త ప్రసారాన్ని పునరుద్ధరించి, వాటిని వెలికితీసి అవసరమైన వారికి అమర్చారు. మరణించిన తర్వాత ఐదు నిమిషాలు వేచి ఉండటం ద్వారా.. చట్టపరమైన సమస్యను అధిగమించారు.

డిసెంబరు 1నుంచి పార్లమెంటు సమావేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 8: పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబరు 1 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నాయి. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ఈ విషయాన్ని శనివారం ప్రకటించారు. మూడు వారాల పాటు జరగనున్న ఈ సెషన్‌లో ఉభయ సభలు 15రోజులు మాత్రమే సమావేశం(సిట్టింగ్స్) కానున్నాయి. దీనిపై విపక్షాలు విమర్శలు వ్యక్తం చేశాయి. పార్లమెంటు సమావేశాలను ఆలస్యంగా నిర్వహించడమే కాకుండా, వ్యవధిని కుదించడంలో కేంద్రప్రభుత్వం ఉద్దేశం ఏంటని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఎన్నికల సంఘం 12 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) చేపట్టిన నేపథ్యంలో ఈ సమావేశాలు జరగనుండటం ప్రాధాన్యం సంతరించుకొంది. బిహార్‌లో ఎస్ఐఆర్ జరిగిన సమయంలో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జరిగాయి. అప్పుడు ఈ ఎస్ఐఆర్ అంశం సమావేశాలను స్తంభింపజేసిన సంగతి తెలిసిందే.

టీఎంసీ ఎంపీ ఖాతా నుంచి రూ.57 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

కోల్‌కతా, నవంబరు 8: తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ కల్యాణ్ బెనర్జీ బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.57 లక్షలను మాయం చేశారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కోల్‌కతాలోని ఎస్‌బీఐ విధానసభ బ్రాంచీలో ఖాతాను తెరిచారు. ఎమ్మెల్యే జీతం ఆ ఖాతాలో జమ అయ్యేది. ఆయన లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైన తర్వాత కొన్ని సంవత్సరాలుగా ఆ ఖాతా ఉపయోగంలో లేదు. దీంతో ఆ ఖాతాపై కన్నేసిన సైబర్ నేరగాళ్లు కేవైసీ ఫోర్జరీ చేసి, ఖాతాను మళ్లీ ఉపయోగంలోకి తెచ్చారు. అందులోని మొత్తాన్ని ఇతర ఖాతాల్లోకి బదిలీ చేయడంతో పాటు నగల కొనుగోళ్లకు ఉపయోగించారు. నేరగాళ్లు నకిలీ ఆధార్ కార్డు, పాన్ కార్డులను ఉపయోగించి తన ఖాతాను పునరుద్ధరించారని, ఒక మొబైల్ నెంబర్‌ను జతచేసి దాని ద్వారా ఓటీపీలు, లావాదేవీలపై నియంత్రణ పొందారని కల్యాణ్ బెనర్జీ వెల్లడించారు. తమ బ్యాంకు అంతర్గత లోపం కారణంగానే ఈ మోసం జరిగిందని పేర్కొంటూ ఎస్‌బీఐ ఆ మొత్తాన్ని తిరిగి తన పార్లమెంట్ ఖాతాలో జమ చేసిందన్నారు.

పాక్ అణు కేంద్రంపై దాడికి ఇందిర ఒప్పుకోలేదు

- సీఐఏ మాజీ అధికారి బార్లో వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబరు 8: అమెరికా కేంద్ర నిఘా సంస్థ (సీఐఏ) మాజీ అధికారి రిచర్డ్ బార్లో సంచలన వ్యాఖ్యలు చేశారు. 1980వ దశకంలో పాకిస్థాన్‌లోని కహుతా అణు కేంద్రంపై భారత్, ఇజ్రాయెల్ సంయుక్త ఆపరేషన్ ప్రతిపాదనను నాటి ప్రధాని ఇందిర అంగీకరించలేదని పేర్కొన్నారు. ఈ నిర్ణయం సిగ్గుచేటు అని అన్నారు. అదే ఆ మిషన్ జరిగి ఉంటే.. అనేక ఎన్నో సమస్యలకు పరిష్కారం లభించేదని ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ బార్లో వ్యాఖ్యానించారు. 1982, 1985 మధ్య తాను అమెరికా ప్రభుత్వ సేవలకు దూరంగా ఉన్న సమయంలో ఈ ప్రణాళిక గురించి విన్నట్లు ఆయన చెప్పారు. పాకిస్థాన్ తన అణు కార్యక్రమంలో అమెరికా జోక్యం చేసుకోకుండా ఉండేందుకు, అఫ్ఘానిస్థాన్‌లో తన సహకారాన్ని ఉపయోగించుకుందని బార్లో పేర్కొన్నారు.

చంద్రయాన్-2 డేటాతో ఇస్రో పోలార్ మ్యాప్

సూళ్లూరుపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండ్ కావడంలో చంద్రయాన్-2 విఫలమైనా.. ఆ ఆర్బిటర్ కీలక సమాచారాన్ని మాత్రం భూమిపైకి పంపుతూనే ఉంది. ఈ సమాచారం ఆధారంగా ఇస్రో కీలక విషయాలను వెల్లడించింది. తొలి పోలార్ మ్యాప్‌ను తాజాగా విడుదల చేసింది. చంద్రయాన్-2 ఆర్బిటల్ తన డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపెర్చర్ రాడార్ డేటాను ఉపయోగించి చంద్రుడి తొలి పోలార్ మెట్రిక్, ఎల్-బ్యాండ్ రాడార్ మ్యాప్‌లను రూపొందించింది. చంద్రుడి ఉపరితలం, ఉపరితలం కింద నిర్మాణాలను గుర్తించడానికి ఈ మ్యాప్‌లు శాస్త్రవేత్తలకు ఉపయోగపడనున్నాయి. మరీ ముఖ్యంగా జాబిల్లిపై ఉండే వనరులను వినియోగించడాన్ని, అదే సమయంలో చంద్రుడిపై ల్యాండింగ్ ప్రదేశాన్ని ఎంపిక చేయడానికి డేటా ఉపకరిస్తుంది.

పిల్లలకు వారు తుపాకులిస్తే..

మేం ల్యాప్‌టాప్‌లు ఇస్తున్నాం!

(మొదటిపేజీ తరువాయి)

సభల్లో ప్రధాని మాట్లాడుతూ.. "వారు(విపక్ష పార్టీలు) పిల్లలకు తుపాకులు ఇస్తే.. మేం ల్యాప్‌టాప్‌లు ఇస్తున్నాం. వారే కనుక అధికారంలోకి వస్తే.. మీ తలలపై తుపాకులు ఎక్కుపెట్టి చేతులు పైకెత్తమంటారు." అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. అంతేకాదు, రాష్ట్రంలోని యువతను విపక్ష పార్టీలు పోకిరీలుగా మారుస్తున్నారని విమర్శలు గుప్పించారు. "ఇక్కడి కొందరు వ్యక్తులు తమ పిల్లలను ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా చూడాలని భావిస్తున్నారు. కానీ, ఇదే సమయంలో మీ(ప్రజలు) పిల్లలను మాత్రం గూండాలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, బిహార్ ప్రజలు దీనిని ఎప్పటికీ సహించరు" అని ప్రధాని వ్యాఖ్యానించారు. ప్రధానంగా ఆర్జేడీని లక్ష్యంగా చేసుకుని మోదీ విరుచుకుపడ్డారు. "ఎన్నికల ప్రచారంలో ఆర్జేడీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు.. ప్రచార గీతాలు వింటే మీరు వణికిపోతారు. బిహార్ యువతను ఆర్జేడీ ఏం చేయాలని అనుకుంటోందో ఈ ప్రచారాలే స్పష్టం చేస్తున్నాయి. అమాయక చిన్నారులను వేదికలెక్కించి.. వారితో గ్యాంగ్‌స్టర్లుగా మారుతామని చెప్పిస్తున్నారు. ఇదీ.. ఆర్జేడీ విధానం" అని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా ఆర్జేడీ అభ్యర్థి నిర్వహించిన ప్రచార సభలో పదేళ్ల బాలుడు చేసిన 'తుపాకులు, దోపిడీ' వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. బిహార్‌లో నేడు తుపాకులు ఎక్కుపెట్టే సంస్కృతి లేదన్న ప్రధాని.. యువత స్టార్టప్స్ కలలను సాకారం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ క్రమంలో ఆయన 'మాకు తుపాకులు పట్టుకునే సర్కారు వద్దు-మరోసారి ఎన్డీయే సర్కారే ముద్దు' అనే నినాదం ఇచ్చారు.

వారికి నిద్రలేకుండా చేశారు!

ఈ నెల 6న జరిగిన తొలిదశ పోలింగ్‌లో 65.08 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ విషయాన్ని ప్రస్తావించిన ప్రధాని మోదీ.. 65 వోల్టుల శక్తితో విపక్షాలకు భారీ షాక్ ఇచ్చారని వ్యాఖ్యానించారు. "విపక్షాలను చావుదెబ్బ కొట్టారు. వారికి 65 వోల్టుల శక్తితో భారీషాకిచ్చారు. నిద్ర లేకుండా చేశారు. ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు" అని వ్యాఖ్యానించారు. మహిళల అభ్యున్నతికి తానే బ్రాండ్ అంబాసిడర్‌నని మోదీ అభివర్ణించారు. కొంతమంది 'మునగడం ఎలా' అనే విషయంపై సాధన చేస్తున్నారు.. అంటూ ఇటీవల మత్స్యకారులతో కలిసి రాహుల్‌గాంధీ చెరువులో మునిగిన చేపలు పట్టిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఎద్దేవా చేశారు.



వారాణసీలో ప్రారంభించిన వందే భారత్ రైల్లో విద్యార్థులతో మోదీ

వారిని ఓటుతో శిక్షించండి!

"బిహార్ మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే ఛట్ ఉత్సవాన్ని డ్రామా, నకిలీ అని వ్యాఖ్యానించి ఇక్కడి వారిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అవమానించింది. ఇది మన సెంటిమెంటును అవమానించడం కాదా?. అలాంటివారిని శిక్షించ కూడదా?. అలా శిక్షించాలంటే ప్రజాస్వామ్యంలో మీకున్న మార్గం, శక్తి ఓటే. ఆ ఓటుతోనే వారిని శిక్షించండి." అని మోదీ పిలుపునిచ్చారు. వారి ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా చొరబాటు దారులు కూడా రక్షణ పొందుతున్నారని దుయ్యబట్టారు. రెండో దశ ఎన్నికల్లో ప్రతి బూత్‌లోనూ గత ఎన్నికలకంటే కూడా 100 ఓట్లు ఎక్కువ పడేలా ప్రజలు, కార్యకర్తలు వ్యవహరించాలని ఆయన అభ్యర్థించారు.

160 సీట్లతో ఎన్డీయేకు అధికారం: అమిత్ షా

బిహార్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దుకాణం మూత పడనుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి స్వీప్ చేస్తుందని, 160కి పైగా సీట్లతో మళ్లీ అధికారంలోకి రాబోతోందని తెలిపారు. శనివారం పూర్ణియా, కతిహార్, సుపాల్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో అమిత్ షా మాట్లాడారు. రాహుల్‌గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వియాదవ్ కలిసి బిహార్‌లోని సీమాంచల్ ప్రాంతాన్ని చొరబాటు దారుల అడ్డాగా మార్చారని ఆరోపించారు. సోనియా గాంధీకి, లాలూప్రసాద్ యాదవ్ తమ కుమారుల గురించి బాధపడుతున్నారని, కానీ.. బిహార్‌లో, ఢిల్లీలో కుర్చీలు ఖాళీగా లేవని అమిత్ షా ఎద్దేవా చేశారు. అయితే అమిత్ షా వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు. ఏళ్ల తరబడి కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే.. చొరబాట్లను ఎందుకు అరికట్టలేదని ప్రశ్నించారు.

4 వందేభారత్ రైళ్లను ప్రారంభించిన మోదీ

వారాణసీ/లక్నో, నవంబరు 8: అభివృద్ధి దిశగా దేశం దూసుకుపోతోందని ప్రధాని మోదీ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని వారాణసీలోని బనారస్ రైల్వే స్టేషన్‌లో శనివారం నాలుగు కొత్త వందే భారత్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైళ్లు బనారస్-ఖజురహో, లఖ్‌నవు-సహరాన్‌పూర్, ఫిరోజ్‌పూర్-ఢిల్లీ, ఎర్నాకుళం-బెంగళూరు మధ్య నడవనున్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. వందేభారత్, నమోభారత్, అమృత్ భారత్ వంటి రైళ్లలో భారత రైల్వేలో నూతన తరానికి పునాదులు పడ్డాయన్నారు. మౌలిక సదుపాయాల కల్పన అంటే.. కేవలం భారీ ప్రాజెక్టుల నిర్మాణమే కాదని.. వాటి ద్వారా జరిగే పనులు కూడా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తాయని తెలిపారు.

లోకం తీరు



బిహార్‌లో రోడ్డు పక్కన వీవీప్యాట్ స్లిప్పులు

సమస్తీపూర్, నవంబరు 8: బిహార్‌లోని సమస్తీపూర్ జిల్లాలో రోడ్డు పక్కన అధిక సంఖ్యలో వీవీప్యాట్ స్లిప్పులు చెల్లాచెదురుగా పడి ఉండడం కలకలం రేపింది. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన ఎన్నికల సంఘం.. ఓ సహాయ రిటర్నింగ్ అధికారిని (ఏఆర్‌వో) సస్పెండ్ చేయడంతో పాటు ఆయనపై కేసు నమోదు చేసింది. సరైరంజన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓ కళాశాల సమీపంలో లభించిన ఈ స్లిప్పులు మాక్‌పోల్‌కు సంబంధించినవని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. వాస్తవ పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన స్లిప్పులు సురక్షితంగా ఉన్నాయని, ఈ ఘటన వల్ల ఎన్నికల పవిత్రతకు ఎటువంటి భంగం వాటిల్లలేదని ఆయన తేల్చి చెప్పారు. రోడ్డు పక్కన వీవీప్యాట్ స్లిప్పులు చెల్లాచెదురుగా పడి ఉన్న వీడియో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈవీఎమ్‌లు, వీవీప్యాట్‌ల పనితీరురును పరీక్షించడానికి, ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి ప్రతి పోలింగ్ బూత్‌లో మాక్ పోల్స్ నిర్వహిస్తారు. మాక్ పోలింగ్ పూర్తయ్యాక, వీవీప్యాట్ స్లిప్పులను ప్రత్యేక కవర్లో సీలు చేసి సురక్షితంగా దాచాల్సి ఉంటుంది. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు గాను సంబంధిత అధికారిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంది.



న్యూస్ పేపర్లలో భోజనం చేస్తున్న పిల్లలు

న్యూస్ పేపర్‌లో పిల్లలకు మధ్యాహ్న భోజనం!

- మధ్యప్రదేశ్‌లోని ఓ బడిలో ఘటన
- నా హృదయం ముక్కలైంది: రాహుల్

న్యూఢిల్లీ, నవంబరు 8: మధ్యప్రదేశ్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు న్యూస్ పేపర్ ముక్కల్లో మధ్యాహ్న భోజనం తింటున్న ఓ వీడియోను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్‌లో షేర్ చేశారు. షియోపూర్ జిల్లా హల్పూర్ గ్రామంలోని ఓ మాధ్యమిక పాఠశాలలో ఈ ఘటన వెలుగుచూసింది. బడి కాంపౌండ్‌లో చెత్తాచెదారం మధ్య పిల్లలు వరుసగా కూర్చొని న్యూస్ పేపర్ ముక్కల్లో ఉన్న ఆహారాన్ని తింటున్నట్లుగా ఆ వీడియోలో ఉంది. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వీడియోలోని దృశ్యాలను చూసి తన హృదయం ముక్కలైందని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు అయిన ఏ పాపం ఎరుగని చిన్నారులకు కనీసం ప్లేట్లలో భోజనం చేసే గౌరవం కూడా దక్కకూడదా? అంటూ రాహుల్ హిందీలో ట్వీట్ చేశారు. మధ్యప్రదేశ్‌ను 20 ఏళ్లకు పైగా ఏలుతున్న బీజేపీ.. చిన్నారుల కంచాలను కూడా దొంగిలించిందని ఆరోపించారు. ఇలా చిన్నారుల భవిష్యత్తును నిర్దాక్షిణ్యంగా చిదిమేస్తున్నందుకు మధ్యప్రదేశ్ సీఎం, ప్రధాని మోదీ సిగ్గుపడాలి అని రాహుల్ మండిపడ్డారు. పీఎం పోషణ్ పథకం కింద ఓ స్వయం సహాయక బృందానికి హల్పూర్ పాఠశాలలో పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డించే కాంట్రాక్టును అప్పగించారు. తాజా వీడియో నేపథ్యంలో జిల్లా కలెక్టర్, సదరు స్వయం సహాయక బృందాన్ని ఆ బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు ప్రకటించారు. కాగా, మధ్యప్రదేశ్ ప్రభుత్వ అధికారులు శనివారం ఈ పాఠశాలకు స్టీల్ ప్లేట్లను పంపించారు.

మహారాష్ట్ర మంత్రుల మెడకు
భూ కొనుగోళ్ల ఉచ్చు

(మొదటి పేజీ తరువాయి)



పార్థ పవార్

పవార్ 40 ఎకరాలు కొనుగోలు చేయడం వివాదాస్పదమయింది. విమర్శల నేపథ్యంలో సేల్ డీడ్‌ను రద్దు చేసుకున్నప్పటికీ 'డబుల్ స్టాంప్ డ్యూటీ' కింద ప్రభుత్వానికి రూ.42 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సేల్ డీడ్‌ను రద్దు చేసుకున్నట్టు 'క్యాన్సిలేషన్ డీడ్'ను రాసుకుంటే ప్రభుత్వానికి రెట్టింపు స్టాంప్ డ్యూటీ చెల్లించాలన్న నిబంధన ఉండడంతో ఇంత భారీ మొత్తం చెల్లించాల్సి వస్తోంది. పార్థ పవార్ తన సమీప బంధువు దిగ్విజయ్ పాటిల్‌తో కలిసి ఏర్పాటు చేసిన అమదియా ఎంటర్‌ప్రైజెస్ తరఫున డాటా సెంటర్ నెలకొల్పడానికి పుణెలోని ముంధ్వా ప్రాంతంలో 40 ఎకరాలు కొనుగోలు చేశారు. ఆ స్థలానికి యజమానులైన 272 మంది శీతల్ తేజస్విని అనే మహిళకు పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వడంతో ఆమెతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ సేల్ డీడ్‌ను సబ్ రిజిస్ట్రార్ ఆర్.బి. తరు రిజిస్టర్ చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని, రూ.1,800 కోట్లు విలువ చేసే భూమిని రూ.300 కోట్లకే కొనుగోలు చేశారంటూ ఆరోపణలు వచ్చాయి. పరిస్థితిని గమనించిన అజిత్ పవార్ అది ప్రభుత్వ భూమి అని తన కుమారుడికి తెలియదని శుక్రవారం చెప్పారు. సేల్ డీడ్‌ను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. డాటా సెంటర్ కోసం భూమి కొనుగోలు చేస్తున్నామని చెప్పడంతో సబ్ రిజిస్ట్రార్ పన్ను వసూలు చేయలేదు. వాస్తవానికయితే 7 శాతం పన్ను (5 శాతం స్టాంప్ డ్యూటీ, ఒక శాతం స్థానిక సంస్థల పన్ను, ఒక శాతం మెట్రో సెస్) వసూలు చేయాల్సి ఉంది. ఆ లెక్కన రూ.21 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.500 మాత్రమే చెల్లించడం గమనార్హం. ఇప్పుడు ఆ సేల్ డీడ్‌ను రద్దు చేయడంతో ఆ 7 శాతంతో పాటు, మరో 7 శాతం పరిహారంగా చెల్లించాల్సి ఉంది. రూ.300 కోట్లకుగానూ రూ.42 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఆ మొత్తాన్ని చెల్లిస్తేనే సేల్ డీడ్‌ను రద్దు చేస్తారు. ప్రభుత్వభూమిని కొనుగోలు చేయడం, రిజిస్టర్ చేయడం అక్రమమని ఆరోపిస్తూ రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు దిగ్విజయ్ పాటిల్, శీతల్ తేజస్విని, సబ్ రిజిస్ట్రార్ తరులపై కేసు నమోదు చేశారు. భూమి రిజిస్ట్రేషన్ సమయంలో పార్థ పాటిల్ లేకపోవడంతో ఆయనపై కేసు పెట్టలేదు. వతన్‌దారీ రద్దు చట్టం కింద 1958లో మహర్ సామాజిక వర్గానికి వారికి ఈ భూమిని ఇచ్చినట్టు ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. మొత్తం వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు జరిపించాలని ఎన్‌సీపీ (ఎస్‌పీ) నాయకుడు శరద్ పవార్ డిమాండు చేయడం గమనార్హం. రవాణా మంత్రి ప్రతాప్ సర్నాయక్ ముంబయిలోని మీరా భయాందర్‌లో రూ.200 కోట్లు విలువ చేసే నాలుగెకరాల భూమిని కేవలం రూ.3 కోట్లకు కొనుగోలు చేశారని కాంగ్రెస్ నాయకుడు విజయ్ వాడెట్టివార్ ఆరోపించారు. విద్యా సంస్థలు ఏర్పాటు చేయడానికి దాన్ని కొనుగోలు చేశారని విమర్శించారు. ముంబయిలో అంత తక్కువ ధరకు ఎలా కొనుగోలు చేయగలరని ప్రశ్నించారు. ఈ ఆరోపణలను మంత్రి ఖండించారు.

పాక్ సైన్యాధిపతికి త్రివిధ దళాలపై పెత్తనం!

- కొత్తగా సీడీఎఫ్ పదవి ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం.. సెనేట్‌లో బిల్లు
- ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ చేతుల్లో మరింత అధికారం



ఇస్లామాబాద్, నవంబరు 8: అత్యున్నత స్థాయిలో త్రివిధ దళాల సమన్వయానికి పాకిస్థాన్ కొత్తగా 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్' (సీడీఎఫ్) అనే పదవిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సైన్యాధిపతికే ఈ బాధ్యతలు కూడా అప్పగించనుంది. శనివారం ఆ దేశ క్యాబినెట్ ఈ నిర్ణయాన్ని ఆమోదించిన నేపథ్యంలో.. రాజ్యాంగంలో సైనికదళాలకు సంబంధించిన ఆర్టికల్ 243లో సవరణలు ప్రతిపాదిస్తూ అధికారపక్షం.. పార్లమెంటు ఎగువసభ సెనేట్‌లో ఒక బిల్లును ప్రవేశపెట్టింది. దీనిప్రకారం ప్రధానమంత్రి సలహా మేరకు ఆర్మీ చీఫ్‌ను/సీడీఎఫ్‌ను దేశాధ్యక్షుడు నియమిస్తారు. సీడీఎఫ్ ప్రధానితో సంప్రదింపులు జరిపి జాతీయవ్యూహాత్మక కమాండ్ అధిపతిని నియమిస్తారు. కాగా, ప్రస్తుత ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ చేతుల్లో మరింత అధికారాన్ని కేంద్రీకృతం చేయటంలో భాగంగానే ఈ బిల్లును తెచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాది మే నెలలో భారత్‌తో యుద్ధం అనంతరం, పాక్ ప్రభుత్వం ఆయనకు ఫీల్డ్‌మార్షల్‌గా పదోన్నతి కల్పించిన సంగతి తెలిసిందే.

జీ20 సదస్సును బహిష్కరించిన అమెరికా

- ఒక్క అధికారి కూడా వెళ్లరు: ట్రంప్
- దక్షిణాఫ్రికాలో ఎలా నిర్వహిస్తారని ప్రశ్న



వాషింగ్టన్, నవంబరు 8: దక్షిణాఫ్రికాలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్న జీ20 సదస్సును బహిష్కరిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అమెరికా తరఫున ఒక్క అధికారి కూడా హాజరు కాబోరని తెలిపారు. స్థానిక మైనార్టీలైన ఆఫ్రికానర్స్‌పై జరుగుతున్న వేధింపులకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఫ్రాన్స్, జర్మనీ, డచ్ ఇతర దేశాల నుంచి వలస వచ్చి దక్షిణాఫ్రికాలో స్థిరపడ్డవారిని ఆఫ్రికానర్స్‌గా వ్యవహరిస్తుంటారు. కాగా, అసలు దక్షిణాఫ్రికాకు జీ20 కూటమిలో సభ్యత్వం ఎలా ఇచ్చారని, ఆ దేశంలో ఎందుకు సదస్సు నిర్వహిస్తున్నారని ట్రంప్ ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, ఒహాయో రాష్ట్రం గవర్నర్ పదవికి వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా భారత మూలాలు ఉన్న వివేక్ రామస్వామి(38)కి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు. ఆయన చాలా ప్రత్యేకమైన వ్యక్తి అని, విజయం సాధిస్తే గొప్ప రాష్ట్రానికి గొప్ప గవర్నర్ అవుతారంటూ ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. వివేక్ రామస్వామి 'యంగ్, స్ట్రాంగ్, స్మార్ట్' దేశభక్తుడని అభివర్ణించారు.

రాబోయే మూడేళ్లూ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటది

సీఎంగా రేవంత్‌రెడ్డే ఉంటడు.. నవీన్ యాదవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించండి

- నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోండి
- జూబ్లీహిల్స్ ఓటర్లకు జగ్గారెడ్డి విజ్ఞప్తి
- ఈ బస్తీలోనే పుట్టి పెరిగిన వ్యక్తి.. ఉరికే గుర్రంలాంటి వ్యక్తి నవీన్ యాదవ్
- నవీన్‌ను గెలిపిస్తే ఇంటోడు అవుతాడు
- సీఎం రేవంత్ ఇంటికి వెళ్లి పనులు చేయించుకువస్తడు
- ప్రతిపక్ష అభ్యర్థిని గెలిపిస్తే పాలోడవుతాడు
- ధర్నాలు, రాస్తారోకోలకే పరిమితమవుతారు
- 'జూబ్లీహిల్స్' ఓటర్లారా ఆలోచన చేయండి
- కాంగ్రెస్‌పై దుష్ప్రచారాలను నమ్మకండి
- రాజకీయ ఉనికి, కేసీఆర్ వారసత్వం కోసం కేటీఆర్ ఈ ఉప ఎన్నికను వాడుకుంటున్నడు
- జూబ్లీహిల్స్ ప్రజలు కేటీఆర్ మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి



జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రానున్న మూడేళ్లూ ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, సీఎంగా రేవంత్‌రెడ్డే ఉంటాడని.. జూబ్లీహిల్స్ ఓటర్లు ఆలోచన చేసి.. ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ బస్తీల్లోనే పుట్టి పెరిగిన నవీన్ యాదవ్‌ను గెలిస్తే సీఎం రేవంత్ ఇంటికి వెళ్లి మరీ పనులు చేయించుకువస్తారన్నారు. అదే ప్రతిపక్షాల అభ్యర్థి గెలిస్తే.. వచ్చే మూడేళ్లూ ధర్నాలు, రాస్తారోకోలకు పరిమితమవుతారని పేర్కొన్నారు. శనివారం ఇక్కడ మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే ఇంటి మనిషిని గెలిపించినట్లవుతుందని, ప్రతిపక్ష అభ్యర్థిని గెలిపిస్తే పాలోడిని గెలిపించినట్లేనన్నారు. ఇంటి మనిషిని అయితే బెడ్ రూమ్‌లో ఉన్నా వెళ్లి అడిగి పనులు చేయించుకోవచ్చునని, పాలోడికి ఓటేస్తే ఇంటి బయటే ఉండి అడగాల్సి వస్తుందని చెప్పారు. నవీన్ యాదవ్ తనకు చిన్నతనం నుంచీ తెలుసని, రేసుగుర్రంలా పరిగెత్తే యువకుడు, సామాజిక స్పృహ ఉన్న నాయకుడన్నారు. పట్టు విడవకుండా రాజకీయ పోరాటం చేస్తున్నాడని కితాబునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల కన్నా నవీన్ యాదవ్ వంద రెట్లు మెరుగైన వాడన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటను గౌరవించి కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. ఆయన మరింత ఉత్సాహంతో పనిచేస్తారని, మంత్రులూ జవాబుదారీగా పనిచేస్తారని పేర్కొన్నారు. కొల్లూరులో డబుల్ బెడ్‌రూమ్‌లలో నివసించే వాళ్లకు రేషన్ షాప్‌లు లేవని, సీఎం రేవంత్‌రెడ్డి చెప్పగానే ఏర్పాటయ్యాయని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్క హామీ అమలు చేస్తూ వస్తున్నారని, ఓపిక పడితే అన్నీ అమలవుతాయన్నారు. కేటీఆర్.. బక్వాస్ మాటలు నమ్మవద్దని, ఆయన తన రాజకీయ ఉనికి కోసం, కేసీఆర్ వారసత్వం పొందేందుకూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను వాడుకుంటున్నాడని, కాంగ్రెస్‌పై, ప్రభుత్వంపైన దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. హైడ్రా, కాంగ్రెస్‌పైన సోషల్ మీడియాలో వచ్చే దుష్ప్రచారాలను నమ్మవద్దన్నారు. జూబ్లీహిల్స్‌లో హైడ్రా.. ఎక్కడైనా ఇళ్లు కూలగొట్టిందా అని ఆయన ప్రశ్నించారు.

చేవెళ్ల ప్రమాదంలో డ్రైవర్లు మద్యం తీసుకోలేదు

- ఫోరెన్సిక్ రిపోర్టు వెల్లడి



ఆర్టీసీ బస్సు, టిప్పర్ వాహనాలు (ఫైల్)

చేవెళ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్, బస్సుల డ్రైవర్లు ఎలాంటి మద్యం తీసుకోలేదని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ పరీక్షల్లో బయపడింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ గ్రామ సమీపంలో ఈనెల 3న ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో 19 మంది మృతి చెందగా, 34 మందికి గాయాలైన విషయం విదితమే. ఈ ప్రమాదానికి సంబంధించి విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో టిప్పర్ డ్రైవర్ ఆకాశ్‌దాస్య కమల్ (24), బస్సు డ్రైవర్ దస్తగిరి బాబా (31)లు మద్యం సేవించారా? అనే కోణంలో వారి మృతదేహాలను పోలీసులు ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి (ఎఫ్ఎస్ఎల్) పంపించారు. డ్రైవర్లు మద్యం సేవించిన ఆనవాళ్లు లేవని ఆ పరీక్షల్లో తేలిందని చేవెళ్ల ఏసీపీ కిషన్‌గౌడ్ శనివారం స్పష్టం చేశారు. ఇంకా వెహికిల్స్ కండిషన్‌కు సంబంధించిన రిపోర్టు రావాల్సి ఉందని ఏసీపీ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

- జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్‌ను గెలిపించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

శ్రీనగర్ కాలనీ/ఎస్ఆర్ నగర్, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): అన్ని వర్గాల అభివృద్ధి కోసం, పేదరికంలో ఉన్న వ్యక్తి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు, వారిని ముందుకు నడిపేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ క్రైస్తవ ప్రతినిధులు శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ లౌకికవాద పునాదుల మీద ఏర్పడిందని చెప్పారు. సమాజంలో అన్ని వర్గాల అభివృద్ధి కోసం పని చేస్తోందన్నారు. ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించడం కోసం వచ్చిన క్రైస్తవ సోదరులకు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



క్రైస్తవ ప్రతినిధుల సమావేశంలో కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, చిత్రంలో మంత్రి పొంగులేటి

నవీన్ గెలుపునకు ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సమాజ హితం కోసం రాష్ట్ర ప్రభుత్వం శక్తి వంచన లేకుండా పని చేస్తున్నదన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

ప్రజల ఆశలు, ఆకాంక్షలే మా ఎజెండా

- గత పాలకుల తప్పుల్ని సరిదిద్దుతున్నాం: మంత్రి శ్రీధర్‌బాబు

శ్రీనగర్ కాలనీ/ఎస్ఆర్ నగర్, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దిద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో లబ్ధి పొందేందుకు బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా శనివారం శ్రీనగర్ కాలనీ, ఎల్లారెడ్డిగూడలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైందని, బస్తీలు, కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారో నిలదీయాలని పిలుపునిచ్చారు. ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటు వేయాలని కోరారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని కల్యాణ్ నగర్ వెంచర్-3



శ్రీనగర్ కాలనీ, ఎల్లారెడ్డి గూడలో ప్రచారంలో పాల్గొన్న మంత్రులు దుద్దిళ్ల, అడ్లూరి

లోనూ మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణ్ నగర్ వెంచర్ 3 ఫెస్టివల్ పార్కులో మంత్రులు అల్పాహారం తీసుకున్నారు. ప్రచారంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



వెంగళరావునగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల

బీఆర్ఎస్ గెలిస్తే మళ్లీ అరాచకమే

- అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి
- జూబ్లీహిల్స్ ఓటర్లు చరిత్రాత్మక తీర్పు ఇవ్వాలి
- గత ప్రభుత్వ హయాంలో కమ్మ సామాజిక వర్గాన్ని వేధించిన ఘటనలు మరిచిపోలేదు
- టీడీపీ శ్రేణులు ఆత్మగౌరవంతో ఓటేయాలి
- ప్రచారంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బంజారాహిల్స్/వెంగళరావునగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అవినీతి, అరాచకాలను తట్టుకోలేకనే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలిస్తే మళ్లీ అరాచకం పెచ్చరిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రశాంతమైన హైదరాబాద్ కోసం బీజేపీ, బీఆర్ఎస్‌ను తరిమికొట్టాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ పరిధిలోని వెంగళరావ్‌నగర్ డివిజన్‌లో శనివారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా తుమ్మల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ఎన్నికలో చరిత్రాత్మక తీర్పు ఇవ్వాలని ఓటర్లను కోరారు. హైదరాబాద్ సుస్థిర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఓటమి భయంతోనే సామాజిక మాధ్యమాల్లో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటేయాలంటూ కమ్మ సంఘాలకు తాను చెప్పినట్లుగా ఫేక్ ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కమ్మ సామాజికవర్గానికి ఎవరేంటో తెలుసని, గత ప్రభుత్వ హయాంలో వేధించిన ఘటనలు మరిచిపోలేదన్నారు. బీఆర్ఎస్ కపట నాటకాలు ఎలా తిప్పికొట్టాలో టీడీపీ శ్రేణులకు బాగా తెలుసని, ఉప ఎన్నికలో ఆత్మగౌరవంతో ఓటేయాలని కోరారు. అపార్ట్‌మెంట్ వాసులు, విద్యావంతులు పోలింగ్ కేంద్రాలకు రావాలని, ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా తీర్పు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్, బీజేపీ ఎన్ని కుయుక్తులు చేసినా జూబ్లీహిల్స్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం: పొంగులేటి

బోరబండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని కార్మికనగర్‌కు చెందిన సుమారు మూడు వందల మంది యువకులు మంత్రి సమక్షంలో రాత్రి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నివర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, బల్మూరి వెంకట్, మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, ఎన్ఎస్ యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి: మంత్రి వాకిటి

వెంగళరావునగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. వెంగళరావునగర్ డివిజన్ ఏజీ కాలనీలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా ఉన్న క్రీడా మైదానాన్ని సందర్శించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని, వాకింగ్ ట్రాక్, వాకర్స్ కోసం తాగునీటి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు అయ్యేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

అభివృద్ధి కోసం అండగా ఉండండి: జూపల్లి

ఎర్రగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ నాయకత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీ పథకాల ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి అధికార పార్టీతోనే సాధ్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం: మంత్రి వివేక్

యూసుఫ్‌గూడ, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమని, అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా మత్స్యకార మహిళా కార్పొరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల మద్దతు కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. గంగపుత్ర సమాజం నవీన్‌కు మద్దతు తెలపడం ఆనందంగా ఉందన్నారు.

నవీన్ యాదవ్‌కే మా మద్దతు

- ప్రకటించిన కమ్మ, బీసీ, యాదవ సంఘాలు

హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట/బర్కత్‌పుర/రాంనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్‌కు తెలంగాణ రాష్ట్ర కమ్మ సంఘాల సమాఖ్య, జాతీయ (బీసీ) వెనుకబడిన తరగతుల సంఘం, అఖిలభారత యాదవ మహాసభ, బీసీ మేధావుల ఫోరంతో పాటు బీసీ పొలిటికల్ ఫ్రంట్ నేతలు బహిరంగంగా తమ మద్దతు ప్రకటించారు. కమ్మ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు రవిశంకర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్‌కు ఓటు వేయడం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందని, కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తేనే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. జాతీయ(బీసీ) వెనుకబడిన తరగతుల సంఘం అధ్యక్షుడు ఏ.రాజేశ్వర్ యాదవ్ మాట్లాడుతూ.. నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్ యాదవ్ మాట్లాడుతూ, కేటీఆర్ యాదవులను రౌడీలుగా సంబోధించడాన్ని తీవ్రంగా ఖండించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని 35 వేల యాదవ ఓటర్లు నవీన్ యాదవ్ వెంటే ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎగిరేది బీసీల జెండానే అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన నవీన్ యాదవ్‌కు సబ్బండ వర్గాల మద్దతు ఉంటుందని తెలిపారు

పెద్దల మధ్యే జూబ్లీ పోటీ!

కౌంట్‌డౌన్ 3

3 పార్టీల ముఖ్యనేతలకు ప్రతిష్ఠాత్మకంగా ఎన్నిక

- తామే అభ్యర్థులమన్నట్లుగా ప్రచారం
- పరస్పర విమర్శలతో ప్రసంగాల్లో మంటలు
- రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, కేటీఆర్‌దే కీలకపాత్ర
- నేతలందర్నీ మోహరించిన పార్టీలు
- బకాయిల పేరుతో డబ్బులడుగుతున్న ఓటర్లు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారం రసవత్తరంగా సాగుతోంది. ఆదివారం ఒక్కరోజే ప్రచారానికి అవకాశం ఉండగా ప్రధాన పార్టీల ముఖ్య నాయకులు తమ సర్వశక్తులు ఒడ్డి ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా మూడు పార్టీల కీలక నేతలూ తామే అభ్యర్థులమన్నంత పట్టుదలతో తమ పార్టీ అభ్యర్థి విజయం కోసం శ్రమిస్తున్నారు. కాలికి బలపం కట్టుకుని గల్లీల్లో తిరుగుతూ ఓటర్లను కలుస్తున్నారు. ప్రసంగాల్లోనూ అవతలిపక్షం ముఖ్యనేతల మీద పరిధులు దాటి తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, సవాళ్లు విసురుతూ ప్రచార పర్వాన్ని వేడెక్కిస్తున్నారు. అధికారిక కార్యక్రమాలను సైతం పక్కన పెట్టి ప్రచారానికి విలువైన సమయాన్ని కేటాయిస్తున్నారంటే జూబ్లీహిల్స్ ఎన్నికకు ఎంతటి ప్రాధాన్యమిస్తున్నారో అర్థమవుతోంది. ముఖ్యనేతలు ఈ ఎన్నికను తమ 'ప్రతిష్ఠకు సవాలు'గా తీసుకుంటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేటీఆర్, హరీశ్‌రావు తమ పార్టీల నుంచి ప్రచారరంగంలోకి దిగారు. ఓడితే భవిష్యత్తు సమీకరణాలు మారతాయనే భావనే వారిని ప్రచారంలో తలమునకలయ్యేలా చేస్తోంది.

రేవంత్‌కు గెలుపు అవసరం

సీఎం రేవంత్‌రెడ్డికి ఈ ఉప ఎన్నికలో గెలుపు అత్యవసరంగా కనిపిస్తోంది. తన రెండేళ్ల పాలనకు లిట్మస్ టెస్టుగా భావిస్తున్నారు. అందుకే వారం రోజులుగా ప్రచారంలో శ్రమిస్తున్నారు. గెలుపు సాధించడం ద్వారా కాంగ్రెస్ పట్టు కొనసాగుతోందని ప్రజలకు చెప్పదల్చుకున్నారు. గెలిస్తే సీఎంకు మరింత దన్ను లభిస్తుంది. పార్టీ, ప్రభుత్వంలోని అంతర్గత విభేదాలు సద్దుమణుగుతాయి. అందుకే, రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గమంతా కలియదిరిగారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఖాతాలో చేరితే మరింత అభివృద్ధి చేస్తానని భరోసా ఇస్తున్నారు. గెలవాలన్న పంతంతో ప్రచారాన్ని తన భుజాన వేసుకున్నారు.

సిటింగ్ సీటును నిలుపుకోవడం లక్ష్యం

బీఆర్ఎస్ అభ్యర్థి రాజకీయాలకు కొత్త కావడంతో ఆ పార్టీ ప్రచారంలో కేటీఆర్, హరీశ్‌లే ప్రముఖంగా కనిపిస్తున్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో అనివార్యమైన ఉప ఎన్నికలో సిట్టింగ్ సీటును నిలుపుకోవడానికి ఈ ఇద్దరు నేతలు ప్రచారంలో తలమునకలయ్యారు. లోక్‌సభలో ఒక్క సీటు గెలుచుకోక పోయినా 'జూబ్లీ'లో సత్తా చాటి తమ బలం తగ్గలేదని నిరూపించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ నగరం బీఆర్ఎస్‌కు దన్నుగా నిలిచింది. ఈ సానుకూలతను సొమ్ము చేసుకుంటూ కాంగ్రెస్‌పై కొన్ని విషయాల్లో ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకుని ప్రచారం చేస్తున్నారు. హరీశ్ తన తండ్రి చనిపోయిన పది రోజులకే ప్రచారంలోకి దిగారు. ఆ పది రోజులు కూడా వర్క్ ఫ్రమ్ హోమ్ అన్నట్లుగా ఇంటి నుంచే క్షేత్ర స్థాయి నేతలకు ఫోన్లు చేసి, ప్రచారంపై సూచనలు, సలహాలు ఇచ్చారు.

కిషన్‌రెడ్డికి సొంత నియోజకవర్గం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కూడా ఈ ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారింది. జూబ్లీహిల్స్ ఆయన ప్రాతినిధ్యం



వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో ఉంది. దాంతో ఆయనకు అక్కడ సత్తా నిరూపించుకోవాల్సిన పరిస్థితి. అధికారిక విధుల్ని పక్కనబెట్టి జూబ్లీహిల్స్ లోనే ఉండి ప్రచారానికి నాయకత్వం వహిస్తున్నారు. రాత్రిళ్లు ప్రచార వ్యూహాన్ని రూపొందించుకోవడం, ఉదయం నుంచి ప్రచారాన్ని రక్తి కట్టించడం దినచర్యగా మారిపోయింది. దీనికోసం కేంద్ర మంత్రివర్గ సమావేశాలకు కూడా దూరంగా ఉంటున్నారు. జూబ్లీహిల్స్‌ను గెలిపించుకునే బాధ్యత కిషన్‌రెడ్డిదేనంటూ ఇటీవల బీజేపీ ఎంపీ అర్వింద్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఆత్మరక్షణలో పడిన కిషన్‌రెడ్డి ఉప ఎన్నికల్లో సత్తా చూపాలన్న పట్టుదలను చూపుతున్నట్లు చర్చ జరుగుతోంది. మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా ప్రచార రంగంలోకి దిగారు. నగరంలో బీజేపీకి పట్టు ఉందన్నది నిరూపించుకోవడం బీజేపీకి ముఖ్యం.

పోటాపోటీ ప్రచారం

ప్రధాన పార్టీల ముఖ్యనేతలు ఇప్పటికే నియోజకవర్గం మొత్తాన్ని చుట్టి వచ్చారు. ప్రధాన కులాల వారితో సమావేశాలు నిర్వహించి, భరోసాకల్పిస్తున్నారు. రెండు జాతీయ పార్టీల జాతీయ నేతలు కూడా తమవంతు సాయం చేస్తున్నారు. ఏఐసీసీ రాష్ట్ర నియోజకవర్గ నేతలకు తగిన సూచనలిస్తూ ప్రోత్సహిస్తోంది. బీజేపీ తరఫున కేంద్రమంత్రులే వచ్చి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ కేడర్ అంతా నియోజకవర్గంలోనే ఉంది.

ఎక్కలేక దిగలేక...

జూబ్లీహిల్స్‌లో అభ్యర్థుల కంటే ఎక్కువగా మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ముఖ్య నేతలు చెమటోడ్చుతున్నారు. అపార్ట్‌మెంట్లు ఎక్కలేక, దిగలేక అవసోపాలు పడుతున్నారు. ఓటర్లు కిందకు వస్తే మూకుమ్మడిగా ఓట్లను అభ్యర్థించాలని ఆశించిన నేతలకు నిరాశే ఎదురవుతోంది. మంత్రి స్థాయి నేతలు వచ్చినపుడు దిగుతున్నారు కానీ ఇతర ప్రాంతాల ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు వచ్చినపుడు ఓటర్లు కిందకు దిగడం లేదు. బోరబండ, రహమత్‌నగర్, యూసఫ్‌గూడ, ఎర్రగడ్డ, షేక్‌పేట, వెంగళ్‌రావు నగర్ డివిజన్లలో బస్తీల్లోనే వ్యక్తిగత ఇళ్లున్నాయి. ఎక్కువగా అపార్ట్‌మెంట్ కమ్యూనిటీలే ఉంటున్నాయి. బ్లాక్‌లతో ఉన్న అపార్ట్‌మెంట్లలో 150-200 కుటుంబాలు ఉంటే, ఐదంతస్తుల అపార్ట్‌మెంట్లలో 20-30 కుటుంబాలుంటున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు కూడా తలుపుతట్టి ప్రచారం చేయాల్సి వస్తోంది. మధురానగర్‌లో వరంగల్ జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి.. అపార్ట్‌మెంట్‌కు వెళ్తితే ఎవరూ కిందకు దిగలేదు. 40 కుటుంబాలు, వంద ఓట్లు ఉండటంతో వదిలిపెట్టే సాహసం చేయరు. పైగా అపార్ట్‌మెంట్ లిఫ్ట్ పాడైంది. దాంతో ఆయన ఐదు అంతస్తులు ఎక్కడానికి, దిగడానికి ఇబ్బందులకు గురయ్యారు. ఇలా అపార్ట్‌మెంట్ల ప్రచారంలో ఎక్కడానికి, దిగడానికి పార్టీ నేతలు, కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు.కొన్నిచోట్ల అపార్ట్‌మెంట్ వాసులు పట్టు బట్టి గొంతెమ్మ కోర్కెలను నెరవేర్చుకుంటున్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో వెయ్యి ప్లాట్ల కమ్యూనిటీ ఏదో సంస్థకు 18 లక్షల బకాయి ఉంది. దాన్ని చెల్లించాలని ఓట్లు అడగడానికి వచ్చిన పార్టీ నేతల ముందు డిమాండ్ పెట్టారు. 12 లక్షలు చెల్లించినా చాలని బేరం పెట్టారు. ఇంతలో మరోపార్టీ 18 లక్షలు చెల్లిస్తామని బేరం కుదుర్చుకుంది.

కిషన్‌రెడ్డి, రేవంత్‌ది ఫెవికాల్ బంధం

- ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం.. ఉత్తి మాటే: హరీశ్



హైదరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డిది ఫెవికాల్ బంధమని, బీజేపీతో అంటకాగుతున్న సీఎం.. ఢిల్లీలో చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ధ్వజమెత్తారు. దొంగే దొంగ అన్నట్టుగా సీఎం తీరు ఉందని విమర్శించారు. బిహార్ ఎన్నికలకు డబ్బులు పంపుతున్నారన్న ఆరోపణలతో ఢిల్లీలోని భట్టి విక్రమార్క ఇంట్లో ఐటీ దాడులు జరిగాయని, గతంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంట్లో ఈడీ దాడులు జరిగాయని.. ఆ వివరాలు ఎందుకు బయటకు రావడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమం ఉత్తి మాటేనని విమర్శించారు. కాంగ్రెస్ చేతలన్నీ బడా బాబులకు వంత పాడేలా ఉన్నాయని మండిపడ్డారు. "రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రెండు రూపాయలూ ఇవ్వని కాంగ్రెస్ సర్కారు.. బడా కాంట్రాక్టర్లకు మాత్రం భారీగా బిల్లులు చెల్లించింది. సీఎంకు పిల్లల చదువులు ముఖ్యమా? కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లు ముఖ్యమా?" అని నిలదీశారు. ఉద్యోగులకు ఐదు డీఏలను పెండింగ్‌లో పెట్టిన ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ అని విమర్శించారు. పీజేఆర్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదన్నారు. అంబేడ్కర్ పేరుందనే సచివాలయానికి రావడం లేదని ఆరోపించారు. వెంకటేశ్వరస్వామి కల్యాణం పేరుతో జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ చీరలు, సారెలు పంచుతోందని, ఎన్ని చేసినా ఓటర్లు లైన్లు కట్టి బీఆర్ఎస్‌కే ఓటేయాలని డిసైడ్ అయ్యారన్నారు. కాగా, కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి.. మోదీ శిష్యులేనని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఉప ఎన్నికలో ఎలాగైనా గెలవాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. ప్రణాళికా బద్ధంగా అక్రమాలకు పాల్పడుతోందని దాసోజు శ్రావణ్ కుమార్ ఆరోపించారు.

బీఆర్ఎస్ సభలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తమ్ముడు

- ఆ పార్టీకి మద్దతుగా మధు ప్రచారం

సంగారెడ్డి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి.. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ కండువా కప్పుకున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తమ్ముడు మధుసూదన్‌రెడ్డి తీరు చర్చనీయాంశంగా మారింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా శుక్రవారం కొల్లూరు డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులతో బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేసింది. ఈ సభకు హాజరైన మధు.. హరీశ్‌రావుతో కరచాలనం చేసి ఆ వేదికపైనే కూర్చున్నారు. అయితే, ఇటీవల ఓ మంత్రితో పొసగక ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సూచన మేరకే మధు బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలిచారనే చర్చ జరుగుతోంది.

రేవంత్, కేసీఆరే బ్యాడ్ బ్రదర్స్

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్‌తో కలిసి కిషన్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. తెరచాటు రాజకీయాలు చేయడంలో కేసీఆర్, రేవంత్ దిట్ట అని, వారిద్దరూ తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని ఆరోపించారు. ఎంఐఎంను పెంచి పోషించి, వారి కనుసైగల్లో, వారి ఆలోచనలను అమలు చేస్తున్నారని విమర్శించారు. తమ వైఫల్యాలను, అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంపై, బీజేపీపై నెపం మోపుతున్నారని మండిపడ్డారు. "అవినీతి కేసుల నుంచి కేసీఆర్‌ను కాపాడుతున్నది మీ అధినాయకత్వం కాదా? మీ నాయకత్వం, బీఆర్ఎస్ ఢిల్లీలో ఒప్పందం చేసుకున్న విషయం వాస్తవం కాదా? చీము, నెత్తురు ఉంటే, దమ్ము ధైర్యం ఉంటే బీజేపీ, బీఆర్ఎస్ ఏ విషయంలో ఒక్కటయ్యాయో ముఖ్యమంత్రి నిరూపించాలి" అని కిషన్‌రెడ్డి సవాల్ చేశారు.



ఫోన్ ట్యాపింగ్ కేసు, విద్యుత్ కొనుగోళ్ల కేసు ఏమైందని, ఒక్క బీఆర్ఎస్ నేతపైనైనా చర్యలు తీసుకున్నారా? అని ప్రశ్నించారు. గడచిన పదేళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన నిధులను మరోసారి గణాంకాలతో సహా వివరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, వినే ధైర్యం రేవంత్‌కు, కేటీఆర్‌కు ఉందా? అని సవాల్ చేశారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని రేవంత్ ఆరోపించడం దిగజారుడు రాజకీయమని, కాంగ్రెస్ ఓడిపోతుందనే భయంతో ముఖ్యమంత్రి సోయి తప్పి మాట్లాడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫేక్ వీడియోలతో ప్రచారం చేశాయని, జూబ్లీహిల్స్‌లోనూ అలాగే చేస్తున్నాయని ఆరోపించారు. "రేవంత్ ప్రభుత్వం.. ఫేక్, ఫ్రాడ్, ఫాల్స్, ఫెయిల్యూర్ ప్రభుత్వం. గతంలో కేసీఆర్ ఫ్యామిలీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రభుత్వం ఉంటే.. ఇప్పుడు సోనియా ఫ్యామిలీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రభుత్వం ఉంది" అని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు: కె.లక్ష్మణ్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓటమి తప్పదని తేలిపోయిందని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి నిరాశా నిస్పృహలతో బీజేపీపై నిందలు వేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, గన్ కల్చర్ పెరిగిపోయిందని ఆరోపించారు. మాటలు తప్ప.. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన కానుక ఏమిటని ప్రశ్నించారు.

గుంభనంగా..

(మొదటిపేజీ తరువాయి)

అనే కామన్ పాయింట్ ప్రధాన పార్టీలను కలవరానికి గురిచేస్తోంది. ఊహించని విధంగా భారీగా ఉన్న ఈ సైలెంట్ ఓటింగ్ ఎవరి కొంప ముంచుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. సర్వేల్లోనే కాకుండా.. క్షేత్రస్థాయిలో ఓటరును పలకరించినా వ్యూహాత్మక సమాధానమే వస్తోంది. పార్టీలకు పక్కా ఓటర్లుగా ఉన్నవారు తాము ఎవరివైపో బహిరంగంగానే చెప్పేస్తున్నా.. ఏదీ చెప్పకుండా తప్పించుకుంటున్నవారూ పెద్దసంఖ్యలోనే ఉంటున్నారు. ప్రభుత్వం ఎలా ఉంది? ప్రతిపక్షాలు ఎలా ఉన్నాయి? అనే అంశం నుంచి ప్రపంచ రాజకీయాల దాకా అన్నీ మాట్లాతున్నాడు కానీ.. తన ఓటు ఎవరికి అంటే మాత్రం చెప్పడంలేదు.

మాకూ ఓ లెక్కుంది..!

డివిజన్ల వారీగా తమకు పడే ఓట్లు ఇన్ని అంటూ పార్టీలు, నాయకులు ఎవరి లెక్కల్లో వారు ఉంటే.. ఓటర్లు కూడా తమ లెక్క తమకు ఉందన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఓటరు మనోగతం తెలుసుకోవడం పార్టీలకు కష్టతరంగా మారింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట, బోరబండ, రహమత్‌నగర్, ఫిలింనగర్ ప్రాంతాల్లో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు పర్యటించి ఓటర్ల అభిప్రాయాలు కోరగా.. వారి నుంచి వ్యూహాత్మక సమాధానాలే వచ్చాయి. "పెళ్లి చేసి పంపించడమే మన వరకు ఉంటుంది. అబ్బాయి పుడుతుందా? అమ్మాయి పుడుతుందా? అన్నది డెలివరీ అప్పుడే తెలుస్తుంది" అని ఒక ఓటరు వ్యాఖ్యానించాడు. ఇంకో ఆయన్ను గుచ్చి గుచ్చి అడిగితే, 'అంతా ఎటువేస్తే నేనూ అటే' అన్నాడు. ఇంకో ఆయనైతే, "మీరు సర్వే చేస్తున్నారా? మీ సర్వేలో ఏమొచ్చింది?" అని ఆసక్తిగా అడిగాడు తప్ప.. తన మనసులో ఏముందో మాత్రం చెప్పలేదు. ఇక యువతరం ఓటర్లలో కొందరు తాము ఏ పార్టీకీ ఓటు వేసేది లేదని నిక్కచ్చిగా చెబుతున్నారు. ఒక మెకానిక్ షాపులో ఉన్న వ్యక్తిని పక్కకు తీసుకెళ్లి ఒంటరిగా ప్రశ్నించగా, 'ఎవరికి వేస్తే మాత్రం ఏం లాభం!' అని వ్యాఖ్యానించాడు. కొన్ని డివిజన్లలోని బస్తీల్లో ఓటర్లను కదిలించగా, 'మా బస్తీ పెద్దమనిషి ఎవరికి చెప్తే వారికి వేస్తాం. ఈసారి ఇంకా చెప్పలేదు' అని అన్నారు. అయితే ఇలా చెప్పిన వారిలో మహిళలే ఎక్కువ మంది ఉన్నారు.

అన్ని పార్టీల్లోనూ కుల సంఘాల నేతలు..

నియోజకవర్గంలో రాజకీయ పార్టీల నేతలు ఎవరికి వారు ప్రచారం చేస్తుండగా.. మరోవైపు కులసంఘాల నేతలు కూడా ఎక్కడికక్కడ సమావేశాలు నిర్వహిస్తున్నారు. గంగపుత్రుల సంఘం, కమ్మ సంఘం, రెడ్డి సంఘం, బీసీ సంఘాలు, ఎస్సీ, ఎస్టీ సంఘాలు ఇలా ప్రతి ఒక్కటీ ఎక్కడో ఒకచోట సమావేశం పెడుతున్నాయి. తమకు నచ్చిన పార్టీకి ఓటు వేయాలని చెబుతున్నాయి. అయితే షేక్‌పేటలో ఒక చోట గంగపుత్రుల సంఘం సమావేశం పెట్టి ఒక పార్టీకి ఓటేయాలని చెప్పగా.. బోరబండలో అదే గంగపుత్రులతో ఉన్న మరో సంఘం ఇంకో పార్టీకి ఓటేయమని చెప్పింది. అన్ని సంఘాలు, వాటిలోని నేతలు అన్ని పార్టీల్లోనూ ఉండడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది.

ఒక్కొక్కరు ఒక్కో పార్టీకి..

బోరబండ డివిజన్‌లోని కళ్యాణ్‌నగర్, రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాల్లోని ఓటర్లు మిశ్రమంగా స్పందించారు. "గతంలో బీఆర్ఎస్‌కు వేశాను. కానీ, ఈసారి కాంగ్రెస్‌కు వేద్దామనుకుంటున్నాను. అధికారంలో ఉన్న పార్టీ గెలిస్తేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంది" అని ఓ యువకుడు అన్నారు. ఓ ముస్లిం ఓటరు మాత్రం, "కాంగ్రెస్ ముస్లింకు మంత్రి పదవి ఇచ్చినంత మాత్రాన ముస్లింల ఓట్లు పడతాయా? ఎన్నికలప్పుడు అవసరానికి మమ్మల్ని మచ్చిక చేసుకోవాలని చూస్తే.. ఏది నిజమో, ఏది మోసమో మాకు తెల్వదా? అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చినంత మాత్రాన మాకు ఏమైనా లాభం చేకూరుతుందా?" అని ప్రశ్నించారు. ఇక ఉచిత బస్సు పథకంపై మహిళలు సానుకూలంగా ఉండగా, పురుషులు అందుకు భిన్నంగా స్పందించారు. మహిళలకు ఉచితమని చెప్పి.. పురుషుల మీద ఆ భారం వేశారని వాపోయారు.

మొదటిసారి ఓటర్లూ అంతే..!

మొదటిసారి ఓటుహక్కు వచ్చినవారు కూడా తమ ఓటు ఎవరికి అన్నది చెప్పడం లేదు. తమకు రాజకీయాలంటే పెద్దగా ఆసక్తి లేదని, ఎవరికో ఒకరికి ఓటేస్తామని అంటున్నారు. కొన్ని డివిజన్లలో మాత్రం యువత తాము ఏ పార్టీకి ఓటేస్తామన్నది మొహం మీదే చెబుతున్నారు. షేక్‌పేట, రహమత్‌నగర్ డివిజన్‌లలో కొందరు ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల యువత మాత్రం ఏ పార్టీకి ఓటెయ్యబోమని, నోటాకు వేస్తామని చెప్పడం గమనార్హం.

ఎవరు పైసలిస్తే వారికే ఓటు!

కొందరు ఓటర్లు తమకు డబ్బులిచ్చిన పార్టీకే ఓటు వేస్తామని చెప్పారు. "పార్టీల నాయకులంతా పైసలు పంచుతున్నారు. మాకు మాత్రం ఎవరూ ఇయ్యలేదు. పైసలిస్తేనే ఓటు వేస్తాం. లేదంటే లేదు" అని షేక్‌పేట డివిజన్‌లోని ఐకమత్యనగర్‌లో ఓ గల్లీలోని మహిళలు తెగేసి చెప్పారు. బోరబండలో కూడా కొన్ని చోట్ల, 'మా ఇంట్లో ఆరు ఓట్లున్నాయి. డబ్బులను బట్టి, బస్తీ సంఘాలు చెప్పినదాన్ని బట్టి పోలింగ్ రోజు డిసైడ్ చేస్తాం'అని అన్నారు. 'నాయకుల మస్తు సంపాదించుకుంటరు.మాకు ఎన్నికలప్పుడే కదా ఇచ్చేది! ఎందుకు వదలాలి' అని సీతానగర్ బస్తీలో ఒక ఓటరు వ్యాఖ్యానించాడు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.







తెలుగు సినీ సింహాసనాన్ని ఆదిష్టించి, పద్మాలయా స్టూడియోస్ స్థాపించి, సాహసానికి
మారుపేరుగా నిలిచి చరిత్ర సృష్టించిన సూపర్ స్టార్ కృష్ణగారితో "అగ్నిపర్వతం" నిర్మించి,
ప్రేక్షకుల హృదయాలలో 'జమదగ్ని'గా ఆయన స్థానాన్ని పదిలపరిచిన
అగ్రనిర్మాత అశ్వినీదత్ గారు....

నటశేఖర కృష్ణగారి వారసుడు ప్రిన్స్ మహేష్ బాబును "రాజకుమారుడు" సినిమాతో
చిత్రసీమకు పరిచయం చేసి, సూపర్ స్టార్ గా ఆయన ఎదుగుదలకు పునాది వేసింది
వైజయంతి మూవీస్ అధినేత అశ్వినీదత్ గారు....

మూడు తరాల నట వారసత్వానికి కొనసాగింపుగా నేడు పద్మభూషణ్ ఘట్టమనేని కృష్ణ గారి
దివ్య ఆశీస్సులతో, ఘట్టమనేని ఆదిశేషగిరిరావు గారి ఆత్మీయ దీవెనలతో,
సూపర్ స్టార్ మహేష్ బాబు గారి ప్రేమాభిమానాలతో కృష్ణ గారి మనవడు
ఘట్టమనేని "జయకృష్ణ"ను యంగ్ స్టార్ గా తెలుగు సినీ ప్రపంచానికి
పరిచయం చేస్తూ, నవ శకానికి నాందిగా మరో ప్రతిష్టాత్మక చిత్రానికి
శ్రీకారం చుట్టిన అశ్వినీదత్ గారికి హృదయపూర్వక అభినందనలు.

పద్మాలయా స్టూడియోస్, వైజయంతి మూవీస్ సంస్థల బంధం
తరతరాల వెండితెర అనుబంధం.

\- పద్మాలయా స్టూడియోస్ 